PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 120 | విజయవాడ, గురువారం 1 డిసెంబర్ 2022 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Thursday 1 December 2022 | Rs



చైనా మాజీ అధ్యక్షుడు జియాంగ్ జెమిన్ కన్నుమూత


● లోపలి పేజీలో.. ●

ప్రి క్వార్టర్స్‌కు ఫ్రాన్స్, ఆస్ట్రేలియా



- ఇంగ్లండ్, అమెరికా కూడా..
- ఫిఫా ప్రపంచకప్

● లోపలి పేజీలో.. ●



విద్యా దీవెనకు బటన్ నొక్కి విడుదల చేస్తున్న సిఎం జగన్

ఉపాధ్యాయులపై ఉక్కుపాదం

బకాయిలు అడిగినందుకు అరెస్టులు

ధర్నా శిబిరాన్ని ధ్వంసం చేసిన పోలీసులు

నిరసనగా 'జాగరణ'

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులపై మరోసారి ఉక్కుపాదం మోపింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని ధర్నా చేపట్టిన యుటిఎఫ్ నాయకులను, మద్దతు తెలిపిన పిడిఎఫ్ ఎమ్మెల్సీలను పోలీసులు అరెస్ట్ చేశారు. ధర్నా శిబిరాన్ని ధ్వంసం చేశారు. దీంతో విజవాడలోని ధర్నా చౌక్ వద్ద బుధవారం ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. నెలల తరబడి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలనే డిమాండ్‌తో విజయవాడలో ధర్నాకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు మంగళవారం నుంచే ఉపాధ్యాయులపై నిర్బంధం ప్రయోగించారు. వివిధ జిల్లాల్లో ముందస్తు అరెస్టులు చేశారు. బుధవారం ఉదయం నుంచే దీక్షా శిబిరం వద్ద పెద్దఎత్తున మోహరించారు. ధర్నా శిబిరం వైపు ఎవరినీ రానీయలేదు. వాహనాలూ రాకుండా బారికేడ్లను అడ్డుపెట్టారు. నిర్బంధాన్ని అధిగమించి ధర్నా శిబిరంలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు, తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ పోలీసులు అడ్డుకున్నారు.

అరెస్టు సమయంలో ఎమ్మెల్సీ వెంటకేశ్వరరావు ప్రతిఘటించడంతో ఆయన్ని ఎత్తుకెళ్లి వ్యానులో ఎక్కించారు. అనుమతి ఉన్నప్పటికీ ఎన్నడూ లేని విధంగా ధర్నా శిబిరాన్ని పోలీసులు ధ్వంసం చేశారు. టెంట్లను పీకేశారు. కుర్చీలను పక్కనపడేశారు. ఎమ్మెల్సీలు, నాయకులను అరెస్టు చేసేందుకు ప్రయత్నించడంతో కొంతసేపు వాగ్వివాదం జరిగింది. దీంతో ఉద్రిక్తత నెలకొంది. అనంతరం నాయకులను బలవంతంగా పోలీసు వ్యానుల్లో ఎక్కించారు. వారిని సింగ్‌నగర్‌లోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఏఎన్ కుసుమకుమారి, కార్యదర్శి బి లక్ష్మీరాజా, ఏ కృష్ణసుందరరావు, ఐక్యఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు, ప్రచురణ విభాగం ఛైర్మన్ ఎం హనుమంతరావు ఉన్నారు. వీరిని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు పరామర్శించారు. ధర్నాకు అనుమతి ఇచ్చి కూడా అడ్డుకోవడం, నిర్బంధించడం అక్రమం అని పేర్కొన్నారు. ఈ అరెస్టులు, నిర్బంధాలకు నిరసనగా యుటిఎఫ్ నిరసన జాగరణ కార్యక్రమం నిర్వహించింది. యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆరు గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగింది.



అరెస్టులను ఖండించిన సిపిఎం

ఉపాధ్యాయులు తలపెట్టిన ధర్నాను అడ్డుకొని అరెస్టు చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పిఆర్‌సి చర్చల

మిగతా 2లో

ఆర్థికం తిరోగమనం

- క్యూ2లో వృద్ధి 6.3 శాతమే..

న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థ అన్ని రంగాల్లో దూసుకుపోతోందని బిజెపి పాలకులు చేస్తున్న ప్రచారానికి వాస్తవ పరిస్థితులు భిన్నంగా చోటు చేసుకుంటున్నాయి. అత్యంత ముఖ్యమైన తయారీ, గనుల రంగాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కోవడంతో ఆర్థిక వ్యవస్థ తిరోగమనాన్ని చవి చూసింది. ఈ క్రమంలోనే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) 6.3 శాతానికి పరిమితమయ్యింది. ఇదే విషయాన్ని బుధవారం కేంద్ర గణంకాల శాఖ అధికారికంగా వెల్లడించింది. దీంతో దేశం ఆర్థిక మాంద్యంలోకి జారుకుంటోందని స్పష్టమవుతోంది. మరోవైపు అమ్మకాలు పడిపోయి తయారీ రంగం భారీ పతనాన్ని చవి చూసింది. గడిచిన సెప్టెంబర్ త్రైమాసికంలో భారత తయారీ రంగం ఏకంగా (-)4.3 శాతం ప్రతికూల వృద్ధిని చవి చూసింది. ఇంతక్రితం త్రైమాసికంలో ఈ రంగం 5.6 శాతం పెరుగుదలను కనబర్చింది. ఇదే సమయంలో వ్యవసాయ రంగం 4.5 శాతం పెరగ్గా.. గడిచిన క్యూ2లో 4.6 శాతం వృద్ధిని సాధించి .ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు మాసాల్లో భారత జిడిపి 9.7 శాతంగా నమోదుకాగా, గతేడాది ఇదే సమయంలో 13.7 శాతం వృద్ధి చోటు చేసుకుంది. దేశంలో తయారీ రంగం బలహీనపడుతోందని.. ఈ ప్రభావం వృద్ధి రేటును దెబ్బతీయనుందని ఇటీవల ఎస్‌బిఐ ఓ రిపోర్టులో పేర్కొంది. 2022-23లో భారత జిడిపి 9.2 శాతం వృద్ధిని కనబర్చనుందని ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అంచనా వేశారు. దీనికి భిన్నంగా ఫలితాలు రావడం ప్రభుత్వ పనితీరును ప్రశ్నిస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు.

పెత్తందారీశక్తుల దుష్ప్రచారం నమ్మొద్దు

- రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలాలివ్వొద్దనడం దారుణం
- జగనన్న విద్యా దీవెన కింద రూ.694 కోట్లు జమ చేసిన సిఎం

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

పెత్తందారీశక్తుల దుష్ప్రచారాన్ని నమ్మొద్దని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లిలోని టిప్పు సుల్తాన్ గ్రౌండ్‌లో బుధవారం నాలుగో విడత జగనన్న విద్యాదీవెన కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పెత్తందారీ మనస్తత్వాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం చదువులొద్దనడం మొదలుకుని రాజధానిని వీళ్లు ఎంపిక చేసిన ఫలానా ప్రాంతంలోనే, వీళ్ల అనుచరులు కొనుగోలు చేసిన ఫలానా పొలాల్లోనే పెట్టాలనడం దారుణమని విమర్శించారు. రాజధాని ప్రాంతంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే సామాజిక సమతుల్యత దెబ్బతింటుందనే పెత్తందారీ పోకడలను మానుకోవాలని హితవు పలికారు. తన మూడున్నరేళ్ల పాలనలో విద్యారంగానికి రూ.55 వేల కోట్లు ఖర్చు చేశానని తెలిపారు. అమ్మ ఒడికి రూ.19,617 కోట్లు, విద్యాదీవెనకు రూ.9,051 కోట్లు, వసతి దీవెనకు రూ.3,349 కోట్లు, గోరుముద్దకు రూ.3,239 కోట్లు, నాడు-నేడు మొదటి విడతకు రూ.3,669 కోట్లు, రెండో విడతకు రూ.8 వేల కోట్లు, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణకు రూ.4,895 కోట్లు, ఆడపిల్లల నాప్‌కిన్లకు రూ.32 కోట్లు సహా ఈ ఏడాది ఎనిమిదో తరగతి పిల్లలకు ట్యాబ్‌లకు రూ.685 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఉన్నత చదువుల కోసం కరిక్యులమ్‌ను జాబ్ ఓరియంటేడ్‌గా మార్పులు చేస్తున్నామని తెలిపారు. డిగ్రీలోనే ఇంటర్న్‌షిప్ మొదలుకుని ఆన్‌లైన్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఉద్యోగావకాశాలు పొందే వెసులుబాటు కల్పించామన్నారు. నవరత్నాల పేరుతో అమలవుతున్న సంక్షేమాలను చూసి జీర్ణించు కోలేక రాష్ట్రం శ్రీలంక అవుతోందని విమర్శిస్తు న్నారని, వీళు అధికారంలో ఉన్నప్పుడు అమెరికా అయిందట అని ఎద్దేవా చేశారు. ముందుగా రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి, మిధున్ రెడ్డి మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్ బాషా ప్రసంగించారు. తర్వాత బటన్‌నొక్కి విద్యా దీవెన నిధులను 11,0200 మంది తల్లుల ఖాతాల్లో రూ.694 కోట్లు జమ చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి నెలకొల్పిన మూడు ఎక్స్‌లెన్సీ అవార్డులను ప్రదానం చేశారు. ముఖ్యమంత్రిని మదనపల్లికి చెందిన మైనార్టీ నాయకులు సన్మానించారు.

తాటాకు చప్పుళ్లకు భయపడను



విజయరాయిలో మాట్లాడుతున్న చంద్రబాబు

- నాకు ప్రజల అండ ఉంది
- 'ఇదేం ఖర్మ' ప్రారంభంలో టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

తాటాకు చప్పుళ్లకు తాను భయపడే రకం కాదని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా టిడిపి ప్రకటించిన 'ఇదేం ఖర్మ' కార్యక్రమాన్ని ఆయన బుధవారం ఏలూరులో ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో మాట్లాడిన ఆయన వైసిపి వాళ్లు తనను, లోకేశ్‌ను టార్గెట్ చేసినట్టు చెబుతున్నారని, అయితే ఇటువంటి వాటికి తాను భయపడనని చెప్పారు. 'నీకు పోలీసుల అండ ఉంటే నాకు ప్రజల అండ ఉందని వ్యాఖ్యానించారు. కలపర్రు టోల్‌గేట్ వద్ద చంద్రబాబుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి పెద్ద ఎత్తున బైక్ ర్యాలీతో పెదవేగి మండలం విజయరాయి చేరుకున్నారు. జానంపేట వంటి పలు చోట్ల చంద్రబాబుకు హారతులతో మహిళలు స్వాగతం పలికారు. విజయరాయిలో కొంతమంది ఇళ్లకు వెళ్లి ప్రస్తుత పాలనలో ఎదుర్కొంటున్న సమస్యలను చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక సెంటర్‌లో వాహనంపై నుంచి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టుకు అన్ని ఆటంకాలూ తొలగించి 72 శాతం పనులు పూర్తి చేస్తే జగన్ అధికారంలోకొచ్చి మిగిలిన పనుల్లో ఏఒక్కటీ పూర్తి చేయకుండా ప్రాజెక్టును గోదావరిలో ముంచేశారని అన్నారు. కొత్తగా వచ్చిన మంత్రికి డయాఫ్రంవాల్ ఎక్కడ ఉంటుందో తెలీదంటూ ఎద్దేవా చేశారు. స్థానిక ఎంఎల్ఎ కొఠారు అబ్బాయిచౌదరిని లండన్ బాబూ అంటూ విమర్శలు గుప్పిస్తూ 'మళ్లీ లండన్ పంపిస్తా'... ఎవరితో పెట్టుకుంటున్నావో మరిచిపోకు అంటూ హెచ్చరించారు. వివేకా హత్య కేసును సుప్రీంకోర్టు తెలంగాణకు అప్పగించడం జగన్‌కు చెంపపెట్టు అన్నారు. విద్యుత్తు బిల్లులు, ఆర్‌టిసి ఛార్జీలు, నిత్యావసరాలు, వంట నూనె, పెట్రోలు, డీజిల్, మద్యం వంటి ధరలు పెరిగిపోయి జనం ఇదే ఖర్మ అంటూ తీవ్ర ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. జగన్ అధికారంలోకి వస్తే ఏం జరుగుతుందో ఆనాడే తాను చెప్పానన్నారు. ఇసుక, పోలవరం కాలువ గట్లు మాయం చేస్తున్నారని ఆరోపించారు. 96 శాతం హామీలు అమలు చేస్తే ప్రజలకు ఈ కష్టాలు ఎందుకని ప్రశ్నించారు. ఊరికో సైకోను తయారు

మిగతా 2లో

గురజాడ ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం

- వర్ధంతి సభలో వక్తల ఉద్ఘాటన

● లోపలి పేజీలో.. ●

లోకో పైలట్ల సమస్యలపై దశలవారీ పోరాటం


- 76 మందితో నూతన కార్యవర్గం
- అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఎంఎన్ ప్రసాద్, కెసి జేమ్స్

కుల వివక్ష నిర్మూలనకు చర్యలు

- కెవిపిఎస్ రాష్ట్ర మహాసభ తీర్మానం
- నూతన అధ్యక్ష కార్యదర్శులుగా నల్లప్ప, మాల్యాద్రి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నో ఐక్య ఉద్యమాల ద్వారా సాధించుకున్న ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌ను ఈ ప్రభుత్వాలు సక్రమంగా అమలు చేయనందున అమలును మరికొంతకాలం పొడిగించాలని, ప్రైవేట్ రంగంలో ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్ల అమలును చట్టబద్దం చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర మహాసభ తీర్మానించింది. కుల వివక్షను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలనీ కోరింది. కర్నూలు నగరంలో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర మహాసభలో తీసుకున్న నిర్ణయాలపై బుధవారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం నూతన కార్యదర్శులు ఎ.మాల్యాద్రి, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి నటరాజ్, సహాయ కార్యదర్శి జి క్రాంతికుమార్, మీడియాకు వివరించారు. నూతన కమిటీలో 67 మంది సభ్యులు ఉన్నారని, వారిలో 15 మందితో కార్యకవర్గం ఎన్నికయినట్లు తెలిపారు. నూతన అధ్యక్షులుగా ఓ.నల్లప్ప, కార్యదర్శిగా ఆంధ్ర మాల్యాద్రి, ఉపాధ్యక్షులుగా వి శ్రీనివాసరావు, దడాల సుబ్బారావు, గుడిసె నటరాజ్, ఎమ్‌డి ఆనందబాబు, బూరగ లక్ష్మి, టి చిరంజీవి, పి వసంతకుమార్, సహాయ కార్యదర్శులుగా గుండిమెడ క్రాంతికుమార్, బి రఘురామ్, కె కాంతిబాబు, ఎ తిరుపాలు, జి రవిబాబు, కె రంగమ్మ ఎన్నికైనట్లు తెలిపారు. ఈ మహాసభల్లో రాష్ట్రంలో





దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేసినట్లు తెలిపారు. కులవివక్షతను పూర్తిస్థాయిలో నిర్మూలించే చర్యలతోపాటు దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీచేయాలని, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని మహాసభ తీర్మానించినట్లు తెలిపారు. కోసం ప్రతి కుటుంబానికి మూడు ఎకరాల భూమినిగాని, రూ.25లక్షల డబ్బులుగాని ఇవ్వాలని కోరారు. డప్పు కళాకారుల సమస్యలపై చర్చించి వారందరికీ గుర్తింపు కార్డులు, పింఛన్లు, రుణాలను ఇవ్వాలని, వ్యవసాయ కార్మికులకు సమగ్రచట్టం చేయాలని, కౌలు రైతులందరికీ గుర్తింపుకార్డులు, రుణాలను ఇవ్వాలని తీర్మానించినట్లు వివరించారు. అసంఘటితరంగ కార్మికులకు సాంఘిక భద్రతా చట్టం చేయాలని కోరారు.

ప్రభుత్వ లక్ష్యాలు వందశాతం అమలు

- నూతన సిఎస్ డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలన్నీ వందశాతం అమలు చేసేందుకు కృషిచేస్తానని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి అన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయం మొదటిబ్లాక్‌లో సిఎస్ ఛాంబర్‌లో ఉద్యోగ విరమణ చేసిన సమీర్ శర్మ నుండి ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ . ప్రభుత్వ పథకాలను గ్రామస్థాయిలో చివరి వ్యక్తికి చేరేలా అధికార యంత్రాంగాన్ని నడిపిస్తానని చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమాంతరంగా ముందుకు తీసుకెళ్లేందుకు శాయశక్తుల కృషిచేస్తానని అన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జి సాయిప్రసాద్, కె ప్రవీణ్‌కుమార్, కరికాల వలవన్, బి.రాజశేఖర్, ఎస్ఎస్.రావత్, ముఖ్యకార్యదర్శులు ఎమ్‌టి కృష్ణబాబు, ముత్యాలరాజు, సిఇఓ ముఖేష్‌కుమార్ మీనా పాల్గొన్నారు. నూతన సిఎస్‌కు అభినందనలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి

నేడు గుజరాత్ తొలి దశ ఎన్నికలు

- 89 స్థానాల్లో పోలింగ్

అహ్మదాబాద్ : గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గురువారం తొలి దశ ఎన్నికలు జరగనున్నాయి. 19 జిల్లాల్లోని 89 నియోజకవర్గాల్లో గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఓటింగ్‌కు అనుమతిస్తారు. 14,382 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ ప్రక్రియ జరగనుండగా, 2,39,76,670 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. తొలి దశలో పోటీ పడుతున్న మొత్తం 788 మంది అభ్యర్థుల్లో 70 మంది మహిళలున్నారు. బిజెపి, కాంగ్రెస్, ఆప్, బిఎస్‌పి, ఎస్‌పి, సిపిఎం, భారతీయ ట్రైబల్ పార్టీ (బిటిపి) తదితర 36 పార్టీల అభ్యర్థులు బరిలో ఉన్నారు. బిజెపి, కాంగ్రెస్ 89 స్థానాల్లోనూ అభ్యర్థులను నిలపగా, ఆమ్ ఆద్మీ పార్టీ 88 స్థానాల్లో బరిలో ఉంది. బిఎస్‌పి 57, బిటిపి 14, సిపిఎం నాలుగు నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలిపాయి. 339 మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఆప్ ముఖ్యమంత్రి అభ్యర్థి ఇసుధన్ గాధ్వీ, క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య రివబ జడేజా, ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గిరిజన నాయకులు ఛోటు వాసవ వంటి ప్రముఖులు బరిలో ఉన్నారు. డిసెంబర్ 5న రెండో దశ ఎన్నికలు, కౌంటింగ్ డిసెంబర్ 8న నిర్వహించనున్నారు.

ఎన్నికల విధులు సరే.. యాప్‌ల సంగతేంటి?



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయులకు బోధనేతర పనులను మినహాయింపు పేరిట ఎన్నికల విధుల నుండి తప్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల వల్ల పెద్ద ప్రయోజనం ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తున్న యాప్‌లను కొనసాగించడాన్ని వీరు ప్రస్తావిస్తున్నారు. ప్రభుత్వం ఇష్టారీతిగా రుద్దిన యాప్‌ల వల్ల ప్రతిరోజూ భారాన్ని మోయాల్సివస్తోందని, దానిని వదిలి పెట్టి పదేళ్లకోసారి వచ్చే 'జనగణన', ఐదేళ్లకోసారి వచ్చే 'ఎన్నికలు' నుంచి మినహాయింపు ఇవ్వడం ఏమిటన్న ప్రశ్న వస్తోంది. ఈ పనులకు మినహాయింపు ఇవ్వకపోతే విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందని ప్రశ్నిస్తున్నారు. నిజానికి పాఠశాల విద్యలో ఉన్న యాప్‌లు ఏ శాఖలోనూ లేవు. బడికెళ్లగానే ముఖ ఆధారిత హాజరు నుండి విద్యార్థుల హాజరు, మానిటరింగ్, మధ్యాహ్నం భోజనం, నాడు-నేడు పనులు, కోడిగుడ్ల సైజులు చూసుకోవడం, బియ్యం లెక్కలు, మరుగుదొడ్ల ఫోటోలు తీయడం, జెవికె కిట్ల పంపిణీ వంటి పనులను అప్పగించింది. వీటికోసం 32 రకాల యాప్‌లను పాఠశాల విద్యాశాఖ ప్రవేశపెట్టింది. ఇందులో 16 యాప్‌లలో ప్రతి రోజూ ఉపాధ్యాయుడు నమోదు చేయాలి. సర్వర్లు, నెట్‌వర్క్ సమస్య వల్ల యాప్‌లో సమాచారం నమోదు చేయని వారికి కూడా విద్యాశాఖ షోకాజ్ నోటీసు ఇస్తోంది. దీంతో బోధన కంటే యాప్‌లతో కుస్తీ పట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

యాప్‌ల నుంచి మినహాయించండి

'వేసవి సెలవులు, తదితర కాలాల్లో నిర్వహించే ఎన్నికలు, జనగణన విధుల నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నాం. అయితే ప్రధానంగా బడిలో బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలి. పాఠశాల ప్రారంభమైన నుంచి ముగిసే వరకు యాప్‌లతో బోధనేతర పనులను పాఠశాల విద్యాశాఖ రోజు ఉపాధ్యాయులకు అప్పగిస్తుంది. ఈ యాప్‌ల నుంచి మినహాయింపు ఇవ్వాలి. అలా కాకుండా ఎన్నికల వరకే మినహాయించడం సరైంది కాదు. ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో కేవలం రెండు రోజులు చేసే పనిమాత్రమే. బడిలో బోధనేతర పనుల నుంచి మినహాయిస్తేనే ఉపయోగం ఉంటుంది'.

ఎన్ వెంకటేశ్వర్లు, యుటిఎఫ్ అధ్యక్షులు

యాప్‌లు వద్దు

'రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయులకు యాప్‌ల నుంచి మినహాయింపు ఇవ్వాలి. పాఠశాలలో నిత్యం బోధనకు ఆటంకం కలిగించే బోధనేతర పనులు, మరుగుదొడ్ల ఫోటోలు వంటి యాప్‌ల నుంచి మినహాయింపు ఇవ్వాలి. అప్పుడే నాణ్యమైన విద్య అందించే అవకాశం ఉంటుంది.'

జి హృదయరాజు, ఎస్ చిరంజీవి, ఎపిటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు

రవాణారంగ సమస్యలపై 15 నుండి ఆందోళనలు

- ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రవాణారంగంలో నెలకొన్న సమస్యలపై డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ తీర్మానించింది. రాష్ట్రంలో 40 లక్షల మంది ఉపాధి పొందే రవాణారంగాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ అసోసియేషన్ తీర్మానాల అమలుకు కృషి చేయాలని కోరింది. బుధవారం కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోషియేషన్ హాలులో ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు గోపాలనాయుడు మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం గ్రీన్‌టాక్స్‌ను రూ.200 నుంచి రూ.20 వేలకు పెంచడం సరైందికాదని అన్నారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవి ఈశ్వరరావు మాట్లాడారు. కోవిడ్ నేపథ్యంలో రవాణా రంగాన్ని ఆదుకునేందుకు ఇతర రాష్ట్రాలు రెండు త్రైమాసిక పన్నులు రద్దు చేయగా రాష్ట్ర ప్రభుత్వం కనీసం పన్ను వసూలు వాయిదా కూడా వేయలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరోసారి 20 శాతం మేర వాహనపన్ను పెంచే ఆలోచన చేస్తోందని, ఇది సరైందికాదని అన్నారు. రాష్ట్రంలో ఇంధన ధరలు అన్ని రాష్ట్రాలకంటే ఎక్కువగా వున్నాయని చెప్పారు. లీటర్‌కు ఐదు రూపాయలు సెస్‌ను వసూలు చేయడం తగదని విమర్శించారు. అసోసియేషన్ నాయకులు చెన్నుపాటి వజీర్ మాట్లాడుతూ రవాణా రంగంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా నలభై లక్షల మంది ఉపాధి పొందుతున్నా ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం తగదని అన్నారు. వాహన యాప్ సాఫ్ట్‌వేర్ సమస్య కారణంగా పొరుగు రాష్ట్రాల్లో అన్ని పత్రాలున్నా జరిమానాలను చెల్లించాల్సి వస్తోందని చెప్పారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో హమాలీలకు ఎగుమతి, దిగుమతి కూలీని సరుకు యజమానే చెల్లించాలని, లారీ డ్రైవర్ నుండి లోడింగ్ అన్ లోడింగ్ మామూళ్లు తీసుకోరాదని తీర్మానం చేశారు. డిసెంబరు 15 నుండి రాష్ట్రంలో లారీ డ్రైవర్లు, యజమానులు లోడింగ్, అన్ లోడింగ్ మామూళ్లు ఎవరికి చెల్లించనవసరం లేదని, గుమస్తా రుసుములూ చెల్లించక్కరలేదని, ధాన్యం బస్తాల అన్‌లోడింగ్‌లో అరుగుదలకు అద్దెనుండి మినహాయింపు వుండరాదని, అన్‌లోడింగ్ 24 గంటలు దాటితే వెయిటింగ్ ఛార్జీ సరుకు యజమాని చెల్లించాలని తీర్మానించారు. ఆశీలు వసూలు చేయరాదని ఈ రౌండ్‌టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సమావేశంలో నాయకులు గోపిశెట్టి వీరవెంకయ్య, దాసరి శ్రీనివాసరెడ్డి, నారాయణ, దేవరాజ్, సత్యనారాయణ, గిరి, ప్రసాద్ రెడ్డి, కొల్లి మురళీకృష్ణ మాట్లాడారు.

రాజధానిలో అందరికీ ఇళ్లు

- సిఆర్‌డిఎ చట్ట సవరణ
- హైకోర్టులో ప్రభుత్వం మెమో దాఖలు

ప్రజాశక్తి-అమరావతి

సిఆర్‌డిఎ చట్టానికి సవరణలు చేసినందున రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్లు ఇవ్వాలన్న అంశంపై దాఖలైన రిట్లు నిరర్థకం అవుతాయని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. జీవో 107ను సవాల్ చేసిన రిట్ల తర్వాత సిఆర్‌డిఎ చట్టానికి సవరణలు చేశామని, ఈమేరకు మెమో దాఖలు చేసినట్లు అదనపు ఎజి పి.సుధాకర్‌రెడ్డి చెప్పారు. మెమోను పరిశీలించిన చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, న్యాయమూర్తులు జస్టిస్ డివిఎస్-ఎస్ సోమయాజులు, జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్లను ఆదేశించింది. రిట్ పిటిషన్లలోని తమ వినతిని సవరించేందుకు అనుమతి ఇవ్వాలని అమరావతి రైతులు ఓ అనుబంధ పిటిషన్ దాఖలు చేశారని తెలిపారు. ప్రభుత్వ మెమోపై కౌంటర్ దాఖలు చేయాలని రైతులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 22కి వాయిదా వేసింది.

ఇదే తరహా మరో రిట్‌పై విచారణ


రాజధాని ప్రాంతంలో అందరికీ ఇళ్లు ఇవ్వాలనే ప్రభుత్వ గెజిట్‌ను సవాల్ చేసిన అమరావతి రైతు సంఘాల వ్యాజ్యాలను జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ టి.మల్లికార్జునరావులతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారించింది. రాజధాని అందరికీ అయినప్పుడు అందరికీ ఇళ్లు ఇవ్వడంలో తప్పులేదని అదనపు ఏజీ సుధాకర్‌రెడ్డి వాదించారు. ఇదే తరహా రిట్లు సిజె నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం వద్ద ఉన్నాయని చెప్పారు. ఈ కేసును కూడా త్రిసభ్య ధర్మాసనానికి బదిలీ చేయాలని, లేకపోతే రెండు వేర్వేరు తీర్పులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పిటిషనర్ల వాదనల నిమిత్తం విచారణ డిసెంబర్ 5కి వాయిదా పడింది.

కోర్టు ధిక్కార కేసులో ముత్యాలరాజు హాజరు కావాలని ఉత్తర్వులు

కోర్టు ధిక్కార కేసులో సిఎం ముఖ్య కార్యదర్శి ముత్యాలరాజు స్వయంగా విచారణకు హాజరుకావాలని హైకోర్టు ఉత్తర్వుల జారీ చేసింది. పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పటి కేసులో ఆయనకు ఈ ఉత్తర్వులను జారీ చేసింది. ఆనాటి పంచాయతీరాజ్ సబ్ డివిజన్ ఇంజినీర్ గంగరాజు, నిడదవోలు గత తహశీల్దార్ శాస్త్రి హాజరుకావాలని న్యాయమూర్తి జస్టిస్ బి.దేవానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. సమిశ్రిగూడెం పంచాయతీలో జెడ్పీ ఉన్నత పాఠశాల భవనం, స్థలాన్ని ఆక్రమించి వేడుకలు నిర్వహించడంపై షేక్ సిలా రిట్ దాఖలు చేశారు. పాఠశాల ఆక్రమణల్ని తొలగించి ప్రహరీ నిర్మాణం చేయాలని 2020 నవంబర్‌లో ఆనాటి కలెక్టర్ ముత్యాలరాజు ఇతరులను హైకోర్టు ఆదేశించిన ఉత్తర్వులు అమలు కాలేదని కోర్టు ధిక్కార పిటిషన్ వేశారు. ఈ కేసులో ఆ ముగ్గురికీ హైకోర్టు ఫాం-1 నోటీసులు జారీ చేసింది.

లోకో పైలట్ల సమస్యలపై దశలవారీ పోరాటం

- 76 మందితో నూతన కార్యవర్గం
- అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఎంఎన్ ప్రసాద్, కెసి జేమ్స్



అధ్యక్ష, కార్యదర్శులు ఎంయన్ ప్రసాద్, కెసి జేమ్స్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

లోకో పైలట్ల సమస్యలపై దశలవారీగా ఆందోళన చేపట్టాలని లోకోపైలట్ల ద్వైవార్షిక మహాసభ నిర్ణయించింది. రెండురోజులుగా విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య ఆడిటోరియంలో జరిగిన సమావేశానికి దేశంలో అన్ని డివిజన్ల నుండి సుమారు 700 మందికిపైగా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రెండోరోజు ముగింపు సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. బుధవారం సాయంత్రం ఎంబివికెలో జరిగిన విలేకరుల సమావేశంలో నూతన కమిటీ వివరాలను నాయకులు మోనీ తదితరులు వెల్లడించారు. అధ్యక్షులుగా ఎం.ఎన్.ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కె.సి.జేమ్స్ ఎన్నికయ్యారు. వర్కింగు ప్రెసిడెంటుగా ఎల్.మోనీ, జాయింట్ ప్రధాన కార్యదర్శులుగా ఎం.పి.దియో, జఫరుల్ హుసేన్, ఎస్.సునీత్ ఎన్నికయ్యారు. ట్రెజరర్‌గా మోహన్‌చంద్ పాండేను ఎన్నుకున్నారు. పనిగంటల విధానంపై పోరాడాలని మహాసభలో నిర్ణయించారు. ప్రైవేటీకరణ వల్ల తీవ్ర అన్యాయం జరుగుతుందని, దీన్ని అడ్డుకోవాలని నిర్ణయించారు. రైల్వేలో రక్షణ విధానాలు దెబ్బతిన్నాయని, మహిళా లోకోపైలట్ల పట్ల అమానవీయంగా వ్యవహరిస్తున్నారని, అటువంటి వాటిని ఎదుర్కోవాలని కోరారు. మానిటైజేషన్‌లో రైల్వేలే ఎక్కువగా నష్టపోతున్నాయని తెలిపారు. ఇప్పటికే అనేక ఆంక్షల పేరుతో రైల్వే ఉద్యోగులను తొలగిస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఖాళీలను భర్తీ చేయాలని, రక్షణ రహిత పనిని నిలపేయాలని, లోకోలో టూల్‌కిట్ ఏర్పాటు చేయాలని కోరారు. 40 గంటల రెస్టు అమలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 21నుండి దశలవారీగా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. జనవరి మూడోవారంలో జనరల్ మేనేజర్ కార్యాలయాల ముందు నిరసన తెలపాలని నిర్ణయించారు. ఫిబ్రవరిలో ఢిల్లీలో ధర్నా నిర్వహించనున్నారు. సమస్య పరిష్కారం చేయకపోతే ఏప్రిల్‌లో సహాయ నిరాకరణ చేయనున్నారు.

అప్పీల్‌కు అనుమతి నిరాకరణ

ప్రజాశక్తి-అమరావతి

ఏపీ హైకోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గం పదవీ కాలం ఈ ఏడాది మార్చితో ముగిసినా అనధికారికంగా కొనసాగుతుంటే ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేసిన అప్పీల్‌కు డివిజన్ బెంచ్ నిరాకరించింది. అప్పీల్‌కు అనుమతి ఇచ్చి అత్యవసరంగా విచారణ చేయాలని అడ్వకేట్ ఉగ్రనరసింహ చేసిన వినతిని చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ డివిఎస్ఎస్ సోమయాజులుతో కూడిన డివిజన్ బెంచ్ తిరస్కరించింది. సింగిల్ జడ్జి వివరాలు మాత్రమే కోరారని, దీనిపై అప్పీల్ ఎలా దాఖలు చేస్తారని ప్రశ్నించింది. ఎన్నికలు నిర్వహించకుండానే కొనసాగుతుంటే ఏం చర్యలు తీసుకున్నారని మాత్రమే సింగిల్ జడ్జి కోరారని చెప్పింది. ఎన్నికల కేసుల కంటే కీలక కేసుల విచారణ తమ ముందున్నాయని వ్యాఖ్య చేసింది. ఈ కేసులో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రతివాదిగా చేర్చి సింగిల్ జడ్జి విచారణ చేసేలా ప్రయత్నించడం బెంచ్ హంటింగ్ కిందకే వస్తుందని, కనీసం గురువారం విచారణ చేయాలని న్యాయవాది కోరినా హైకోర్టు అంగీకరించలేదు.

ఆ ఫోన్‌లో డేటా తీయొద్దు

ప్రజాశక్తి-అమరావతి

తిరుపతి జనసేన నాయకుడు కిరణ్ రాయల్‌కు సంబంధించిన ఫోన్‌లోని డేటాను బయటకు తీయవద్దని తిరుపతి పోలీసులు, ఫోరెన్సిక్ ల్యాబ్‌లకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేశారని నగరికి చెందిన సాయి సంధ్యారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాయల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిని సవాల్ చేస్తూ రాయల్ దాఖలు చేసిన రిట్‌ను బుధవారం జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు విచారణ జరిపి పై ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు అందజేయాలని పోలీసులను ఆదేశించి తదుపరి విచారణను డిసెంబర్ 2కి వాయిదా వేశారు.

ప్రాణభిక్ష పెట్టాలని వేడుకోలు

- చిన్నారి వైద్యానికి సిఎం హామీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అన్నమయ్య జిల్లా మదనపల్లె పర్యటనలో చిన్నారి వైద్య చికిత్సకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఉదారత చూపారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఓ చిన్నారికి అభయ హస్తం అందించారు. ఆర్థిక కష్టాలతో ఉన్న చిన్నారికి వైద్యం చేయించేందుకు భరోసా ఇచ్చారు. నాలుగో విడత జగనన్న విద్యాదీవెన కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు బుధవారం మదనపల్లెకు ముఖ్యమంత్రి వచ్చారు.

ముఖ్యమంత్రి పర్యటన గురించి తెలుసుకున్న తంబళ్ళపల్లి మండలం ఎద్దులవారిపల్లెకు చెందిన హమీదా అనారోగ్యంతో బాధపడుతున్న తన ఏడాదిన్నర బిడ్డను తీసుకొని సిఎం సభ వద్దకు వచ్చారు. సిఎంను కలిసి తనబిడ్డకు ప్రాణభిక్ష పెట్టాలని వేడుకుందామని వెళ్తుండగా పోలీసులు అనుమతి లేదంటూ ఆమెను ఆపివేశారు. తన బిడ్డ వింత వ్యాధితో బాధపడుతున్నాడని, సిఎం సార్‌ను కలిసి తన బిడ్డను రక్షించాలని కోరుతానని పోలీసులకు విన్నవించుకున్నా మానవత్వం చూపలేదు. అంతలోనే చిన్నారి తీవ్ర అస్వస్థకు గురవ్వడంతో అక్కడే ఉన్న ఎస్ఐ షేక్ జాఫర్ చిన్నారిని తీసుకొని సమీపంలో ఉన్న ఆంబులెన్స్ వద్దకు తీసుకెళ్లారు. వైద్యులు ప్రవీణ్‌కుమార్, కిషోర్, ఆరీఫుల్లా, చైతన్యజ్యోతి సకాలంలో చిన్నారికి వైద్యం అందించి కాపాడారు. అధికారుల ద్వారా విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి స్పందించారు. తల్లిని, కుమారుడిని సభా వేదికపైకి రప్పించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హమీదాకు మాట్లాడుతూ తన కుమారుడు మొహమ్మద్‌అలీ (18 నెలలు)కి పుట్టినప్పటి నుండి వింత వ్యాధితో (తల పెద్దది కావడం, రోజుకు 30 సార్లు ఫిట్స్ రావడం) బాధపడుతున్నాడని, వేలూరు సిఎంసిలో చికిత్సలు చేయిస్తున్నానని తెలిపింది. తన భర్త ఏమాత్రం పట్టించుకోడని, చిన్నారి చికిత్సకు డబ్బుల్లేక వైద్యం నిలిపివేశారని వాపోయింది. సిఎం స్పందించి తన బిడ్డకు ప్రాణభిక్ష పెట్టాలని వేడుకుంది.



బాధితురాలితో మాట్లాడుతున్న సిఎం జగన్

బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ గిరీషను ముఖ్యమంత్రి ఆదేశించారు. దీంతో రూ.లక్ష చెక్కును బాధితురాలికి కలెక్టర్ అందజేశారు. నెలవారీ రూ.3 వేలు పింఛను మంజూరు చేశారు. స్విమ్స్‌లో మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సిఎం, కలెక్టర్‌కు హమీదా కృతజ్ఞతలు తెలియజేశారు.

గురజాడ ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం

- వర్ధంతి సభలో వక్తల ఉద్ఘాటన

ప్రజాశక్తి- యంత్రాంగం

మనుషులను ప్రేమించాలని, మంచితనాన్ని పెంపొందించాలని, దేశమంటే మట్టికాదోయ్, మనుషులని చెప్పిన నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని, అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు సాహితీవేత్తలు పేర్కొన్నారు. సాహితీ స్రవంతి, ఐద్వా ఆధ్వర్యంలో గురజాడ 107వ వర్ధంతిని బుధవారం పలు జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు.

కర్నూలులోని లలితకళా సమితిలో గురజాడ వర్ధంతి సభలో సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి మాట్లాడుతూ అగ్నిహోత్రావధానులకు గురజాడ పురస్కారం ఇస్తే ఎలా ఉంటుందో ఇప్పుడు విజయనగరంలో జరుగుతున్నది కూడా అచ్చం అలాగే ఉందని విమర్శించారు. ఆ వివాదం ఆస్తిక, నాస్తిక సమస్య కాదని, భావాలకు సంబంధించిన సమస్యగానే చూస్తున్నామన్నారు. గురజాడ వచనం చాగంటి ప్రవచనం వేర్వేర్వేరని తెలిపారు. చాగంటికి ప్రవచన సామ్రాట్, ఆధ్యాత్మిక రత్న, శ్లోక సర్వస్వ వంటి బిరుదులు ఎన్నయినా ఇవ్వండి కానీ గురజాడ పురస్కారం ఎలా ఇస్తారని ప్రశ్నించారు. గురజాడ దేశాభివృద్ధిని కోరుకుంటే పాలకులు దేశాన్ని అమ్మడానికి పూనుకున్నారని చెప్పారు.

మనుషుల మధ్య ద్వేషాన్ని, అపనమ్మకాన్ని పెంచుతున్న ఈ రోజుల్లో, వట్టి మాటల్లో బతుకుతున్న ఈ దేశానికి గట్టిమేలు కావాలంటే సమాజానికి గురజాడ మాటలు అవసరమని తెలిపారు. సమాజాన్ని వెనక్కి తీసుకువెళ్లేవాళ్లు, మహిళలను గౌరవించని వాళ్లు, మతాల మధ్య మంటలు పెట్టేవాళ్ళు ఎప్పుడు అభ్యుదయవాదులు కాలేరన్నారు. లలిత కళా సమితి అధ్యక్షులు పత్తి ఓబులయ్య, ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ బి శంకర శర్మ ప్రసంగించారు. తొలుత గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, ఐద్వా, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, ప్రజానాట్యమండలి, మెడికల్ రెప్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

'దేశమును ప్రేమించుమన్నా' దేశభక్తి గేయాన్ని విశాఖ ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ఉన్న గురజాడ విగ్రహ కూడలిలో పలువురు సాహితీ వేత్తలు ఆలపించారు. ముందుగా గురజాడ చిత్రపటానికి ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జీవం లేని రాళ్ళ, రప్పలకు దండాలు పెట్టి పూజించడం కాకుండా మనుషులను ప్రేమించాలని, మంచితనాన్ని పెంపొందించాలన్నారని తెలిపారు. దేశమంటే మట్టి కాదని మనుషులని, భార్యను బానిసగా చూసే పరిస్థితి పోయి ప్రాణ స్నేహితురాలుగా చూసే పరిస్థితి రావాలని, ఆధునిక మహిళ చరిత్రను పునర్లిఖిస్తుందని గురజాడ పేర్కొన్నారని వివరించారు. నేడు భారతదేశాన్ని మధ్య యుగాలనాటి స్థితికి తీసుకెళ్లాలని పాలకవర్గాలు చేస్తోన్న ప్రయత్నాలకు ఊతమిచ్చేటట్టుగా ఈ సంవత్సరం గురజాడ పురస్కారాన్ని చాందసవాది చాగంటి కోటేశ్వరరావుకు ఇవ్వడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల అప్పలరాజు (అరసం), రామకృష్ణ (విశాఖ రచయితల సంఘం), పి.రామారావు (సాహితీ స్రవంతి), జి.రాజేశ్వరరావు (అల్లూరి విజ్ఞాన కేంద్రం), ఐద్వా నాయకులు బి.పద్మ, వై.సత్యవతి, కె.నిర్మల తదితరులు పాల్గొన్నారు.



కర్నూలులో గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తెలకపల్లి రవి, తదితరులు



విశాఖలో గురుజాడ వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

గురజాడ స్వగృహంలో ఆయన విగ్రహానికి రాష్ట్ర ఎస్‌సి సంక్షేమ అసెంబ్లీ కమిటీ చైర్మన్ గొల్ల బాబూరావు, కమిటీ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గురజాడ వారసులైన గురజాడ వెంకట ప్రసాద్, ఇందిరతో కలిసి గురజాడ రచించిన పుస్తకాలను, స్టాంపులను పట్టుకొని ర్యాలీగా ఆయన విగ్రహం వద్దకు చేరుకున్నారు. బాబూరావు మాట్లాడుతూ సమాజానికి గురజాడ చేసిన సేవలను కొనియాడారు. అంబేద్కర్, గురజాడ అప్పారావు లాంటి మహనీయుల జీవితాలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు.



యుటిఎఫ్ కార్యాలయంలో నిరసన జాగరణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులపై ఉక్కుపాదం

మొదటి పేజి తరువాయి

సందర్భంగా ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు సుమారు రూ.650 కోట్లు మార్చి 2022 నాటికి క్లియర్ చేస్తామని మంత్రివర్గ ఉపసంఘం సమక్షంలో ఆర్థికశాఖ అధికారులు హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు పూర్తి బకాయిలు చెల్లించలేదని పేర్కొన్నారు. మంజూరైన పిఎఫ్, తదితర లోన్లు జమ చేయకపోవడం, సిపిఎస్ ఉద్యోగులకు రాష్ట్రప్రభుత్వ వాటా చెల్లించకపోవడం, రిటైరయిన వారి బెనిఫిట్స్ చెల్లించకపోవడం తదితర సమస్యలపై యుటిఎఫ్ ఆధ్వర్యంలో శాంతియుతంగా ధర్నా చేస్తున్నారని పేర్కొన్నారు. పోలీసులు ఈ ధర్నాను అడ్డుకొని యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులతో సహా 250 మందికిపైగా అరెస్టు చేశారని వివరించారు. ముందు రోజు అన్ని జిల్లాల్లో ఉపాధ్యాయులకు నోటీసులు ఇచ్చారని పేర్కొన్నారు. న్యాయంగా చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకుండా వారిపై నిర్బంధాన్ని ప్రయోగించడం గర్హనీయమన్నారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం తన అప్రజాస్వామిక చర్యలు మానుకుని ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల డిమాండ్లకు, ఆందోళనకు సంపూర్ణ మద్దతు తెలిపారు.

ఎపిటిఎఫ్ ఖండన


శాంతియుతంగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు, ఎమ్మెల్సీలను అరెస్టు చేయడాన్ని ఎపిటిఎఫ్ ఖండించింది. ఈ మేరకు ఎపిటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, ఎస్ చిరంజీవి ఒక ప్రకటన విడుదల చేశారు.

తాటాకు చప్పుళ్లకు భయపడను

మొదటి పేజి తరువాయి

చేశారని విమర్శించారు. దేనికి నవ్వాలో కూడా తెలియకుండా ప్రతిదానికీ జగన్ నవ్వుతాడంటూ ఎద్దేవా చేశారు. ధాన్యాగారంగా పేరొందిన జిల్లాలో పంటకు గిట్టుబాటు ధర లేకుండా చేశారన్నారు. పామాయిల్ రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చింతలపూడి ప్రాజెక్టును వదిలేశారని విమర్శించారు.

ఆక్వా కల్చర్‌ను దెబ్బతీశారన్నారు. ఇప్పుడు ప్రజలు కళ్లు తెరవాలని, లేదంటే రాష్ట్రానికి ఇదే చివరి అవకాశమని పేర్కొన్నారు. ఇదేం ఖర్మ రాష్ట్రానికి, క్విట్ జగన్, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ అందరితో నినాదాలు చేయించారు. విజయరాయి నుంచి వలసపల్లి క్రాస్ రోడ్డు, ధర్మాజీగూడెం కార్నర్, మట్టలగూడెం, లింగపాలెం మీదుగా చింతలపూడి చేరుకుని అక్కడ బహిరంగ సభలో ప్రసంగించారు. చింతలపూడిలో సభ ముగించుకుని కొయ్యలగూడెం వెళ్తుండగా.. వైసిపి కార్యకర్తలు, నేతలు చంద్రబాబు కాన్వాయ్‌ని అడ్డుకున్నారు. చంద్రబాబు డౌన్‌డౌన్ అని నినాదాలు చేస్తుండగా పోలీసులు రంగంలోకి దిగి వారిని చెదరగొట్టి, కాన్వాయ్‌ని ముందుకు సాగనంపారు. రాత్రికి కొయ్యలగూడెం మండలం సరసన్నపాలెం సమీపంలోని దొండపూడి ఫంక్షన్ హాలులో బసచేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, తదితరులు

సమగ్ర భూ సర్వేపై తొందరపాటు వద్దు

- వడ్డే, లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - ఉయ్యూరు (కృష్ణా జిల్లా)

సరిహద్దు తగాదాలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూసర్వేపై తొందరపాటు తగదని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, రైతాంగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు యెర్నేని నాగేంద్రనాథ్, సిబిఐ మాజీ జెడి వి.లక్ష్మీనారాయణ, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణ అన్నారు. సర్వేలో పొరపాట్లు, తప్పులు వస్తే యజమానులు నష్టపోవడమేకాకుండా పరిష్కారం కోసం కోర్టుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమగ్ర భూ సర్వే వల్ల ఉత్పన్నమయ్యే దుష్పరిణామాలపై కృష్ణాజిల్లా ఉయ్యూరులోని వడ్డే శోభనాద్రీశ్వరరావు నివాసంలో బుధవారం వారు మీడియాతో మాట్లాడారు. సర్వేకు పూర్తిస్థాయి శిక్షణనిచ్చిన సిబ్బందిని ఉపయోగించి క్షేత్రస్థాయిలో రైతుల సమక్షంలో తగిన వ్యవధి ఇచ్చి సర్వే చేయాలన్నారు. పొరపాట్లు జరిగేందుకు అవకాశం లేకుండా రూపొందించిన 'స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్' ప్రకారం సర్వే చేపట్టాలని కోరారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకువచ్చేముందు దానిపై సమగ్ర అవగాహన కల్పించాలన్నారు. ఏవిధమైన అవగాహన లేకుండా సర్వే చేయించడం సబబుకాదని పేర్కొన్నారు. సర్వే సమస్యల పరిష్కారం నిమిత్తం మండల స్థాయిలో రెవెన్యూ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని, సర్వేకు చెక్‌లిస్టులు తయారు చేయాలని సూచించారు. 17,584 గ్రామాల్లో డిసెంబరులోగా సర్వే పూర్తి చేయడం అసంభవమన్నారు. సమావేశంలో ఆర్థిక నిపుణులు ఏకాంబరం పాల్గొన్నారు.

వాస్తవికతకు దగ్గరగా బడ్జెట్

- అవసరమైన మేరకే నిధులు
- అధికారులకు ఆర్థికశాఖ దిశానిర్దేశం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రానున్న బడ్జెట్‌కు వాస్తవికతకు దగ్గరగా ప్రతిపాదనలు పంపాలని అన్నిశాఖలకు ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ సూచించారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం బడ్జెట్ కసరత్తు జరిగింది. ఈ సమావేశంలో ప్రస్తుత బడ్జెట్‌లో ఆదాయ, వ్యయాలు, రానున్న బడ్జెట్‌లో ప్రతిపాదనలపై ప్రాథమికంగా చర్చించినట్లు తెలిసింది. ప్రధానంగా ఆదాయం పెంపునకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరిగింది. ఖర్చుకు తగ్గినట్లుగా ఆదాయం ఉండేలా చూడాలని రావత్ చెప్పినట్లు సమాచారం. సేవా పన్నుల ద్వారా ఆదాయం పెంచుకునే విషయాన్ని కూడా అధ్యయనం చేయాలని సూచించినట్లు సమాచారం. పన్నుల వసూళ్ల ప్రస్తుత ధరల మేరకు వసూలు చేయాలని, పలు డ్యూటీస్, వివధ లెవీలు కూడా ఆయా చట్టాల మేరకు వసూలు చేయాలని రావత్ చెప్పారు. పన్నేతర వసూళ్లపై శాఖాధికారులు, కార్యదర్శులు తరచూ సమీక్షలు నిర్వహించాలని సూచించారు. బడ్జెట్ ప్రతిపాదనల్లో ప్రస్తుత ధరలకు అనుగుణంగా ప్రతిపాదించాలని స్పష్టం చేశారు. అయితే గత ఏడాది బడ్జెట్‌లో చేసిన ఖర్చుకు అనుగుణంగానే ఈ ప్రతిపాదనలు ఉండాలి తప్ప అధికంగా ఉండరాదని స్పష్టం చేశారు. అద్దె భవనాలు, వాహనాలు, ఇతర రెవెన్యూ వ్యయాన్ని తగ్గించుకునేలా ప్రయత్నించాలన్నారు. కొత్తగా ప్రవేశపెట్టాల్సిన పథకాలపైనా స్వల్పంగా చర్చ జరిగినట్లు తెలిసింది. తమ అభిప్రాయాలను 12వ తేదీలోగా ఆర్థికశాఖకు పంపించాలని కూడా నిర్దేశించారు. ఈ భేటీలో సచివాలయంలోని అనేక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతోపాటు కొంతమంది శాఖాధిపతులు కూడా పాల్గొన్నారు.

జెసి ఆస్తులు జప్తు

- రూ.22.10 కోట్ల విలువైన ఆస్తుల అటాచ్‌మెంట్
- వాహనాల అక్రమ రిజిస్ట్రేసన్ కేసులో ఇడి చర్యలు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి


బిఎస్-3 వాహనాలను తప్పుడు పత్రాలతో బిఎస్-4గా రిజిస్ట్రేషన్ చేశారన్న ఆరోపణల కేసులో మాజీ ఎమ్మెల్యే జెసి.ప్రభాకర్‌రెడ్డి, ఆయన అనుయాయుడు సి.గోపాల్‌రెడ్డికి సంబంధించిన ఆస్తులను ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ (ఇడి) జప్తు చేసింది. రూ.22.10 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్‌మెంట్ చేసినట్లు సమాచారం. బిఎస్-3 వాహనాలను 2017 ఏప్రిల్ నుంచి రిజిస్ట్రేషన్ చేయకూడదని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అశోక్ లైలాండ్‌కు సంబంధించిన 153 వాహనాలను జెసి.ప్రభాకర్‌రెడ్డి, ఆయన అనుచరుడు గోపాల్‌రెడ్డి రెండు వేర్వేరు కంపెనీల పేరుతో తుక్కు కింద కొనుగోలు చేసి 2018లో నాగలాండ్‌లో రిజిస్ట్రేషన్ చేశారు. ఈ వాహనాలను తరువాత ఆంధ్రప్రదేశ్‌కు బదిలీపై తెచ్చారు. ఇక్కడా రిజిస్ట్రేషన్ చేశారు. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటిపై విచారణ చేపట్టింది. ఈ విచారణలో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీనిపై తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన వారిపై రవాణా శాఖ అప్పట్లో కేసులు నమోదు చేసింది. ఈ కేసుల విచారణ జరుగుతున్న క్రమంలోనే ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ కూడా గత కొంతకాలంగా వాహనాల అక్రమ రిజిస్ట్రేషన్ అంశంపై విచారణ చేపట్టింది.

మాజీ ఎంపి జెసి.దివాకర్‌రెడ్డి, జెసి.ప్రభాకర్‌రెడ్డి ఇళ్లలోనూ అప్పట్లో సోదాలు నిర్వహించింది. ఆ తరువాత రెండు పర్యాయాలు పిలిచి విచారించింది. రూ.38.36 కోట్ల విలువైన వాహనాల అమ్మకాలు జరిగినట్టు ఇడి గుర్తించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో జెసి.ప్రభాకర్‌రెడ్డి, ఆయన అనుయాయుడు సి.గోపాల్‌రెడ్డి ఆస్తులను స్వాధీనం జప్తు చేసింది. వాటిల్లో 6.31 కోట్ల విలువైన చరాస్తులు. బ్యాంకు ఖాతాలు, ఆభరణాలు, నగదు ఉన్నట్టు తెలుస్తోంది. దీంతోపాటు మరో 68 ఆస్తులు ఉన్నాయి. వాటి విలువ రూ.15.79 కోట్లు ఉన్నట్టు అంచనా. ఈ మొత్తం ఆస్తులను జప్తు చేసినట్టు సమాచారం.

జానపద వృత్తికళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగన్‌కు సతీ వియోగం

- సిపిఎం, ప్రజాసంఘాల నాయకుల నివాళి
- నేడు విజయవాడలో అంత్యక్రియలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ, తాడేపల్లి (గుంటూరు జిల్లా)



విజయమ్మ (ఫైల్)

జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్‌రావు సతీమణి విజయమ్మ (57) మృతిచెందారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గత కొంతకాలంగా ఆమె చికిత్స పొందుతున్నారు.

పరిస్థితి విషమించి బుధవారం మరణించారు. భౌతికకాయాన్ని తిరుపతి సుందరయ్యనగర్‌లోని సిపిఎం కార్యాలయం వద్ద పార్టీ శ్రేయోభిలాషులు, ప్రజాసంఘాల నాయకుల సందర్శన నిమిత్తం ఉంచారు. ఈ సందర్భంగా జరిగిన సంతాపసభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడారు. అనంతరం భౌతికకాయాన్ని ఆమె సొంతూరైన గుంటూరు జిల్లా తాడేపల్లికి తరలించారు. మార్గమధ్యంలో విజయమ్మ మృతదేహానికి నాయుడుపేట, శ్రీకాళహస్తిలో నివాళులర్పించారు. భౌతికకాయాన్ని గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సుందరయ్య నగర్‌కు బుధవారం రాత్రి తీసుకువచ్చారు. లీలాసుందరయ్య కళావేదిక వద్ద విజయలక్ష్మి భౌతికకాయాన్ని ఉంచారు. పిఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి అనిల్, సిపిఎం నాయకులు ఎస్. వెంకట్రావు ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జయరాం తదితరులు నివాళులర్పించారు. ఇక్కడి నుంచి గురువారం ఉదయం అంతిమ యాత్ర ప్రారంభమవుతుందని, విజయవాడ స్వర్గపురిలో అంత్యక్రియలు నిర్వహించనున్నామని కుటుంబసభ్యులు తెలిపారు. విజయలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు రవి హైదరాబాదులో 'నవ తెలంగాణ'లో, రెండో కుమారుడు తులసీరావు విజయవాడ 'ప్రజాశక్తి'లో పనిచేస్తున్నారు.

ఐద్వా, పిఎన్ఎం సంతాపం

విజయలక్ష్మి మృతిపట్ల ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.మంగరాజు, ఎస్.అనిల్‌కుమార్ సంతాపం ప్రకటించారు.

యాజమాన్య హక్కేది?

- రెండు దశాబ్దాల క్రితం ఇళ్లు అందజేత
- ఇప్పటికీ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్టర్ కాని వైనం
- ఏళ్లు గడుస్తున్నా గుజరాత్ సర్కారులో లేని చలనం
- కుచ్ భూకంప బాధితుల గోడు

గుజరాత్‌లోని కుచ్ జిల్లా పేరు వినగానే 2001 భూకంపం నాటి భయానక పరిస్థితులు గుర్తుకొస్తాయి. ప్రకృతి విపత్తు కారణంగా అక్కడి ప్రజలు తీవ్ర గోసను ఎదుర్కొన్నారు. సర్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారు. ఆ సమయంలో ప్రభుత్వం బాధితులకు ఇళ్లను అందజేసింది. అయితే, వారికి ఇళ్లపై యాజమాన్య హక్కు ఇప్పటికీ సంక్రమించలేదు. రెండు దశాబ్దాలవుతున్నప్పటికీ గుజరాత్ సర్కారు వారికి యాజమాన్య హక్కును కల్పించేందుకూ ఆసక్తి చూపలేదు. ఈ విషయంలో బాధితులు తమ ఆందోళనను వ్యక్తం చేశారు. గుజరాత్‌లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో.. వెంటనే యాజమాన్య హక్కును కల్పించాలని డిమాండ్ చేశారు.



ఇంటి పట్టా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న భూకంప బాధితురాలు

అహ్మదాబాద్ : గుజరాత్‌లోని కుచ్ జిల్లాలో సంభవించిన చేదు గుర్తులు అన్నీ ఇన్నీ కావు. 2001లో సంభవించిన ఈ ప్రకృతి విపత్తు వేలాది మంది ప్రాణాలను తీసుకున్నది. లక్షల మంది క్షతగాత్రులయ్యారు. కుచ్ ప్రజలు సర్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారు. ఆ పీడకలను భూకంప బాధితులు ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నారు. భుజ్ భూకంపంగా పిలిచే దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.7గా నమోదైంది. భుజ్ అనేది కుచ్ జిల్లా కేంద్రం. భూకంపానికి ఇది కేంద్రబిందువు కావటంతో దీనిని భుజ్ భూకంపంగా పిలిచేవారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. 13,805 నుంచి 20,023 మంది ఈ ప్రమాదానికి బలయ్యారు. మరో 1.67 లక్షల మంది గాయాలపాలయ్యారు. దాదాపు 3.40 లక్షల ఇండ్లు నేల మట్టమయ్యాయి. ఈ భయానక ప్రకృతి విపత్తు చోటు చేసుకొని దాదాపు రెండు దశాబ్దాలకు పైగానే గడుస్తున్నది. ఆనాటి భయానక పరిస్థితులు ఇప్పటికీ అక్కడి స్థానికుల మెదళ్లలో మెదులుతూనే ఉన్నాయి.

ప్రస్తుతం గుజరాత్‌లో అసెంబ్లీ ఎన్నికలు నడుస్తున్నాయి. భూకంపాన్ని ధైర్యంగా ఎదుర్కొన్నందుకు గానూ గుర్తుగా ఈ ఏడాది ఆగస్టు 28లోనే ప్రధాని మోడీ భుజ్‌లో స్మృతి వన్ మెమోరియల్‌ను ఆవిష్కరించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ విషయాన్ని ట్విట్టర్ వేదికగా పంచుకున్నారు. కుచ్ ప్రజలు మాత్రం దీనితో తమకు ఏం లాభమని ప్రశ్నించారు. "నేను ఆ మెమోరియల్‌ను చూడలేదు. చూడాలనీ అనుకోవటం లేదు. దానితో మేము ఏం చేస్తాం" అని కుచ్‌వాసి కైన్యాభాయ్ (53) అన్నారు." ప్రభుత్వం మాకు సాయం అందించలేదు. చాలినంత పరిహారమివ్వలేదు. అందుకే మేము దీనిని (మెమోరియల్) తిరస్కరించాం" అని మరొక వ్యక్తి (74) తెలిపారు. 2001, జనవరి 26న ప్రకృతి విపత్తు చోటు చేసుకున్న సమయంలో చిన్నారులుగా ఉన్నవారిలో చాలా మంది ఇప్పుడు వయోజన ఓటు హక్కును పొందారు.

ప్రభుత్వం ఆ సమయంలో భూకంప బాధితులకు ఇళ్లు అందజేసింది. అయితే, దాని మీద వారికి యాజమాన్య హక్కులు ఇప్పటికీ అందలేదు. దీనిపై బాధితులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. మాకు ఇళ్లు ఇచ్చినా.. అవి ఇప్పటికీ మా సొంతం కాలేదని కుచ్ స్థానికులు చెప్పారు. "నేను వేరే ప్రదేశానికి వెళ్లాలనుకుంటున్నాను. డబ్బులు లేకపోవటంతో నా ఇంటిని అమ్మాలి. అయితే, నేను అలా చేయలేను. ఎందుకంటే నాకు ఇచ్చిన ఇళ్లు నా పేరు మీద నమోదై లేదు. కాబట్టి దీనిని నేను అమ్మలేను" అని అధోయ్ గ్రామానికి చెందిన రాంచోడ్‌భాయ్ చెప్పారు.

ఇక్కడ ఉండే చాలా మందిది ఇదే సమస్య. "మహారాష్ట్రలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు 1500 నుంచి 2000 ఇండ్లు భూకంప బాధితుల కోసం నిర్మించింది. 22 ఏళ్లు గడుస్తున్నా ఈ ఇళ్లు గుజరాత్ ప్రభుత్వ పరిధిలోకి వచ్చే సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుల్లో రిజిస్టర్ కాలేదు. దీంతో ఇళ్లపై హక్కు లేకపోవటంతో వారు వీటిని అమ్మలేకపోతున్నారు" అని గ్రామ సర్పంచ్ వాంకర్‌భాయ్ చెప్పారు. ఆ సమయంలో గుజరాత్ ప్రభుత్వం రూ. 90వేలు పరిహారంగా ప్రకటించింది. అయితే, ఈ పరిహారమూ బాధితులందరికి సరిగ్గా అందలేదు. కొందరికి రూ. 60వేల అందితే.. మరికొందరికి రూ. 30వేలు, 40వేలు మాత్రమే అందాయని వాంకర్‌భాయ్ చెప్పారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎన్నిసార్లు సంప్రదించినప్పటికీ ఎలాంటి పరిష్కారమూ లభించలేదన్నారు.

తాము ఇప్పటికీ భూకంపం షాక్ నుంచి కోలుకోలేదని స్థానికులు చెప్పారు. ఇలాంటి సమయంలో బాధితులు పరిహారం, ఇళ్ల యాజమాన్య హక్కులు కల్పించటంపై దృష్టి పెట్టాలన్నారు. స్మృతివన్‌తో లాభం ఏమిటనీ, అక్కడకు ఎవరు వెళ్తారని ప్రశ్నించారు. గుజరాత్ ప్రభుత్వం స్మృతి వనాలపై దృష్టి తగ్గించి బాధితులకు కావాల్సినదేమిటో అర్థం చేసుకొని అటువైపుగా పని చేయాలని కుచ్ వాసులు అన్నారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆర్యవైశ్యుల ఐక్యత, అభ్యున్నతికి కృషి చేస్తామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. మంగళవారం రాత్రి నగరంలోని సుజాత కన్వెన్షన్‌లో ఆర్యవైశ్య ఆత్మీయ అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా వెంకటేశ్వర ఆలయం నుంచి కోలగట్లను ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం సత్కరించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ తాను సామాన్య కార్యకర్తగా 1983లో రాజకీయ రంగ ప్రవేశం చేసానని అన్నారు. ఎన్నో ఒడిదుడుకులు పడి, శాసన సభ్యునిగా ఓటమి చెందినా, టిడిపి వారు హేళన చేసిన, మొక్క ఓని దీక్షతో, తాను జీవితంలో ఒక్కసారి అయినా అశోక గజపతిరాజు పై గెలుస్తానని చెప్పడం జరిగిందన్నారు.

15 రోజుల్లో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ

- మండలాల వారీ సదరం క్యాంపులు
- ఎస్‌సి వసతి గృహాల శాశ్వత భవనాలకు కృషి
- ఎస్‌సి సంక్షేమ కమిటీ చైర్మన్ బాబూరావు

ప్రజాశక్తి-విజయనగరం

వచ్చే 15 రోజుల్లో అన్ని శాఖల్లోనూ ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కమిటీ చైర్మన్ గొల్ల బాబూరావు తెలిపారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, సంబంధిత అధికారులపై చర్యలకు సిఫార్సు చేస్తామని అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం కలెక్టర్ సూర్య కుమారి ఆధ్వర్యంలో ఎస్‌సి సంక్షేమ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు శాఖల ద్వారా ఎస్‌సిలకు అమలు చేస్తున్న పథకాలు, ఖర్చు చేస్తున్న నిధులపై సమీక్షించారు. బ్యాక్ లాగ్ పోస్టుల నియామకానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అవరోధాలూ లేవని, పోస్టులకు తగ్గ అర్హత గల అభ్యర్థులు లేకపోతే సడలింపు కోసం ప్రభుత్వానికి రాసి నియామకాలు జరపాలని సూచించారు. ఎస్‌సిల కోసం కేటాయించిన నిధులను ఖర్చు చేయడం లో అధికారులు చిత్త శుద్ధి చూపాలన్నారు. పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో ఎస్‌సి వారికీ వేరేగా కేటాయించకుండా ఇతరులతో కలిపి వారి మధ్యనే గృహాలు కేటాయించాలని సూచించారు. హౌసింగ్ పీడీ రమణ మూర్తి మాట్లాడుతూ జగనన్న లే ఔట్లలో అన్ని ప్రాథమిక వసతులతో కూడిన గృహాలను12 శాతం ఎస్‌సిలకు కేటాయించినట్లు తెలిపారు. చేయూత పథకం కింద ఎంత మంది ఎస్‌సిలకు లబ్ధి చేకూరిందని చైర్మన్ అడగడంతో డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ సుమారు రూ.84 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. సామాజిక పరంగా రుణాలు అందించి ప్రోత్సహించాలని, చేయూత కింద పాడి గేదెలను అందించాలని చైర్మన్ తెలిపారు. వికలాంగులకు సదరం సర్టిఫికేట్ల జారీకి ప్రతి మండలంలో ప్రతి నెలా సదరం క్యాంపులను ఏర్పాటు చేసి వారికి సదరం సర్టిఫికేటలను అందజేయాలని సూచించారు. అర్హతను బట్టి పింఛను కూడా వంజూరు చేయాలన్నారు. జిల్లా పరిషత్ నిధుల నుండి ఎస్‌సిలకు 15 శాతం కేటాయిస్తున్నామని జెడ్‌పి సిఇఒ డాక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా ద్వారా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయాలని తెలపగా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఇ ఉమా శంకర్ స్పందిస్తూ ఈ పథకం కింద ఇప్పటికే 12.9 శాతం ఎస్‌సిలను కవర్ చేసినట్లు తెలిపారు. కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ జిల్లాలో 30 వసతి గహాలు ఉన్నాయని, వాటిలో 6 వసతి గృహాలు ప్రైవేటు భవనాల్లో ఉన్నాయని, వాటికీ శాశ్వత భవనాలను నిర్మించాలని కోరారు. జిల్లా యంత్రాంగం తరపున స్థలం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. చైర్మన్ స్పందిస్తూ రాత పూర్వకంతా ప్రతిపాదనలను తయారు చేసి ఇవ్వాలని తెలిపారు. జిల్లా ఎస్‌పి దీపిక పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో ఈఏడాది 93కేసులు ఎస్‌సిలపై నమోదు అయ్యాయని, అందులో 3 కేసులు విచారణ లో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో సభ్యులు అలజంగి జోగారావు, కంబాల జోగులు, చిట్టిబాబు, ఎంఎల్‌సి శ్రీనివాసులు రెడ్డి, ఇందుకూరి రఘు రాజు, సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్‌ఒ గణపతి రావు, సోషల్ వెల్ఫేర్ డిడి సుధాకర్ , పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థులకు నేటి నుంచి ముఖ ఆధారిత హాజరు

- హాజరు 75 శాతం ఉంటేనే విద్యాదీవెన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థులకు ముఖ ఆధారిత హాజరు గురువారం నుంచి అమలు కానుంది. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టుగా కొన్ని కళాశాలల్లో అమలు చేసిన ఉన్నత విద్యాశాఖ గురువారం నుంచి రాష్ట్రమంతా అమలు చేయనుంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థుల ఫోటోలు తీసే ప్రక్రియ పూర్తయిందని ఇంజనీరింగ్, పిజి కళాశాలల్లో అమలు కావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. నూతన పద్ధతిలో తరగతి గదిలో ఉన్న విద్యార్థులను విడివిడిగా కాకుండా ఒకేసారి ఫొటో తీయనున్నారు. ఉదయం కళాశాలకు వచ్చినప్పుడు ఒకసారి, తిరిగి ఇంటికెళ్లే సమయంలో మరోసారి విద్యార్థులను లెక్చరర్ ఫోటోలు తీస్తారు. ఈ ఫోటో తీసిన సమయంలో విద్యార్థుల పేర్లు, వారి సమాచారం, హాజరును సాఫ్ట్‌వేర్ ఆటోమెటిక్‌గా తీసుకుంటుంది. ప్రస్తుతం ఈ విధానం అమలు చేసే దశలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని వీటిని సరిచేస్తామని చెబుతున్నారు. విద్యార్థుల హాజరు 75 శాతం ఉంటేనే జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు వర్తిస్తాయని అధికారులు చెబుతున్నారు. కొన్ని కళాశాలలు ఫీజు రీయంబర్స్‌మెంట్ కోసం విద్యార్థులు రాకపోయినా హాజరు వేయిస్తున్నాయని వీటిని అరికట్టేందుకే ఈ యాప్‌ను తీసుకొస్తున్నామని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం

ప్రజాశక్తి-పార్వతీపురం

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, అందుకు అధికారులంతా సహకారం అందించాలని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలుపై జెసి ఒ.ఆనంద్, సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులతో సమీక్షించారు. జిల్లాలో ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఏమైనా సమస్యలుంటే వాటిని సిఎం, సంబంధిత శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. జెసి ఆనంద్ మాట్లాడుతూ బ్యాంకు గ్యారంటీలు రావాల్సి ఉందన్నారు. జిల్లాలో 15 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పౌర సరఫరాల జిల్లా మేనేజర్ ఎం.దేవుళ్ల నాయక్ మాట్లాడుతూ 1.91 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యమన్నారు. జిల్లాలో 188 ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. జిల్లాలో 8,86,465 గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. ధాన్యం కొనుగోలు ప్రారంభమైందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, జిల్లా సరఫరాధికారి కె.వి.ఎల్.ఎన్ మూర్తి, జిల్లా సహకార అధికారి బి.సన్యాసి నాయుడు, గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్ర కుమార్, వైకెపి ఎపిడి వై.సత్యంనాయుడు, రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొత్తకోట రమేష్, జిల్లా టాక్స్ అడ్వైజర్ గంటా అబ్బాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం


రాజధాని - సుప్రీం కోర్టు

రాష్ట్ర రాజధాని అంశం విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు, చేసిన వ్యాఖ్యలు ఆహ్వానించదగినవిగా ఉన్నాయి. ముఖ్యంగా రాజధాని నిర్మాణం కోసం భూములిచ్చిన రైతుల హక్కుల గురించి ధర్మాసనం ప్రత్యేకంగా ప్రస్తావించిన తీరు హర్షణీయం. రాజధానిని తమ ప్రాంతం నుండి తరలించినా, పేరుకే పరిమితం చేసినా తమ గతి, పిల్లల భవిష్యత్తు ఏమవుతుందంటూ ఆందోళన చెందుతున్న రైతులకు అత్యున్నత న్యాయస్థానం చూపిన చొరవ, ప్రభుత్వాన్ని వేసిన ప్రశ్నలు కొంత మేరకు ఊరటనిస్తాయి. పార్లమెంటు చేసిన రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ (విభజన) చట్టాన్ని, అందులో ఒకే రాజధాని అని అర్ధం వచ్చేలా పేర్కొన్న 'ది క్యాపిటల్' అనే పదాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది. ఆ చట్టంలో సవరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేనప్పుడు, అందులోని అంశాలను మార్చే అధికారం ఎలా ఉంటుందని నిలదీసింది. అదే సమయంలో రాజధాని ఒకచోట, హైకోర్టులు మరో చోట ఉన్న వివిధ రాష్ట్రాల వివరాలనూ పేర్కొంది. గత ప్రభుత్వం రూపొందించి, భూములు సమీకరించిన సిఆర్‌డిఎ చట్టాన్ని కూడా సుప్రీంకోర్టు ప్రస్తావించింది. అభివృద్ధిని ఆశించి చట్టబద్ధంగా భూములు వదులుకున్న 29 వేల మంది రైతులకు ఇచ్చిన హామీని ఎలా ఉల్లంఘిస్తారని, సిఆర్‌డిఎ చట్టాన్ని అమలు చేయకపోతే ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసినట్టు కాదా అని ప్రశ్నించింది. ప్రజాస్వామ్యంలో పాలకులు మారవచ్చు, కానీ ప్రభుత్వమన్నది నిరంతర ప్రక్రియ. అత్యున్నత న్యాయస్థానం రైతాంగానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి సంధించిన ప్రశ్నలలో ఈ స్ఫూర్తే కనిపిస్తుంది. రాజధాని ప్రాంతంలోని కొన్ని పనులను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయాలంటూ, ఆరు నెలల్లో అమరావతి నగరాన్ని నిర్మించాలంటూ హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలు ఆచరణలో సాధ్యం కావు. ఇటువంటి ఐదు అంశాలపై స్టే ఇవ్వడం, ఆ సందర్భంగా సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు ఆచరణాత్మకంగా అనిపిస్తున్నాయి.

ఈ విచారణ సందర్భంగానే మరో కీలకాంశమైన కర్నూలుకు హైకోర్టు తరలింపు కూడా ప్రస్తావనకు వచ్చింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన అంశాలకు, కోర్టు బయట మంత్రులు చేస్తున్న వ్యాఖ్యలకు పొంతన లేకుండా ఉంది. ధర్మాసనం అడిగిన ప్రశ్నలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున వాదించిన న్యాయవాది అమరావతిలోనే హైకోర్టు ఉంటుందని స్పష్టంగా చెప్పారు. దీనిపై కోర్టు రెట్టించి అడిగినప్పుడు కూడా మూడు రాజధానుల చట్టం రద్దు అయింది కాబట్టి, హైకోర్టు అమరావతిలోనే ఉంటుందని ఆయన అన్నారు. 'మరో చట్టం తెస్తే దానిలో ఏముంటుందో తనకు తెలియదని, ఇప్పటికైతే సిఆర్‌డిఎనే అమలులో ఉందని, దాని ప్రకారం హైకోర్టు అమరావతిలోనే ఉంటుంది' అని ప్రభుత్వ న్యాయవాది ధర్మాసనానికి వివరించారు. వికేంద్రీకరణ పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం కోర్టులో గట్టిగా ఎందుకు చెప్పలేకపోయిందన్నది పలువురి సందేహం. పైగా ఏయే రాష్ట్రాల్లో హైకోర్టులు, రాజధాని నగరాలు వేరువేరుగా ఉన్నాయో న్యాయమూర్తులు స్పష్టంగా చెప్పిన తరువాత కూడా నీళ్లు నమలాల్సిన పరిస్థితి ప్రభుత్వానికి ఎందుకొచ్చింది? మరోవైపు కోర్టులో సందర్భానుసారం లాయర్ చెప్పిన మాటలన్నీ ప్రభుత్వ విధానాలైపోతాయా? అని మంత్రులు న్యాయస్థానం బయట ప్రశ్నిస్తున్నారు. ఈ తరహా వైఖరి ప్రజలలో మరింత పలచన కావడానికే తప్ప ప్రభుత్వానికి మరే విధంగానూ ఉపయోగపడదు.

సుప్రీంకోర్టులో జరిగినవి ప్రాథమిక వాదనలే! ఆ పరిమితిలోనే కొన్ని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు వాస్తవిక దృక్పథంతో వ్యవహరించాలి. తమ పార్టీతో పాటు, రాష్ట్రంలోని ఇతర పార్టీలు ఆమోదించి, బలపరిచిన అమరావతిని రాష్ట్రానికి ఏకైక రాజధానిగా అభివృద్ధి చేయాలి. హైకోర్టును కర్నూలులో ఏర్పాటు చేయాలి. ఉత్తరాంధ్రతో పాటు, రాష్ట్రంలో వెనుకబడిన ఇతర ప్రాంతాల అభివృద్ధికి ఆచరణాత్మక ప్రణాళికను రూపొందించాలి. విజభన చట్టం ప్రకారం నిధులు రాబట్టడానికి, ఆ చట్టంలోని ఇతర హామీల అమలుకు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలి. అధికార పార్టీ చొరవ తీసుకుని అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. రాష్ట్రాభివృద్ధికి ఈ తరహా దృక్పథమే దోహదం చేస్తుందన్న విషయాన్ని పాలకులు గుర్తించాలి.

మంచి మాట



వ్యవస్థ చట్టం మీద ఆధారపడదు. చట్టమే వ్యవస్థను బట్టి నడుస్తుంది.
- కారల్ మార్క్స్

Karl Marx

విశ్లేషణ

ప్రపంచ బ్యాంకు నివేదిక - పట్టణ ప్రజలపై పిడుగు

భారత దేశ పట్టణ, నగరాలపై ప్రపంచ బ్యాంకు అధ్యయనం చేసి ఒక నివేదికను విడుదల చేసింది. భారత్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణీకరణ, పట్టణ జనాభా అవసరాలను తీర్చటానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించటానికి రాబోయే 15 ఏళ్లలో కనీసం 840 బిలియన్ డాలర్లు కావాలని ప్రపంచ బ్యాంకు తన నివేదికలో పేర్కొన్నది. మౌలిక సదుపాయాల కల్పనలో ప్రతి ఏడాది సగటున 55 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టాలని, ఇది దేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో 1.18 శాతానికి సమానమని చెప్పింది. పెరుగుతున్న జనాభాకు ప్రజలకు అందుతున్న సేవలకు మధ్య పెద్ద అగాధం ఉందని ఈ లోటును పూడ్చటానికి ప్రభుత్వం, స్థానిక సంస్థల దగ్గర తగిన నిధులు లేవని...అందువల్ల ప్రైవేట్ వ్యాపార, వాణిజ్య సంస్థల నుండి అప్పుల ద్వారా సమకూర్చుకోవాలని ఆదేశించింది. అలాగే మౌలిక సదుపాయాల కల్పనను ప్రైవేట్ రంగానికి అప్పజెప్పాలని అలాగే ప్రజలకు అందిస్తున్న పౌర సేవల నిర్వహణకు సరిపడా యూజర్ చార్జీలు వసూలు చేయాలనే ప్రమాదకర సిఫార్సులు చేసింది.



డా॥ బి.గంగారావు

"భారతదేశ పట్టణ మౌలిక సదుపాయాలకు అవసరమైన నిధులు మరియు వాణిజ్య పెట్టుబడులకు పరిమితులు తీసుకోవాల్సిన విధానపరమైన విధానాలు" అనే పేరుతో ప్రపంచ బ్యాంకు నవంబర్ 14న నివేదిక విడుదల చేసింది. నివేదికలోని ముఖ్య అంశాలను పరిశీలిస్తే ప్రస్తుత దేశ పట్టణ జనాభా 47 కోట్లు ఉందని అది 2036 నాటికి 60 కోట్లకు చేరుతుందని ఇది దేశ జనాభాలో 40 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపింది. పెరుగుతున్న ఈ జనాభాకు అవసరమైన మున్సిపల్ సేవలైన మంచినీటి సరఫరా, మురుగునీటి కాలువలు, పారిశుధ్యం, రోడ్లు, స్మార్ట్ లైటింగ్, సామాజిక, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు 450 బిలియన్ డాలర్లు అవసరమవుతాయి. మరో 300 బిలియన్ డాలర్లు మెట్రో, ప్రధాన రవాణా రహదారులు (మాస్ ట్రాన్సిట్) కు ఖర్చు చేయవలసి ఉంటుంది. మొత్తం పట్టణ మౌలిక సదుపాయాల కల్పనలో కాపిటల్ వ్యయానికి సగటున జిడిపి లో 0.6 శాతం నిధులు కావాల్సి ఉంటుందని ప్రపంచ బ్యాంకు తెలిపింది.

దేశంలోని ప్రస్తుత పట్టణ స్థానిక సంస్థలు ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేయగలిగిన పరిస్థితిలో లేవు. నేడు పట్టణ స్థానిక సంస్థలు మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేస్తున్న నిధుల్లో 75 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి వస్తున్నాయని, కేవలం 15 శాతం మాత్రమే స్థానిక సంస్థలు తమ సొంత ఆదాయాల నుండి సమకూర్చుకుంటున్నాయని నివేదిక చెప్పింది. ఆస్తి పన్ను ద్వారా వచ్చే ఆదాయం కూడా చాలా నామమాత్రంగా ఉందని, అది కూడా ఎదుగుబొదుగు లేకుండా ఉందని, 2011-18 మధ్యకాలంలో చూస్తే కేవలం దేశ జిడిపి లో 0.15 శాతం మాత్రమే ఉందని వాపోయింది. అదే మధ్య తరహా ఆదాయ దేశాల్లో చూస్తే ఆ దేశాల జిడిపి లో 0.3 నుండి 0.6 శాతం మధ్య ఆస్తిపన్ను ద్వారా వచ్చే ఆదాయం ఉందని పేర్కొంది. తక్కువ ఆదాయాల వల్ల స్థానిక పట్టణ సంస్థలు దేశంలో అమలవుతున్న పట్టణ పథకాలను కూడా పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నాయి. ఉదాహరణకు గడిచిన ఆరేళ్లలో స్మార్ట్ సిటీ పథకం కింద 27 బిలియన్ డాలర్లు, అమృత పథకం కింద 10 బిలియన్ డాలర్లు విలువ గల ప్రాజెక్టులు ఆమోదించబడగా... వాటిలో వరుసగా కేవలం 22 శాతం, 18 శాతం మాత్రమే పూర్తి చేయగలిగాయని నివేదిక తెలిపింది. అలాగే పట్టణ స్థానిక సంస్థలు స్వల్ప ఆదాయానికే పరిమితమవ్వటం వల్ల రుణ సామర్థ్యాన్ని కోల్పోతున్నాయని చెప్పింది.

దేశంలో పౌరసేవలకు అమలు చేస్తున్న యూజర్ చార్జీలు చాలా దారుణంగా ఉన్నాయని, సేవలకు నామమాత్రంగా రుసుములు వసూలు చేయాలనే విధానం పట్టణ స్థానిక సంస్థల ఆదాయానికి గండి కొడుతున్నదని, ఈ విధానం ప్రైవేట్ పెట్టుబడులను నిరుత్సాహ పరుస్తున్నదని, కనుక ఈ సంస్థల ఆర్థిక స్థిరత్వానికి తప్పనిసరిగా మౌలిక సదుపాయాలపై పెట్టిన ఖర్చును తిరిగి యూజర్ చార్జీల రూపంలో పూర్తిగా రాబట్టాలని ఆదేశించింది.

భారతదేశంలో గత రెండు దశాబ్దాల్లో పట్టణ రంగంలో అమలు చేసిన ప్రభుత్వ-ప్రైవేట్-భాగస్వామ్య (పిపిపి) పథకాలను కూడా సమీక్షించింది. 2000 సంవత్సరం నుండి నేటి వరకు కేవలం 5 బిలియన్ డాలర్లు విలువగలిగిన పిపిపి ప్రాజెక్టులు మాత్రమే అమలు జరగాయని, ఇవి చాలా నామమాత్రమని పేర్కొన్నది. అలాగే 2007-12 మధ్య కాలంలో పిపిపి ప్రాజెక్టులు గణనీయంగా పెరిగినప్పటికీ ఆ తరువాత బాగా తగ్గిపోయాయని ఆందోళన వెలిబుచ్చింది. 2000 సంవత్సరం నుండి ఆమోదించబడ్డ మొత్తం పిపిపి పెట్టుబడుల్లో కేవలం మూడింట ఒక వంతు మాత్రమే ఆచరణ నోచుకుందని గత దశాబ్దంలో చూస్తే కేవలం 55 ప్రాజెక్టుల్లో 17 బిలియన్ డాలర్లు పెట్టుబడి మాత్రమే పెట్టబడిందని తెలిపింది.

స్థూలంగా ప్రపంచ బ్యాంకు నివేదిక సిఫార్సు చేసిందేమంటే దేశ పట్టణ జనాభా వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో పట్టణ, స్థానిక సంస్థలు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించలేకపోతున్నాయి కాబట్టి ఆ బాధ్యత నుండి వైదొలిగి ప్రైవేట్ సంస్థలపరం చేయాలని ఆదేశిస్తున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మీద నిధులు, గ్రాంట్లు కొరకు ఆధారపడకుండా ప్రైవేట్ వ్యాపార, వాణిజ్య సంస్థల నుండి సమకూర్చుకోవాలని సూచించింది.

ఆస్తి పన్ను పెంచి ఆదాయాన్ని పెంచుకోవాలి. పౌరసేవలకు, మౌలిక సదుపాల కల్పనపై చేస్తున్న వ్యయాన్ని పూర్తిగా (కాస్ట్ రికవరీ) ప్రజల నుండి యూజర్ చార్జీల రూపంలో వసూలు చేయాలి. వీటి అమలుకు ఆటంకంగా ఉన్న విధానాలన్నింటిని మార్చేసి ప్రైవేట్ పెట్టుబడులకు స్వేచ్ఛ కల్పించాలని తెలిపింది.

భారత పట్టణ రంగంలో పాలకులు అమలు చేయాల్సిన విధానాల గురించి ప్రపంచ బ్యాంకు నివేదిక వెలువరించడం ఇదే మొదటిసారి కాదు. 1991లో ప్రారంభించబడ్డ సరళీకరణ విధానాల్లో భాగంగా అనేక నివేదికలను పట్టణ సంస్కరణల అమలుకు విడుదల చేసింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి పట్టణాభివృద్ధిలో దేశం అనుసరిస్తూ వస్తున్న విధానాలను మార్చి సైద్ధాంతికంగా ప్రైవేటీకరణ విధానాల వైపు పట్టణ వ్యవస్థను మార్చేందుకు ప్రపంచ బ్యాంకు, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నాయి. 1994 లోనే ఇండో-యూఎస్ (ఫైర్-డి) అనే పథకాన్ని ప్రారంభించాయి. ప్రణాళికాసంఘం మీద ఒత్తిడి తీసుకొచ్చి మొదటి సారిగా 8వ పంచవర్ష ప్రణాళికలో పౌరసేవలకు కాస్ట్ రికవరీ విధానాన్ని ప్రవేశపెట్టించింది. ఆ తరువాత ప్రతి ప్రణాళిక లోను వివిధ రూపాల్లో పట్టణ సంస్కరణల అమలుకు చేపట్టాల్సిన చర్యలను ప్రవేశపెట్టబడ్డాయి. 2004, 2009లో కూడా ప్రపంచ బ్యాంకు పట్టణ రంగంలో భారత్ అనుసరించాల్సిన సంస్కరణలపై ప్రత్యేక నివేదికలు ఇచ్చింది. విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు, పెట్టుబడులు, విద్యుత్, రహదారులు, నీటి ప్రాజెక్టులు తదితర రంగాల్లో దేశంలోను, వివిధ రాష్ట్రాల్లోను, ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్రం లోను అమలు చేయాల్సిన విధానాల గురించి అనేక నివేదికలు ప్రపంచ బ్యాంకు గతంలో ఇచ్చింది. ఇప్పుడు దేశ వ్యాప్తంగా పట్టణ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చేయటానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నది. ఈ సంస్కరణల అమలుకు గ్రాంట్లు, రుణాలు ప్రపంచ బ్యాంకు ఇస్తుంది. ఇప్పుడు దేశంలో చాలా నగరాలు, పట్టణాల్లో ప్రపంచ బ్యాంకు నిధులతో అనేక కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయి. ఇవన్నీ సంస్కరణలతో ముడిపెట్టినవే. గతంలో జవహర్‌లాల్ నెహ్రూ పట్టణ ఆధునీకరణ మిషన్ (జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం)కు ప్రపంచ బ్యాంకు నిధులు మంజూరు చేసింది. నిధులిచ్చి ఈ పథకం ద్వారా దేశంలోని 63 నగరాల్లో అనేక సంస్కరణలు అమలు చేయించింది.

మున్సిపల్ సంస్థలకు నిధుల కోసం 2003లో ప్రత్యేకంగా అంతర్జాతీయ ఫైనాన్షియల్ కార్పొరేషన్‌ను కూడా ఏర్పాటు చేసింది. 2006లో టెక్నికల్ అసిస్టెంట్ గ్రాంట్లను, పూల్డ్ మున్సిపల్ ఫైనాన్స్ వంటి సంస్థలను ప్రవేశపెట్టింది. ఇలా అనేక రకాల ఏజెన్సీల ద్వారా ప్రపంచ బ్యాంకు భారత పట్టణ వ్యవస్థలో ప్రత్యక్షంగా జోక్యం చేసుకుంటున్నది.

ప్రపంచబ్యాంకు ఆదేశాలకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయి. పట్టణ రంగంలో అనుసరిస్తున్న విధానాలను మార్చేస్తున్నాయి. గడిచిన రెండు దశాబ్దాలలో కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీలన్నీ ప్రపంచబ్యాంకు సూచించిన విధానాలను ముందుకు తీసుకెళ్ళేందుకు అనేక సిఫార్సులు చేసాయి. గతంలో కేంద్ర పట్టణ మంత్రిత్వ శాఖ నియమించిన హైపవర్ కమిటీ కూడా నేడు ప్రపంచ బ్యాంకు తాజా నివేదికలో పేర్కొన్న అంశాలనే సూచించింది. 2012-30 కాలంలో సుమారు రూ. 39.2 లక్షల కోట్లు పెట్టుబడులు పట్టణ మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమని హైపవర్ కమిటి తన నివేదికలో పేర్కొంది. ఈ స్థాయిలో నిధులను స్థానిక, పట్టణ సంస్థలు సమకూర్చుకోలేవు కాబట్టి మౌలిక సేవల కల్పనను ప్రైవేట్ రంగానికి ఇవ్వాలని, పట్టణ సంస్థలు తమ పరిధిలో ఆదాయాలు పెంచుకోవటానికి పన్ను, పన్నేతర ఆదాయాల సంస్కరణలు చేపట్టాలని సిఫార్సు చేసింది. ఇటీవల నరేంద్ర మోడీ తీసుకొచ్చిన నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైప్‌లైన్ 2025 నాటికి మన దేశ పట్టణ వ్యవస్థ అభివృద్ధికి రూ.19 లక్షల కోట్లు అవసరమని, అందుకు కొత్తగా చేపట్టే మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఇప్పటికే ఉన్న పౌర సేవలు, మౌలిక సదుపాయాలను పిపిపి, ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేయాలని నిర్ణయించింది. ఇటీవల రిజర్వుబ్యాంకు (ఆర్.బి.ఐ) విడుదల చేసిన నివేదిక కూడా స్థానిక మున్సిపల్ సంస్థలు ప్రైవేట్ వాణిజ్య సంస్థల నుండి అప్పుల ద్వారా, బాండ్లు ద్వారా ఆదాయాలు సమకూర్చుకోవాలని తెలిపింది.

మొత్తంగా భారతదేశంలో పట్టణ సంస్కరణలను వేగంగా అమలు చేయడం కోసం రకరకాల పేర్లతో ప్రపంచబ్యాంకు ఆదేశాలతో నివేదికలు రూపొందించబడుతున్నాయి. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రైవేట్ పెట్టుబడులకు పూర్తి స్వేచ్ఛను కల్పిస్తూ పట్టణ విధానాలను మార్చేస్తున్నది. నీతి ఆయోగ్ ఈ విధానాల అమలుకు ప్రత్యక్ష పర్యవేక్షణ ప్రపంచ బ్యాంకుతో కలిసి చేస్తున్నది. రాబోయే కాలంలో పట్టణ పరిపాలనా వ్యవస్థపై మున్సిపల్ కౌన్సిల్ పాత్ర పూర్తిగా నామమాత్రం అవుతుంది. పౌరసేవలు, మౌలిక సదుపాయాలు, ఉమ్మడి ఆస్తులన్నీ ప్రైవేట్ పెట్టుబడికి బదిలీ అవుతాయి. మున్సిపల్ సంస్థలు ప్రైవేట్ కంపెనీల వలె అప్పులు సమకూర్చుకుంటూ, లాభ-నష్టాల ప్రాతిపదికన నడపబడతాయి. ప్రజలపై విభిన్న రూపాల్లో పన్నుల భారాలు మోపబడతాయి.

(వ్యాసకర్త సెల్ : 9490098792)



భారతదేశంలో పట్టణ సంస్కరణలను వేగంగా అమలు చేయడంకోసం రకరకాల పేర్లతో ప్రపంచబ్యాంకు ఆదేశాలతో నివేదికలు రూపొందించబడుతున్నాయి. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రైవేట్ పెట్టుబడులకు పూర్తి స్వేచ్ఛను కల్పిస్తూ పట్టణ విధానాలను మార్చేస్తున్నది. నీతి ఆయోగ్ ఈ విధానాల అమలుకు ప్రత్యక్ష పర్యవేక్షణ ప్రపంచబ్యాంకుతో కలిసి చేస్తున్నది. రాబోయే కాలంలో పట్టణ పరిపాలనా వ్యవస్థపై మున్సిపల్ కౌన్సిల్ పాత్ర పూర్తిగా నామమాత్రం అవుతుంది. పౌరసేవలు, మౌలిక సదుపాయాలు, ఉమ్మడి ఆస్తులన్నీ ప్రైవేట్ పెట్టుబడికి బదిలీ అవుతాయి. మున్సిపల్ సంస్థలు ప్రైవేట్ కంపెనీల వలె అప్పలు సమకూర్చుకుంటూ, లాభ-నష్టాల ప్రాతిపదికన నడపబడతాయి. ప్రజలపై విభిన్న రూపాల్లో పన్నుల భారాలు మోపబడతాయి.

స్థూలంగా ప్రపంచ బ్యాంకు నివేదిక సిఫార్సు చేసిందేమంటే దేశ పట్టణ జనాభా వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో పట్టణ, స్థానిక సంస్థలు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించలేకపోతున్నాయి కాబట్టి ఆ బాధ్యత నుండి వైదొలిగి ప్రైవేట్ సంస్థలపరం చేయాలని ఆదేశిస్తున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మీద నిధులు, గ్రాంట్లు కొరకు ఆధారపడకుండా ప్రైవేట్ వ్యాపార, వాణిజ్య సంస్థల నుండి సమకూర్చుకోవాలని సూచించింది.

సమస్య

సన్నగిల్లుతున్న మహిళా శ్రామికశక్తి

ప్రపంచ జనాభా 800 కోట్లకు చేరింది. 2023 నాటికి అనగా వచ్చే సంవత్సరంలో ప్రపంచంలోనే అతి పెద్ద జనాభా కలిగిన దేశంగా భారత్ చరిత్ర పుటల్లో నిలవనుంది. రాబోయే 25 సంవత్సరాల కాలంలో ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశంగా భారత్ ఆవిర్భవిస్తుంది. దేశంలో మహిళలు 49 శాతంగా ఉన్నారు. కాని... ప్రస్తుత లేబర్ మార్కెట్‌లో మహిళా భాగస్వామ్యం "ఫిమేల్ లేబర్‌ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్ (ఎఫ్.ఎల్.ఎఫ్.పి.ఆర్) ప్రపంచ దేశాల కంటే చాలా తక్కువగా ఉన్నట్లు ప్రపంచ బ్యాంక్ తెలిపింది. మరొక మాటలో చెప్పాలంటే క్షీణించింది. 2000 సంవత్సరానికి ముందు మహిళల వర్క్‌ఫోర్స్ 30.5 శాతంగా ఉంటే, 2019 నాటికి 21.1 శాతానికి తగ్గింది. ఇది మరింత దిగజారి 2020 నాటికి 18.6 శాతంగా ఉన్నట్లు ఐ.యల్.ఓ పేర్కొంది. దీనికి ప్రధాన కారణం పట్టణాల్లో మహిళలు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కోల్పోవడం. కోవిడ్ కాలంలో లాక్‌డౌన్ కర్ఫ్యూ వలన పరిశ్రమలు మూతపడ్డాయి. గతేడాది శ్రామికశక్తిలో మహిళల భాగస్వామ్యం విషయమై 'ది గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్ట్ ఆఫ్ ది వరల్డ్ ఎకనామిక్ ఫోరం' వారు 156 దేశాలను పరిశీలించగా మన దేశం 140వ స్థానంలో నిలవడం శోచనీయం.

2004-05 మధ్య కాలంలో 14.86 కోట్ల మంది మహిళలు వర్క్ ఫోర్స్‌లో ఉండగా, 2017-18 నాటికి 10.41 కోట్ల మంది మాత్రమే ఉన్నట్టు తెలుస్తోంది. మహిళలు నేటికీ ఎక్కువగా వ్యవసాయ రంగంలోనే ఉపాధి పొందుతున్నారు. ఇతర రంగాలలో ఎక్కువ ఉపాధి అవకాశాలు లభించటం లేదు. 90 శాతం మహిళలు అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. ఇంకా లింగ వివక్షత, అరకొర వేతనాలు, కొరవడిన సామాజిక రక్షణ, ఉద్యోగాల లేమి మహిళలను వెంటాడుతూనే ఉన్నాయి. భారతదేశంలో స్త్రీపురుష వేతనాలలో భారీ వ్యత్యాసం ఉన్నట్లు ఆక్స్‌ఫామ్ ఇండియా డిస్క్రిమినేషన్ రిపోర్ట్-2022 తెలిపింది. అవిద్య, పని అనుభవం లేకపోవడం, నైపుణ్యాలు కొరత దీనికి దీనికి కారణంగా ఉంది. 2019-20లో సుమారు 60 శాతం మగవారు రెగ్యులర్ వేతనాలు పొందుతుండగా, మహిళలు కేవలం 5 శాతంగా ఉన్నట్లు సమాచారం. అమ్మాయిలు ప్రధానంగా కుటుంబ బాధ్యతలు చేపడుతున్నారు. పిల్లల పోషణ, వృద్ధుల సంరక్షణ కోసం సమయం కేటాయించే పరిస్థితి ఏర్పడింది. "ది ఎకనామిక్ ఫోరం సర్వే 2020" ప్రకారం సుమారు 60 శాతం మహిళలు (15-59 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు) ఇంటి పనిలో నిమగ్నమయ్యారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా కొరతగా ఉన్నట్లు తెలుస్తోంది. బ్లూమ్స్ బర్గ్ ఎకనామిక్ ఎనాలిసిస్ ప్రకారం భారతదేశ జనాభాలో 49 శాతం మహిళలు ఉన్నా, జిడిపి లో వారి భాగస్వామ్యం కేవలం 17 శాతంగా ఉండటం గమనార్హం. ఇదే విషయంలో చైనాలో మహిళల భాగస్వామ్యం 40 శాతంగా వుంది.

కుటుంబ బాధ్యతలు, అవిద్య, సామాజిక కట్టుబాట్లు, బాల్య వివాహాలు వంటివి మహిళలకు శాపంగా మారాయి. దీంతో శ్రామిక శక్తిలో వారు తక్కువగా ఉంటున్నారు. నేటికీ చదువుకున్న అమ్మాయిల్లో 55-60 శాతం మంది మాత్రమే ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారు. ఉద్యోగాలు చేస్తున్నారు. అమ్మాయిల్లో దాదాపు 43 శాతం మంది మ్యాథ్స్, సైన్స్, ఇంజనీరింగ్ వంటివి చదువుతున్నారు. వీరిలో కూడా కేవలం 14 శాతం అమ్మాయిలు ఉద్యోగాలు చేస్తున్నారు.

సింగపూర్, థాయ్‌లాండ్, చైనా వంటి దేశాల్లో మహిళలు ఎక్కువగా ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో నిమగ్నమయ్యారు. హ్యూమన్ క్యాపిటల్ లో భారత మహిళల పాత్ర చాలా తక్కువ ఉన్నట్లు తెలుస్తోంది. కేవలం 3.8 శాతం. ఆటోమేషన్ వల్ల కూడా ఉద్యోగ అవకాశాలు ఉండటం లేదు. నైపుణ్యాల కొరత కారణంగా కూడా మహిళలు పనికి దూరమవుతున్నారు.

భవిష్యత్తులో భారత్ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చేరాలన్నా శ్రమశక్తిలో మహిళల భాగస్వామ్యం పెరగాలి. మహిళలు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకుని పురోభివృద్ధి సాధించాలి.

ప్రభుత్వాలు పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలి. వేతనాలు, సౌకర్యాలు సముచితంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలి. మహిళలు సాధ్యమైనంత వేగంగా తమ తమ నైపుణ్యాలను మెరుగు పరచుకుంటూ, దేశ అభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలి.

- ఐ.ప్రసాదరావు,
సెల్ : 9948272919



"మహిళలు నేటికీ ఎక్కువగా వ్యవసాయ రంగంలోనే ఉపాధి పొందుతున్నారు. ఇతర రంగాలలో ఎక్కువ ఉపాధి అవకాశాలు లభించటం లేదు. 90 శాతం మహిళలు అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. లింగ వివక్షత, అరకొర వేతనాలు, కొరవడిన సామాజిక రక్షణ, ఉద్యోగాల లేమి మహిళలను ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి."

సందర్భం

అవగాహన తోనే నివారణ

మానవ జాతిని భయపెడుతున్న ప్రాణాంతక వ్యాధుల్లో ఎయిడ్స్ ఒకటి. మన సమాజంలో హెచ్‌ఐవి గురించి ఎన్నో అపోహలు ఉన్నాయి. వాటిని తొలగిస్తూ వ్యాధి గురించి అందరికీ పూర్తి అవగాహన కల్పించి, నివారించే ఉద్దేశంతోనే ఐక్యరాజ్య సమితి డిసెంబర్ 1ని 'ప్రపంచ ఎయిడ్స్ దినం'గా ప్రకటించింది.

ప్రపంచ వ్యాప్త గణాంకాలు

2021లో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 3.84 కోట్ల మంది ప్రజలు హెచ్‌ఐవి తో జీవిస్తున్నారు. వీరిలో దాదాపు 3.67 కోట్ల మంది పెద్దలు (15 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు గలవారు), దాదాపు 17 లక్షల మంది పిల్లలు (0-14 సంవత్సరాలు) ఉన్నారు. హెచ్‌ఐవి తో జీవిస్తున్న వారిలో 54 శాతం మహిళలు, బాలికలు.

హెచ్‌ఐవి సోకిన వారిలో 85 శాతం మందికి వారి పరిస్థితి తెలుసు. అంటే 15 శాతం మందికి హెచ్‌ఐవి పరీక్ష జరగలేదు. గతేడాది దాదాపు 15 లక్షల మంది కొత్తగా హెచ్‌ఐవి బారిన పడ్డారు. దాదాపు 6,50,000 మంది ఎయిడ్స్ సంబంధిత వ్యాధులతో మరణించారు.

2010 నుండి 2021 వరకు హెచ్‌ఐవి కొత్త ఇన్ఫెక్షన్లు దాదాపు 32 శాతం తగ్గాయి. పిల్లలలో హెచ్‌ఐవి కొత్త సంక్రమణలు 52 శాతం తగ్గాయి.

మరణాలు కూడా 52 శాతం తగ్గాయి.

హెచ్‌ఐవి సంక్రమణ-ప్రమాదం

సూదుల ద్వారా మాదక ద్రవ్యాలు తీసుకునే వారిలో హెచ్‌ఐవి సంక్రమించే అవకాశం 35 రెట్లు ఎక్కువ.

వయోజన మహిళలలో కంటే మహిళా సెక్స్ వర్కర్లలో హెచ్‌ఐవి సంక్రమించే అవకాశం 30 రెట్లు ఎక్కువ.



వయోజన పురుషులలో కంటే స్వలింగ సంపర్కులైన పురుషులలో హెచ్‌ఐవి సంక్రమించే అవకాశం 28 రెట్లు ఎక్కువ.

వయోజన మహిళల కంటే ట్రాన్స్‌జెండర్ మహిళలకు హెచ్‌ఐవి సంక్రమించే అవకాశం 14 రెట్లు ఎక్కువ.

పురుషులతో పోలిస్తే స్త్రీలలో హెచ్‌ఐవి సంక్రమించే అవకాశం ఎక్కువ. శరీర నిర్మాణ పరంగా, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ కారణాల వలన హెచ్‌ఐవి సంక్రమణ రేటు స్త్రీలలో ఎక్కువగా ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి వారం దాదాపు 4,900 మంది (15-24 సంవత్సరాల) యువతులు హెచ్‌ఐవి బారిన పడుతున్నారు.

భారత దేశంలో హెచ్‌ఐవి గణాంకాలు

హెచ్‌ఐవి (పిఎల్‌హెచ్‌ఐవి)తో జీవిస్తున్న వారి సంఖ్య దాదాపు 24 లక్షలుగా అంచనా వేయబడింది.

ఈశాన్య ప్రాంత రాష్ట్రాలలో (మిజోరం, నాగాలాండ్, మణిపూర్) హెచ్‌ఐవి సోకిన వయోజనలు (15-49 సంవత్సరాల మధ్య వయస్కులు) అత్యధికంగా వున్నారు.

దక్షిణాది రాష్ట్రాలలో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

- తమటం నరసింహ స్వామి
డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ (రిటైర్డ్),
సెల్: 91771 03171

పంట పోయినా పట్టించుకోరా..?

- నకిలీ విత్తనాలతో పత్తి రైతులకు నష్టం
- అకిరా కంపెనీపై చర్యలు తీసుకోండి
- సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్



పగలకుండానే ఎండిపోయిన పత్తి విత్తనం

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

నకిలీ విత్తనాలతో పత్తి పంటను రైతులు పూర్తిగా నష్టపోయినా వ్యవసాయ అధికారులు పట్టించుకోలేని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ప్రశ్నించారు. బుధవారం మండల పరిధిలోని వీరన్నపల్లి, తిమ్మాపురం, దిగువపల్లి గ్రామాల్లో నాసిరకం పత్తి విత్తనాలతో పంట నష్టపోయిన పొలాలను ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. పంట సాగు నష్టం వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ తాడిపత్రి ప్రాంతంలో దాదాపు 15 నుంచి 16 వేల ఎకరాల్లో పత్తి పంటను రైతులు సాగు చేశారన్నారు. అకిరా అనే పత్తి విత్తనాల సంస్థ ద్వారా విత్తనాలు కొనుగోలు చేశారన్నారు. అయితే ఈ విత్తనాలు నాశిరకంగా ఉండడంతో పంట ఏమాత్రం దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇదే పరిస్థితి పామిడి మండలంలోనూ ఉందన్నారు. ఇంత పెద్దఎత్తున రైతులు పంటను నష్టపోయినా వ్యవసాయ అధికారులు స్పందించకపోవడం విచారకరం అన్నారు. రైతులు పంటనష్టం విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తే 'పంట నష్టపోతే ఇన్సూరెన్స్ వస్తుంది కదా' అంటూ వారు చెప్పే విద్దూరమైన మాటలు అత్యంత దారుణం అన్నారు. రైతులు ఇన్సూరెన్స్ కోసం పంటలు వేయలేరన్న విషయాన్ని అధికారులు గుర్తించాలన్నారు. పంట దిగుబడి వస్తే చేసిన అప్పులు తీరుతాయని ఆశతో సాగు చేస్తున్నారు. సాధారణంగా అతివృష్టి, అనావృష్టి వల్ల పంటలను నష్టపోతారని, అందుకు విరుద్ధంగా నకిలీ విత్తనాలతో తాడిపత్రి ప్రాంతంలో ఈ సారి నష్టం వాటిల్లిందన్నారు. వర్షాలు బాగా ఉన్న సమయంలో నాసిరకం విత్తనాలతో పంటను నష్టపోవడం అత్యంత బాధాకరమన్నారు. పంట నష్టాన్ని వ్యవసాయ అధికారులతో అంచనా వేయించి, నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలను సరఫరా చేసిన అకిరా సంస్థపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పత్తి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 5న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు రాజారాం రెడ్డి, సిపిఎం నాయకులు జగన్మోహన్ రెడ్డి, ఉమాగౌడ్, శ్రీరాములు, నాగరాజు తెరన్నపల్లి, తిమ్మాపురం, దిగువపల్లి రైతులు పాల్గొన్నారు.

ఇడి అధికారులకు సహకరించా

విచారణ అనంతరం విజయ్ దేవరకొండ



హైదరాబాద్: 'పాపులారిటీ వల్ల కూడా కొన్ని సమస్యలొస్తాయి. వాటిల్లో ఇదొకటి' అని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) విచారణ అనంతరం నటుడు విజయ్ దేవరకొండ అన్నారు. "మీరు చూపించే అభిమానం వల్ల ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతాయి. జీవితంలో ఇదొక అనుభవం. ఇడి అధికారులకు పూర్తిగా సహకరించా. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చా. నన్ను మళ్లీ రమ్మని చెప్పలేదు" అని విజయ్ తెలిపారు. తాను కథానాయకుడిగా తెరకెక్కిన 'లైగర్' సినిమా లావాదేవీల విషయంలో ఇడి అధికారులు ఇటీవల దర్శకుడు పూరీ జగన్నాథ్, నిర్మాత ఛార్మిని విచారించిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం విజయ్ దేవరకొండ ఇడి విచారణకు హాజరయ్యారు. దాదాపు 11గంటలపాటు ఈడీ అధికారులు విజయ్‌పై పలు కోణాల్లో ప్రశ్నలు సంధించారు. దుబాయికి డబ్బులు పంపించి, అక్కడి నుంచి తిరిగి సినిమాలో పెట్టుబడులు పెట్టినట్టు ఇడి అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ వ్యవహారంలో ఓ రాజకీయ నేత ప్రమేయం కూడా ఉన్నట్లు ఇడి అనుమానిస్తోంది. ఈ క్రమంలోనే 'లైగర్'లో భాగస్వాములైన వారిని అధికారులు విచారిస్తున్నారు.

సర్వర్ పని చేయక అభ్యర్థుల ఆందోళన

న్యూఢిల్లీ: కేంద్ర సాయుధ బలగాల్లో 24,369కానిస్టేబుల్/రైఫిల్‌మ్యాన్/సిపాయి పోస్టుల భర్తీ కోసం స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఇటీవల భారీ నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే, ఈ ఉద్యోగాలకు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయంటూ పలువురు అభ్యర్థులు వాపోతున్నారు. దరఖాస్తు సమర్పణకు బుధవారమే ఆఖరు గడువు కావడంతో సర్వర్ పనిచేయడంలేదంటూ తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అందువల్ల దరఖాస్తు చేసుకొనేందుకు గడువును పెంచాలని అధికారులను కోరుతూ ట్విటర్‌లో పోస్టులు పెడుతున్నారు. దాదాపు వారం రోజులుగా వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసేందుకు ప్రయత్నిస్తున్నా కావడంలేదంటూ కొందరు పేర్కొంటుండగా.. మూడు నాలుగు రోజుల నుంచి సర్వర్ మొరాయిస్తోందంటూ మరికొందరు చెబుతున్నారు. 'ఎస్ఎస్‌సీ జీడీ పోస్టులకు దరఖాస్తు చేసుకొనేందుకు వెబ్‌సైట్ గత ఏడు రోజులుగా పనిచేయడంలేదు. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకొనేందుకు గడువు పెంచండి' అని కోరుతూ లఖన్ సింగ్ సోలంకి అనే వ్యక్తి తనకు ఎదురైన సాంకేతిక లోపాన్ని స్క్రీన్‌షాట్ తీసి ట్విటర్‌లో పోస్ట్ చేశారు. అలాగే, "దరఖాస్తు సబ్‌మిట్ చేసేందుకు రెండు రోజులుగా ప్రయత్నిస్తున్నా.. అవ్వట్లేదు' అంటూ సుజీత్ కుమార్ అనే వ్యక్తి వాపోయారు. గత ఐదు రోజులుగా ఈ వెబ్‌సైట్ సరిగా పనిచేయడంలేదని వికాశ్ మిశ్రా అనే వ్యక్తి పేర్కొన్నారు. ఇది అనేకమంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అంశం కావడంతో రిజిస్ట్రేషన్ల గడువును పొడిగించాలని కోరారు. ఇలా అనేక మంది ట్వీట్లు చేస్తూ తమ ఆవేదన తెలుపుతున్నారు.

నేటి నుంచి డాక్టర్లకు డ్రెస్ కోడ్

- **మహిళా వైద్యులు, సిబ్బంది, విద్యార్థులకు చీర, చుడీదార్**
- **వైద్య విద్యార్థులు జీన్స్, టీ షర్ట్ ధరించకూడదు**

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బోధనాస్పత్రుల్లో సిబ్బంది వస్త్రధారణతో నియమ, నిబంధనలు విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా మహిళా వైద్యులు, వైద్య విద్యార్థినులు తప్పనిసరిగా చీర గానీ చుడీదార్ గానీ ధరించాలని, జుట్టు వదులుగా వదిలేయకుండా ముడి వేసుకోవాలని, విధి నిర్వహణలో యాప్రాన్‌ను ధరించడంతో పాటు మెడలో స్టెతస్కోప్ తప్పనిసరిగా ఉండాలని నిర్దేశించింది. ఇక వైద్యులు, సిబ్బంది రోజులో మూడుసార్లు కచ్చితంగా ముఖ హాజరు నమోదు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు సర్క్యులర్లు జారీ చేశారు.

బోధనాస్పత్రుల్లో పనిచేసే వైద్య సిబ్బంది ఇకపై తమకు నచ్చిన వస్త్రాలను ధరించి విధులకు హాజరు కాకూడదని బోధనాస్పత్రుల సూపరింటెండెంట్లు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీనికి అనుగుణంగా జిల్లా కేంద్రంలోని సర్వజనాస్పత్రితో పాటు మిగిలిన ఆస్పత్రుల సూపరింటెండెంట్లు వైద్యుల డ్రెస్ కోడ్, ముఖ హాజరుకు సంబంధించి నిబంధనలపై సర్క్యులర్‌ను జారీ చేశారు. వైద్యులు, సిబ్బంది విధి నిర్వహణలో తప్పనిసరిగా చక్కని వస్త్రధారణతో ఉండాలని, ప్రధానంగా యాప్రాన్ వేసుకోవడంతో పాటు మెడలో తప్పనిసరిగా స్టెతస్కోప్ ధరించాల్సి ఉంటుంది. వైద్య విద్యార్థులు విధులకు హాజరయ్యే సమయంలో సాధారణ వస్త్రధారణతో పాటు బూట్లు వేసుకోవాలి. జుట్టు, గెడ్డం చక్కగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. మహిళా వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థినులు తప్పనిసరిగా చీరలు, చుడీదార్లతో విధులకు హాజరు కావాలి. జట్టును హెయిర్ బాండ్‌తో ముడి వేసుకోవాలి. జీన్స్, టీ షర్ట్ వేసుకోకూడదని ఆదేశాల్లో పేర్కొన్నారు.

రోజూ మూడుసార్లు ముఖ హాజరు

వైద్యారోగ్యశాఖలోనూ ముఖ హాజరు విధానాన్ని ఈనెల ఒకటో తేదీ నుంచి అమలు చేయనున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. బోధనాస్పత్రుల్లో పనిచేసే సిబ్బంది తప్పనిసరిగా హెల్త్ ఫేషియల్ రికగ్నైషన్ సిస్టమ్ (ముఖ హాజరు)కు సంబంధించి ఎన్‌రోల్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. ఉద్యోగులు ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం తప్పనిసరిగా ముఖ హాజరు వేయాలి. ఉన్నతాధికారులు ఆదేశాలకు అనుగుణంగా ఎన్‌రోల్ కాని వైద్యులు, వైద్య సిబ్బందిపై డిఎంఇ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తప్పవని సూపరింటెండెంట్లు సర్క్యులర్లు జారీ చేశారు.

అలసత్వం వద్దు

ఆస్పత్రుల్లో రోగులను చేర్చుకునే విషయంలో అలసత్వాన్ని ప్రదర్శించరాదని తాజా ఆదేశాల్లో స్పష్టం చేశారు. రోగుల సహాయకులు ఉన్నా, లేకపోయినా రోగిని సకాలంలో ఆస్పత్రిలో చేర్చుకోవాలని ఆ ఉత్తర్వుల్లో సూచించారు. ప్రతి విభాగంలో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం అమలుకు సంబంధించిన కచ్చితమైన పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి వారం యూనిట్ల వారీగా ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించిన సమీక్షను డిఎంఇ నిర్వహించనున్నారు. తాజా నిబంధనలపై వైద్యులు, సిబ్బంది పెదవి విరుస్తున్నారు. విధి నిర్వహణలో అలసత్వంగా ఉన్న వారిపై చర్యలు తీసుకున్నా పర్వాలేదని, ఏ బట్టలు వేసుకోవాలి, ఎటువంటి బూట్లు వేసుకోవాలి, జడ ఎలా వేసుకోవాలో ఆదేశించడం దారుణమంటున్నారు.

న్యాయమూర్తుల సంఖ్య పెంచడం పరిష్కారం కాదు : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : పెండింగ్ కేసుల విచారణ కోసం న్యాయమూర్తుల సంఖ్యను పెంచడం పరిష్కారం కాదని సుప్రీంకోర్టు బుధవారం వ్యాఖ్యానించింది. ఇటువంటి ప్రజావాద, సరళమైన చర్యలు పరిష్కారం కావని స్పష్టం చేసింది. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించేందుకు సబార్డినేట్ జ్యుడీషియరీ, హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను రెట్టింపు చేయాలని కేంద్రం, అన్ని రాష్ట్రాలను ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఎక్కువ మంది న్యాయమూర్తులను చేర్చుకోవడం సమాధానం కాదని, సమర్థవంతమైన వారు ఉండటం అవసరమని జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ పి.ఎస్. నరసింహలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. అలహాబాద్‌లో 160 మంది న్యాయమూర్తులను నియమించడమే కష్టంగా ఉండగా.. మీరు రెట్టింపు అంటే 320 మందిని కోరుతున్నారని ధర్మాసనం పేర్కొంది.

చంద్రబాబుకు ప్రజాప్రయోజనాలు పట్టవు : అంబటి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడుకు అధికారకాంక్ష తప్ప ప్రజాప్రయోజనాలు పట్టవని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. బుధవారం తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అధికారంలో వున్న 14 ఏళ్లలో ప్రజల కోసం ఏమిచేశారో చెప్పాలన్నారు. ఇచ్చిన హామీలను విస్మరించి అన్నివర్గాల ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఇదేమీ ఖర్మ పేరుతో వెళుతున్న తెలుగుదేశానికే ఆ మాట సరిపోతుందని అన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య ఎవరి హయాంలో జరిగిందో తెలుసుకోవాలని అన్నారు. వివేకానందరెడ్డి హత్యపై తప్పుడు ప్రచారం చేసి, రాజకీయ లబ్ధిపొందాలని చూడటం దురదృష్టకరమని అన్నారు. వాస్తవాలన్నీ విచారణలో బయటకు వస్తాయన్నారు.

త్వరలో బందరు పోర్టు పనులు

- రోడ్డు, రైల్ కలెక్టివిటీకి భూ సేకరణ : ఎమ్మెల్యే పేర్ని నాని

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

కృష్ణాజిల్లా ప్రజల చిరకాల వాంఛ త్వరలో నెరవేరనుందని మాజీమంత్రి, బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. 2023 జనవరి నెలాఖరు లేదా ఫిబ్రవరి మొదటివారంలో ముఖ్యమంత్రి బందరుపోర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మచిలీపట్నంలోని ఆర్అండ్బి అతిథి గృహంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ న్యాయపరమైన చిక్కులవల్ల పోర్టు నిర్మాణం ఆలస్యమైందని, ఇప్పుడు అన్ని అడ్డంకులూ తొలగిపోయాయని చెప్పారు. రెండు మూడు వారాల్లో కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులు వచ్చే అవకాశం ఉందన్నారు. పనులు మొదలైన 30 నెలల్లో పోర్టు నిర్మాణం పూర్తి చేయాలని ఎపి మారిటైం బోర్డు కాంట్రాక్టు సంస్థ మెగా ఇంజినీరింగ్ కంపెనీకి గడువు విధించిందని తెలిపారు. మొదటి దశలో సముద్రతీర ప్రాంతంలోని 1730 ఎకరాల ప్రభుత్వ భూమిలో రూ.5,253.88 కోట్ల అంచనాలతో నాలుగు బెర్తులు నిర్మించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వమే ఇపిసి పద్ధతిలో నిర్మిస్తున్న ఈ పోర్టుకు పవర్ఫైనాన్స్ కార్పొరేషన్ రూ.3,942 కోట్ల రుణం మంజూరుకు అంగీకరించిందని చెప్పారు. మిగిలిన 25 శాతం నిధులు ప్రభుత్వం మంజూరు చేయనుందని తెలిపారు. తర్వలో రోడ్డు, రైల్వే లైను కనెక్టివిటీకి అవసరమైన 235 ఎకరాల భూ సేకరకణను పూర్తి చేస్తామన్నారు. బందరులో నిర్మిస్తున్న మెడికల్ కళాశాలలో 2023 సెప్టెంబర్ నుంచి అడ్మిషన్లు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ సమావేశంలో మచిలీపట్నం మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ తంటిపూడి కవిత థామస్ నోబుల్, ముడా చైర్మన్ బొర్రా నాగ దుర్గా భవాని విఠల్ పాల్గొన్నారు.

కాఫీ రైతుకు 'ప్రోత్సాహం' ఏదీ?

- రూ.60.32 కోట్ల బకాయిలు చెల్లించని ప్రభుత్వం

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి



కాఫీ పండ్లు ఏరుతున్న గిరి మహిళలు (ఫైల్ ఫొటో)

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఏజెన్సీలో పండిస్తోన్న కాఫీకి అంతర్జాతీయ ఖ్యాతి లభించినా, ఈ పంటను పండిస్తోన్న గిరిజన రైతులకు మాత్రం అవస్థలు తప్పడం లేదు. కాఫీ గొప్పతనాన్ని ప్రభుత్వ చెప్పుకోవడమేగానీ, గిరిజన కాఫీ రైతులకు ప్రోత్సాహక బకాయిలు నాలుగేళ్లగా ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డవలప్మెంట్ అథారిటీ (ఐటిడిఎ) చెల్లించడం లేదు. గోతులు తీయడం, మొక్కలు నాటడం తదితర పనులకు పంట చేతికొచ్చే నాలుగో ఏడాది వరకూ ఎకరాకు గిరిజన కాఫీ రైతులకు రూ.25 వేల నుంచి రూ.32 వేల వరకు ఐటిడిఎ ద్వారా సాయం అందేది. గత నాలుగేళ్ల నుంచి ఈ సాయం అందడం లేదు. పాడేరు ఏజెన్సీలోని అనంతగిరి, అరకు, పాడేరు, హుకుంపేట, డుంబ్రిగుడ, పెదబయలు, ముంచంగిపుట్టు, జి.మాడుగుల, కొయ్యూరు, చింతపల్లి, జికె.వీధి మండలాల్లో 2018-19లో 8,891 మంది రైతులు పది వేల ఎకరాల్లో కాఫీ పంట సాగు చేశారు. 2019-20లో 9,174 మంది రైతులు పది వేల ఎకరాల్లో, 2020-21లో 11,343 మంది రైతులు 12 వేల ఎకరాల్లో, 2021-22లో 13,839 మంది రైతులు 15 వేల ఎకరాల్లో కాఫీ సాగు చేస్తూ వచ్చారు. ఈ 11 మండలాల్లో 2018 నుంచి 2022 వరకు 5,200 ఎకరాల్లో కాఫీ సాగుకు సంబంధించి 43,247 మంది గిరిజన రైతులకు ప్రోత్సాహకం కింద చెల్లించాల్సిన రూ.60.32 కోట్లు ఐటిడిఎ నాలుగేళ్లుగా బకాయి ఉంది.

'ఉపాధి' చట్టం వర్తింపును నిలుపుదల చేసిన కేంద్రం

ఏజెన్సీలో కాఫీ సాగును ప్రోత్సహించేందుకు 2015-16లో ఉపాధి చట్టం నిధులు అనుసంధానం చేశారు. దీనిని 2020 నుంచి కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. ఏజెన్సీలో రెండు లక్షల ఎకరాల్లో 1.80 లక్షల మంది గిరిజన రైతులు రూ.250 కోట్లకుపైగా విలువైన కాఫీ పంట పండిస్తున్నారు. ప్రోత్సాహక బకాయిల చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం లేదు. కాఫీ సాగుకు ఉపాధి నిధులు వర్తింపజేయాలని కేంద్రంపై ఒత్తిడి చేయడం లేదు. ఏజెన్సీ పర్యటనకు వచ్చిన జాతీయ స్థాయి బృందం దృష్టికి డ్వామా అధికారులు ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఉపాధి నిధులు పునరుద్ధరించే ప్రయత్నం చేస్తామని బృందం హామీ ఇచ్చినా కేంద్రం అందుకు అంగీకరించలేదు. దీంతో, ప్రోత్సాహకాలు అందకపోవడం, ఉపాధి చట్టం నిధులు ఆగిపోవడంతో రైతులకు పెట్టుబడి ఖర్చు అమాంతం పెరిగిపోయింది. మరోవైపు సరైన ధర లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కాఫీ సాగు ఆశించిన స్థాయిలో పెరగడం లేదు.

బకాయిలు తక్షణమే చెల్లించాలి



కాఫీ రైతులకు ప్రోత్సాహక బకాయిలు వెంటనే చెల్లించాలి. ఉపాధి హామీ చట్టం పరిధిలోకి కాఫీ పంటను తీసుకొచ్చి గిరిజన రైతులను ఆదుకోవాలి. పాత కాఫీ తోటల అభివృద్ధికి ఎకరాకు రూ.50 వేలు ప్రోత్సాహక నిధులు మంజూరు చేయాలి. కాఫీ, మిరియాల రైతులకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేయాలి.


-గెమ్మిలి చిన్నబాబు, గిరిజన కాఫీ రైతు సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా కన్వీనర్

ముందు పర్యావరణం.. తరువాతే నష్టపరిహారం : జెసి

- ఆగ్రహించి వెనుదిరిగిన నిర్వాసిత రైతులు

ప్రజాశక్తి-కనిగిరి (ప్రకాశం జిల్లా)

అధికారుల నుంచి ఆశించిన సమాధానం రాకపోవడంతో గ్రీన్ఫీల్డ్ ఎక్స్ప్రెస్ హైవే నిర్వాసిత రైతులు అగ్రహం వ్యక్తం చేశారు. నష్టపరిహారంపై స్పష్టత ఇవ్వకుండా కేవలం పర్యావరణంపై రైతుల అభిప్రాయాలు సేకరిస్తున్నామని అధికారులు తెలపడంతో సభ ప్రారంభం కాకముందే ఎక్కువ మంది వెనుదిరిగారు. ప్రకాశం జిల్లా కనిగిరి పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం సమీపంలో బుధవారం ఉదయం పది గంటలకు ప్రజాభిప్రాయ సేకరణ సభ ప్రారంభమవుతుందని అధికారులు ప్రకటించారు. ఈ సమయానికి రైతులు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సభకు ఆలస్యంగా రావడంతో అధికారులు సాయంత్రం నాలుగు గంటల వరకు సభను ప్రారంభించలేదు. దీనికి తోడు మంచినీరు, భోజన వసతి కల్పించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హైవే నిర్మాణంలో తాము కోల్పోతున్న భూములకు ఎంత నష్టపరిహారం ఇస్తారని జెసిని రైతులు అడిగారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణ సభ కేవలం పర్యావరణానికి ఏదైనా ఇబ్బంది ఉంటుందా? అనే దానిపై మాత్రమేనని నష్టపరిహారం ఎంత వస్తుందనే అంశం మీద కాదని దానికి మరో సమావేశం ఉంటుందని జెసి తెలిపారు. దీంతో రైతులు నిరాశ చెంది అక్కడి నుంచి వెళ్లిపోతుండగా రెవెన్యూ అధికారులు, పోలీసులు సర్దిచెప్పి ఆపేందుకు ప్రయత్నించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. అధికారులు అక్కడ ఉన్న అతికొద్ది మందితోనే తూతూమంత్రంగా అభిప్రాయసేకరణ చేసి.. మొక్కుబడిగా ముగించారు.



బ్రోచర్ను ఆవిష్కరిస్తున్న ఎస్డబ్ల్యుఎఫ్ నేతలు

నెల్లూరులో ఆర్టిసి ఎస్డబ్ల్యుఎఫ్ రాష్ట్ర మహాసభ

- బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు

ఎపిఎస్ ఆర్టిసి ఎస్డబ్ల్యుఎఫ్ 12వ రాష్ట్ర మహాసభను డిసెంబరు 15, 16, 17 తేదీల్లో నెల్లూరులో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ కట్టా సుబ్రహ్మణ్యం తెలిపారు. ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై పోరాటం చేసేందుకు, భవిష్యత్తు కర్తవ్యాలను నిర్దేశించేందుకు మహాసభ దోహదపడుతుందని పేర్కొన్నారు. నెల్లూరు ఆర్టిసి బస్టాండ్ ఆవరణలోని ఎస్డబ్ల్యుఎఫ్ కార్యాలయంలో మహాసభ బ్రోచర్ను ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత 44 ఏళ్లుగా సంస్థ పరిరక్షణ కోసం, కార్మికుల, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం, ప్రయాణికుల పరిరక్షణ కోసం ఎస్డబ్ల్యూఎఫ్ అనేక పోరాటాలు చేస్తోందని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి నెల్లూరులో జరగనున్న రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ సెక్రటరీ ఎస్కె ఖాజావలీ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.రాజశేఖర్, ఎ.కృష్ణయ్య, జిల్లా జాయింట్ సెక్రటరీ వి.కష్ణారావు, కార్మికులు పాల్గొన్నారు.



కర్నూలు కలెక్టరేట్ ఎదుట డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న నిరుద్యోగులు

పోలీసు ఉద్యోగాలకు వయోపరిమితి పెంచాలి

- కర్నూలు కలెక్టరేట్ ఎదుట నిరుద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎస్ఐ, కానిస్టేబుల్ అర్హత ఎంపికలో వయోపరిమితితోపాటు పరీక్ష ఫీజు గడువు పెంచాలని డిమాండ్ చేస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగులు బుధవారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. తొలుత జిల్లా పరిషత్ నుండి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ మాట్లాడుతూ ప్రతి ఏడాది 6700 ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఎన్నికల సందర్భంగా వైఎస్.జగన్మోహన్రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీ మేరకు మూడు సంవత్సరాలకు 20 వేలకుపైగా పోస్టులు భర్తీ చేయాల్సి ఉందని తెలిపారు. ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల సంఖ్యను 6,500 నుండి 21 వేలకు పెంచాలని కోరారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి అభ్యర్థుల వయోపరిమితిని, ఉద్యోగాల సంఖ్యను, పరీక్ష సమయాన్ని కనీసం మూడు నెలలకు పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరుద్యోగులను సమీకరించి ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాడుతామని హెచ్చరించారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర అధ్యక్షత జరిగిన ధర్నాలో నగర కార్యదర్శి హుస్సేన్ బాషా, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, నిరుద్యోగ సంఘం నాయకులు వెంకటేష్ నాయక్, శివ, శ్రీరాములు పాల్గొన్నారు.

హిందూపురం ఆసుపత్రిలో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి-హిందూపురం



గర్భిణీతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

చిన్నారులు, గర్భిణులకు రాష్ట్ర ప్రభుత్వ అందిస్తోన్న పౌష్టికాహారం తదితర విషయాలను పరిశీలించేందుకు సత్యసాయి జిల్లా హిందూపురం జిల్లా ఆస్పత్రిలో కేంద్ర బృందం పర్యటించింది. జిల్లా ఉపవైద్యాధికారి మంజువాణి, పిపి యూనిట్ వైద్యులు డాక్టర్ ఆనంద్బాబును అడిగి వివరాలు తెలుసుకుంది. బృందంలో డాక్టర్ భానుమూర్తి, డాక్టర్ పూర్ణిమా, మాలవిక ఉన్నారు. అనంతరం పట్టణంలోని ఎంజిఎం పాఠశాలతో పాటు పలు అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. రక్తహీనతతో బాధపడే వారిని కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని వాణివిలాస్ అసుపత్రికి తరలించి, మెరుగైన చికిత్స అందించాలని స్థానిక వైద్యులకు సూచించారు. అధిక శాతం అమ్మాయిలు రక్తహీనతతో బాధపడుతుంటారని, అలాంటి వారిని గుర్తించి, అవసరమైతే రక్తం ఎక్కించేందుకు ప్రయత్నం చేయాలన్నారు. రక్తహీనతను తగ్గించడానికి స్థానిక వైద్యులు, రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసుపత్రి ఆర్ఎంఒ రుక్మిణమ్మ, వైద్యులు పాల్గొన్నారు.

సామాజిక స్పృహ కలిగిన గొప్ప వ్యక్తి వెంకట నరసమ్మ

- సంస్మరణ సభలో సిపిఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.మధు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్



సంస్మరణ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.మధు

విద్యావేత్త, అభ్యుదయవాది వేములపల్లి వెంకట నరసమ్మ గొప్ప సామాజిక స్పృహ కలిగిన వ్యక్తని సిపిఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.మధు అన్నారు. సీనియర్ పాత్రికేయులు, వామపక్ష శ్రేయోభిలాషి వాసిరెడ్డి సత్యనారాయణ సతీమణి వెంకట నరసమ్మ సంస్మరణ సభ విజయవాడ గురునానక్నగర్లోని స్వర్ణా కన్వెన్షన్లో బుధవారం జరిగింది. తొలుత వెంకట నరసమ్మ కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మధు మాట్లాడుతూ వెంకట నరసమ్మ అధ్యాపకురాలిగా ఎంతో మందికి ఉన్నత విద్యనందించారని అన్నారు. సమాజ హితం కోసం, దేశం కోసం ఎంతగానో పరితపించారని కొనియాడారు.

మంచి విలువలకు కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. అటువంటి గొప్ప వ్యక్తి మనమధ్య లేకపోవడం బాధాకరమన్నారు. వెంకటనరసమ్మ ఆశయాలను, విలువలను కాపాడతామని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ నిజమైన దేశభక్తురాలు వెంకట నరసమ్మ అన్నారు. ఆమె ఆకస్మిక మరణం తీరనిలోటన్నారు. భర్త వాసిరెడ్డి సత్యనారాయణకు సహకరిస్తూ వామపక్ష ఉద్యమానికి ఎంతగానో తోడ్పాటునందించారని గుర్తుచేశారు. పలు కార్యక్రమాల్లో కూడా ప్రత్యక్షంగా పాల్గొన్నారని తెలిపారు. సమాజానికి ఉపయోగపడేవిధంగా చక్కని రచనలు చేశారన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రసాదరావు మాట్లాడుతూ సమాజానికి, వామపక్ష ఉద్యమానికి చివరి వరకు సహకారం అందించారని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు జయరామ్, రాష్ట్ర నాయకులు దోనేపూడి కాశీనాథ్, ఎన్టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ, నగర ప్రముఖులు చుక్కపల్లి తిరుమలరావు, డాక్టర్ కొల్లా రాజమోహన్, ప్రజాశక్తి సంపాదకులు బి.తులసీదాస్, సిజిఎం వై.అచ్యుతరావు తదితరులు వెంకట నరసమ్మకు నివాళులర్పించారు. వెంకట నరసమ్మ సోదరులు విద్యాసాగర్, కోటేశ్వరరావు, కుమారులు రాహుల్, ప్రేమ్సాగర్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

తిరుపతిలోనే శ్రీవాణి దర్శన టికెట్లు

- 'మాధవం'లో కౌంటర్ను ప్రారంభించిన జెఇఒ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

శ్రీవాణి ట్రస్టుఆఫ్ లైన్ టికెట్లను ఇక నుంచి తిరుపతిలోనే మంజూరు చేయనున్నారు. ఇందుకోసం మాధవం అతిథి గృహంలో ఏర్పాటు చేసిన కౌంటర్లను తిరుమల తిరుపతి దేవస్థానం జెఇఒ వీరబ్రహ్మం బుధవారం ప్రారంభించారు. గుంటూరుకు చెందిన లక్ష్మిహరీష్, రూప సింధుకు తొలి టికెట్టును ఆయన అందజేశారు. అనంతరం మీడియాతో జెఇఒ మాట్లాడారు. శ్రీవాణి ట్రస్టుకు రూ. పది వేలు విరాళం ఇచ్చి రూ.500 టికెట్లు తీసుకునే భక్తులకు ఇప్పటి దాకా తిరుమలలో ఆఫ్ లైన్ టికెట్లు జారీ చేసేవారమని తెలిపారు. దాతలు ముందురోజు తిరుమలకు వెళ్లి అవసరమైన పత్రాలు సమర్పించి టికెట్ తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఈ ప్రక్రియలో దాతలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను టిటిడి గుర్తించిందని తెలిపారు. తిరుపతిలోనే శ్రీవాణి ఆఫ్లైన్ టికెట్లు జారీ చేసి వారికి ఇక్కడే వసతి గదులు కేటాయించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. శ్రీవాణి ట్రస్టుకు విరాళం ఇచ్చే భక్తులు తిరుపతిలోని మాధవం అతిథిగృహంలో ఏర్పాటు చేసిన కౌంటర్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కౌంటర్ల నిర్వహణకు ముందుకొచ్చిన యూనియన్ బ్యాంకు యాజమాన్యానికి జెఇఒ కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవాణి ట్రస్టు ద్వారా వచ్చే విరాళాలతో పురాతన ఆలయాల అభివృద్ధి, జీర్ణోద్ధరణ, నూతన ఆలయాలు, భజన మందిరాలు నిర్మిస్తున్నామని చెప్పారు. టిటిడి చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ రాం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్డిటివి డైరెక్టర్లుగా వైదొలిగిన ప్రణయ్, రాధిక రాయ్



న్యూఢిల్లీ : దేశంలో ప్రత్యామ్నాయ మీడియా సంస్థగా ఎదిగిన ఎన్డిటివి నుంచి ఆ సంస్థ వ్యవస్థాపకులు, ప్రమోటర్లు అయినా ప్రణయ్ రాయ్, రాధిక రాయ్లు డైరెక్టర్ల హోదా నుంచి తప్పుకున్నారు. కేంద్ర ప్రభుత్వంపై విమర్శనాత్మక కథనాలు అందిస్తున్న ఈ ఛానల్లో ఇటీవల గౌతం అదానీ మెజారిటీ వాటాలను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో ఎన్డిటివి ప్రమోటర్ అయిన ప్రణయ్ రాయ్ దంపతులు ఛానల్ డైరెక్టర్ పదవికి బుధవారం రాజీనామా చేశారు. అయినప్పటికీ ఆ ఛానల్లో వారిద్దరికి 32.26 శాతం వాటాలున్నాయి. అదానీ 55.18 శాతం వాటాలతో యాజమాన్య హక్కులను కలిగి ఉన్నారు. కొత్తగా సుదీప్త భట్టాచార్య, సంజయ్ పుగాలియా, సెంథిల్ సిన్నియ చెంగల్వరాయన్లను నూతన డైరెక్టర్లుగా అదానీ నియమించారు. ప్రణయ్ రాయ్ దంపతులు తప్పుకోగానే.. తెలంగాణ ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ ఎన్డిటివి ట్విట్టర్ ఖాతాను అన్ఫాలో చేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటివరకు ఎన్డిటివి నిష్పాక్షిక సమాచారాన్ని ఇచ్చి బాగా పనిచేసిందని కెటిఆర్ ప్రశంసించారు. ఇకపై ఆ చానెల్ బిజెపికి అనుకూలంగా మారనుందనే భావనను వ్యక్తం చేశారు.

మూడేళ్లు పూర్తయిన ఉపాధ్యాయులందరికీ ఓటు

- సిఇసికి వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సర్వీస్లో చేరి మూడేళ్లు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులందరినీ ఓటర్లుగా నమోదు చేయాలని రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గం అభ్యర్థి బి. మదన్ మోహన్ రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన కేంద్ర ఎన్నికల సంఘానికి వినతిపత్రం అందజేశారు. ఒక ప్రాంతంలో రెండేళ్లు పూర్తి చేసుకొని, బదిలీపై వేరొక ప్రాంతానికి వెళ్లి అక్కడ ఏడాది పూర్తి చేసి, మొత్తం మూడేళ్లు పూర్తి చేస్తే దాన్ని పరిగణలోకి తీసుకోవటం లేదని పేర్కొన్నారు.

విద్యాదీవెనలో ఐదులక్షల మందికి కోత

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైఎస్ జగన్ ప్రభుత్వం విద్యాదీవెన పథకంలో ఐదులక్షల మంది విద్యార్థులకు కోత విధించిందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు విమర్శించారు. టిడిపి ప్రభుత్వం 16 లక్షల మందికి ఫీజు రీయంబర్స్మెంట్ అందిస్తే జగన్ ప్రభుత్వం 11 లక్షల మందికి గోరంత ఇచ్చి కొండంత ప్రచారం చేసుకుంటుందని తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఏటా మూడు విడతలు మాత్రమే విడుదల చేస్తూ నాలుగో విడత ఎగ్గొడుతున్నారని తెలిపారు. 2021-22 ఆర్థిక సంవత్సరం నాలుగో క్వార్టర్లో నగదు ఇప్పటికీ విడుదల చేయకపోవడంతో పరీక్షలు రాయనీయబోమని విద్యార్థులకు తాఖీదు ఇస్తున్నారని పేర్కొన్నారు. పత్రికా ప్రకటన పేరుతో జగన్ అవినీతి పుత్రిక సాక్షికి దోచిపెడుతున్నారని ఆరోపించారు. బిసి, ఎస్సి, ఎస్టి విద్యార్థుల సంఖ్యను తగ్గించి విద్యను దూరం చేస్తున్నారని విమర్శించారు. 2018-19లో టిడిపి ప్రభుత్వం 3,47,567 మంది ఎస్సి విద్యార్థులకు ఫీజు రీయంబర్స్మెంట్ చేస్తే 2021-22లో జగన్ ప్రభుత్వం 2,15,852 మంది విద్యార్థులకు తగ్గించిందని తెలిపారు. జివో 77 ద్వారా ప్రైవేట్, ఎయిడెడ్, అన్ఎయిడెడ్ కళాశాలల్లో చదివే పిజి విద్యార్థులకు విద్యాదీవెన నిలిపివేసి బడుగు బలహీనవర్గాలకు ఉన్నత చదువులను దూరం చేశారని విమర్శించారు.

ఎన్నికల విధులు మాత్రమే బోధనేతర పనులా ? : లోకేష్

ఉపాధ్యాయులకు ఎన్నికల విధులు మాత్రమే బోధనేతర పనులా అని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రశ్నించారు. ఎన్నికల విధులకు పనికిరాని ఉపాధ్యాయులు మద్యం షాపుల ముందు కాపలాకి, మరుగుదొడ్ల ఫొటోలు తియ్యడానికి, సిఎం టూర్ ఉంటే బస్సులకు కాపలా కాయడానికి పనికొస్తారా అని బుధవారం ఒక ప్రకటనలో నిలదీశారు. వచ్చే ఎన్నికల్లో వైసిపిని ఓడించడానికి పనిచేస్తారన్న భయంతోనే జగన్ ఉపాధ్యాయులను ఎన్నికల విధుల నుంచి తప్పించారని టిడిపి నేత ఎఎస్ రామకృష్ణ విమర్శించారు.

రోష్ ఫార్మా పేషెంట్ సపోర్ట్ యాప్ ఆవిష్కరణ

హైదరాబాద్ : రోష్ ఫార్మా ఇండియా కొత్తగా బ్లూ ట్రీ పేషెంట్ సపోర్ట్ ప్రోగ్రాంలో భాగమైన బ్లూ ట్రీ 2.0 మొబైల్ యాప్ను ఆవిష్కరించింది. ఈ మొబైల్ అప్లికేషన్, రోగులు వివిధ రకాల పేషెంట్ సపోర్ట్ సర్వీసులను పొందడాన్ని సులభతరం చేస్తుందని.. తద్వారా వారి చికిత్సలను సులభతరం చేస్తుందని ఆ కంపెనీ ఎండి, సిఇఒ వి సింప్సోన్ ఇమాన్యుల్ తెలిపారు. వైద్య సేవలతో పాటు రోగులు, వారి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించడానికి ఫండింగ్ సపోర్ట్, వడ్డీ లేని ఇఎమ్ఐలు, ఇతర సేవలను పొందవచ్చన్నారు.

సామ్సంగ్ 1000 మంది ఇంజనీర్ల నియామకం

న్యూఢిల్లీ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్సంగ్ భారత్లో అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానులైన 1000 మంది ఇంజనీర్లను నియమించుకోనున్నట్లు ప్రకటించింది. తమ బెంగళూరు, నోయిడా, ఢిల్లీలోని పరిశోధన, ఇన్స్టూట్లలో వీరి అవసరం ఉందని తెలిపింది. 2023లో కొత్త ఉద్యోగులను తీసుకోవడానికి ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించింది.

శరవేగంగా తిరుపతి స్టేషన్ ఆధునీకరణ పనులు : జిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి రైల్వే స్టేషన్లో రూ.300 కోట్లతో ఆధునీకరణ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్కుమార్ జైన్ తెలిపారు. నిర్మాణ పనుల పురోగతిపై బుధవారం ఆయన స్టేషన్ను సందర్శించి సమీక్షించారు. దక్షిణం వైపు నూతన ప్రవేశ మార్గం ఏర్పాటు, ప్రస్తుతం ఉన్న ఉత్తరం వైపు ప్రవేశ ద్వార ఆధునీకరణ పనులు చేపట్టడం వల్ల స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని అన్నారు. రాబోయే 40 ఏళ్లలో ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్టేషన్ను అత్యున్నతంగా ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులను న్యూఢిల్లీకి సంబంధించి మెస్సర్స్ వరింద్రా కన్స్ట్రక్షన్ లిమిటెడ్ కంపెనీకి ఈ ఏడాది మే 30న అప్పగించినట్లు చెప్పారు. 2025 ఫిబ్రవరి నాటికి పనులు పూర్తి చేయడమే లక్ష్యమన్నారు. నిర్ణీత గడువులో పనులు పూర్తయ్యేలా అన్ని స్థాయిల్లో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు.



విక్రమ్ కిర్లోస్కర్ హఠాన్మరణం

బెంగళూరు : టయోటా కిర్లోస్కర్ కంపెనీ వైస్ చైర్మన్ విక్రమ్ కిర్లోస్కర్ హఠాన్మరణం చెందారని ఆ కంపెనీ తెలిపింది. మంగళవారం రాత్రి ఆయన గుండెపోటుతో మరణించారని పేర్కొంది. 64 ఏళ్ల విక్రమ్కు భార్య గీతాంజలి కిర్లోస్కర్, కుమార్తె మనాసి కిర్లోస్కర్ ఉన్నారు. బుధవారం మధ్యాహ్నం బెంగళూరులో అంత్యక్రియలు పూర్తి చేశారు. ఆయన ఇప్పటివరకు కిర్లోస్కర్ సిస్టమ్స్కు ఎండి, చైర్మన్గా, టయోటా కిర్లోస్కర్ మోటార్కు వైస్ చైర్మన్గా వ్యవహరిస్తున్నారు.

'ఉక్కు' ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు గంధం వెంకటరావు, అయోధ్యరామ్, కారునాయుడు, సిహెచ్ సన్యాసిరావు పిలుపునిచ్చారు. స్టీల్ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారంనాటికి 657వ రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో స్టీల్ప్లాంట్ ఎంఎంఎస్ఎం, ఎస్టిఎం విభాగాల కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ ఉద్యమంలో ప్రజలందరినీ భాగస్వాములను చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.

ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమని తెలిపారు. 32 మంది ప్రాణ త్యాగంతో ఏర్పాటైన ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోడానికి ఎలాంటి త్యాగానికైనా సిద్ధమన్నారు. ప్రధాని మోడీ అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరు సాగిస్తామని స్పష్టం చేశారు. స్టీల్ప్లాంట్ను కాపాడుకుంటేనే భవిష్యత్తు ఉంటుందన్నారు. కర్మాగార పరి రక్షణకు ప్రతిఒక్కరూ ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. దీక్షల్లో కార్మిక నేతలు, కార్మికులు డి.దేముడు, జి.ఆనంద్, డి.రమేష్, ఆర్.ధనరాజు, జివి.రమణారావు, వైవి.సుబ్బారావు పాల్గొన్నారు.



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ

సిఎఎ వివక్షాపూరిత చట్టం

- సుప్రీంలో డిఎంకె అఫిడవిట్

న్యూఢిల్లీ : శ్రీలంక నుండి వచ్చిన తమిళ శరణార్థులకు వర్తించనందున పౌరసత్వ (సవరణ) చట్టం వివక్షాపూరితమైన చట్టమని డిఎంకె బుధవారం సుప్రీం కోర్టుకు తెలియజేసింది. రాజ్యాంగంలోని 14వ అధికరణ (సమానత్వ హక్కు), 21వ అధికరణ (జీవితం, స్వేచ్ఛలకు సంబంధించిన హక్కు)లను ఈ చట్టం ఉల్లంఘిస్తోందని ప్రకటించాలని కోరుతూ డిఎంకె నిర్వాహక కార్యదర్శి ఆర్.ఎస్.భారతి అఫిడవిట్ సమర్పించారు. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలుచేసిన 200కి పైగా వ్యక్తులు, సంస్థల్లో డిఎంకె కూడా ఒకటి. మత ఆధారిత వివక్షను ఈ చట్టం పెంపొందిస్తోందని పిటిషనర్లు విమర్శిస్తున్నారు.

బిజెపి అభ్యర్థిపై ఎఫ్ఐఆర్

గాంధీనగర్ : గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆ రాష్ట్రంలో బిజెపికి ఇబ్బందికర పరిస్థితి ఎదురయింది. మద్యాన్ని బహిరంగంగా అమ్ముకోవచ్చని చెప్పినందుకు ఒక బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బణస్కంథ జిల్లా దంత నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బిజెపి అభ్యర్థి లతు భాయి పర్గి నవంబర్ 26న ఒక సమావేశంలో మాట్లాడుతూ మద్యాన్ని ఒక బాస్కెట్‌లో పెట్టి బహిరంగంగా అమ్ముకోవచ్చు, దీనికి ఎలాంటి గోప్యత అవసరం లేదని చెప్పారు. ఈ వీడియా వైరల్‌గా మారింది. రిటర్నింగ్ అధికారి ఫిర్యాదుతో దంత పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. గుజరాత్‌లో మద్యం తయారీ, నిల్వ, అమ్మకం, వినియోగాన్ని నిషేధించే చట్టం అమలులో ఉంది.

ఎన్‌సిపి నేత నవాబ్ మాలిక్ బెయిల్ పిటిషన్ తిరస్కరణ

ముంబయి : మహారాష్ట్ర మాజీ మంత్రి, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిబి) నేత నవాబ్ మాలిక్ బెయిల్ పిటిషన్‌ను ప్రత్యేక కోర్టు తిరస్కరించింది. నవంబర్ 14న బెయిల్ పిటిషన్‌పై ఇరువురి వాదనలు విన్న ప్రత్యేక కోర్టు తీర్పుని రిజర్వ్ చేసింది. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఆయన ప్రస్తుతం ముంబయిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పాకిస్థాన్ ఉగ్రవాది దావూద్ ఇబ్రహీం, ఆయన అనుచరులతో సంబంధాలు ఉన్నాయని పేర్కొంటూ మనీలాండరింగ్ కేసులో ఆయనను ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో తనను విచారించేందుకు ఆధారాలు లేవని నవాబ్ మాలిక్ తన బెయిల్ పిటిషన్‌లో పేర్కొన్నారు.

మంత్రి గంగుల కమలాకర్‌కు సిబిఐ నోటీస్

- ఎంపి వద్దిరాజు రవిచంద్రకు కూడా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ మంత్రి గంగుల కమలాకర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రలకు సిబిఐ సమన్లు జారీ చేసింది. గురువారం విచారణకు ఢిల్లీకి రావాలని పేర్కొంది. సిబిఐ ఇటీవల అరెస్టు చేసిన సిబిఐ నకిలీ అధికారి శ్రీనివాస్ మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి ఏం మాట్లాడారనే అంశంపై అధికారులు విచారించనున్నారు. విచారణలో పాల్గొనాలని రవిచంద్రకు జారీ చేసిన సమన్లలో దర్యాప్తు సంస్థ పేర్కొంది.

29 నుంచి భారత్, ఆస్ట్రేలియా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

సిడ్నీ : భారత్, ఆస్ట్రేలియా మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం డిసెంబరు 29 నుండి అమల్లోకి రానుంది. ద్వైపాక్షిక వాణిజ్యం దాదాపు రెట్టింపవడానికి ఈ ఒప్పందం దోహదపడుతుందని భావిస్తున్నారు. ఐదేళ్ల కాలంలో 4,500 నుండి 5 వేల కోట్ల డాలర్లకు చేరుతుందని ఆశిస్తున్నారు. ఈ ఒప్పందం అమలుకు అవసరమైన చర్యలను తీసుకున్నట్లు భారత ప్రభుత్వం నుంచి సమాచారం అందిందని ఆస్ట్రేలియా వాణిజ్య శాఖ మంత్రి డాన్ ఫారెల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్ట్రేలియా వ్యాపారవేత్తలకు, వినియోగదారులకు డిసెంబరు 29 నుండి కొత్త మార్కెట్ అవకాశాలను ఈ ఒప్పందం అందచేస్తుందన్నారు. మన వాణిజ్యవేత్తలకు, ప్రజలకు ఈ వాణిజ్య ఒప్పందం అమలు 'కొత్త శకంలో సూర్యోదయం' వంటిదని భారత వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వ్యాఖ్యానించారు. సుదీర్ఘమైన భాగస్వామ్యాన్ని భారత్, ఆస్ట్రేలియా సుసంఘటితం చేసుకున్నాయని ఆయన ట్వీట్ చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 2న దీనిపై సంతకాలు జరిగాయి. వివిధ రంగాలకు చెందిన ఆరు వేల మందికి పైగా భారతీయ ఎగుమతిదారులకు ఎలాంటి సుంకాలు లేకుండా ఆస్ట్రేలియా మార్కెట్‌లో ప్రవేశించడానికి అవకాశం దొరుకుతుంది.

ఉగ్రవాదాన్ని అరికట్టడానికి కలిసి పనిచేద్దాం : భారత్, బంగ్లాదేశ్

ఢాకా : ఉగ్రవాదాన్ని అరికట్టడానికి కలిసి పనిచేయాలని భారత్- బంగ్లాదేశ్ నిర్ణయించాయి. బంగ్లాదేశ్‌లో భారత రాయబారిగా నూతనంగా నియమితులైన ప్రణయ్‌వర్మ బుధవారం బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనాతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరు ఈ మేరకు నిర్ణయించినట్లు బంగ్లాదేశ్ ప్రధానమంత్రి కార్యాలయ ప్రతినిధి తెలిపారు. ఉగ్రవాదాన్ని అణిచివేసేందుకు రెండు దేశాలు కలిసి పనిచేయాలని నిర్ణయించాయని పేర్కొన్నారు. ఉగ్రవాదులు బంగ్లాదేశ్‌ను ఉపయోగించుకోవడానికి అనుమతించబోమని హసీనా పేర్కొన్నట్లు చేసినట్లు తెలిపారు. తీస్తా నదీ జలాల పంపిణీతో సహా అన్ని అంశాలను చర్చల ద్వారా భారత్-బంగ్లాదేశ్ పరిష్కరించుకుంటాయనే విశ్వాసాన్ని హసీనా వ్యక్తపరిచినట్లు పిఎంఒ ప్రతినిధి తెలిపారు.

మైనార్టీ విద్యార్థులకు షాక్..

- 1-8 తరగతుల స్కాలర్‌షిప్స్ నిలిపివేత
- 9, 10 తరగతులకే ఇస్తామన్న మోడీ సర్కార్
- పేద విద్యార్థుల్ని విద్య నుంచి దూరం చేయటమే : కాంగ్రెస్
- కేంద్ర నిర్ణయాన్ని ఖండించిన ముస్లిం పర్సనల్ లా బోర్డ్



న్యూఢిల్లీ : ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల జారీలో మైనార్టీ విద్యార్థులకు కేంద్రం మొండిచేయి చూపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో స్కాలర్‌షిప్ పథకం నుంచి 1 నుంచి 8వ తరగతి మైనార్టీ విద్యార్థులను తొలగిస్తున్నామని ప్రకటించింది. 9, 10 తరగతుల విద్యార్థుల దరఖాస్తులనే ధ్రువీకరిస్తామని కేంద్రం తాజాగా వెల్లడించింది. 9, 10 తరగతుల విద్యార్థులు మాత్రమే అర్హులని కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నది. దీనికి సంబంధించిన నోటీస్ ఒకటి జాతీయ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో విడుదల చేశారు. సామాజిక న్యాయం, సాధికారత కేంద్ర మంత్రిత్వశాఖ, గిరిజన వ్యవహారాల శాఖ అమలుజేస్తున్న ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకానికి అనుగుణంగా ఇకపై నిబంధనలుంటాయని పేర్కొంది. ఈ నిర్ణయాన్ని కాంగ్రెస్, బిఎస్‌పి సహా ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి.

స్కాలర్‌షిప్ కేవలం 9, 10 తరగతుల విద్యార్థులకే పరిమితం చేయాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రకటనను ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు, జమియత్ ఉలేమా-ఈ-హింద్ తీవ్రంగా ఖండించాయి. సచార్ కమిటీ నివేదిక తర్వాతే ముస్లిం సమాజానికి ప్రీ-మెట్రిక్, పోస్ట్ మెట్రిక్, మెరిట్-కమ్‌మీన్స్ స్కాలర్‌షిప్స్ మొదలయ్యాయని, దీనిని ఇప్పుడు ఆపేయాలని నిర్ణయించటం సరైంది కాదని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు డాక్టర్ ఎస్.క్యూ.ఆర్.ఇలియాస్ అన్నారు. స్కాలర్‌షిప్ ఆపేయటం వల్ల పాఠశాలల్లో ముస్లిం విద్యార్థుల డ్రాపౌట్స్ పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్కాలర్‌షిప్ పథకం నుంచి మైనార్టీల విద్యార్థులను తొలగించటాన్ని బిఎస్‌పి నాయకుడు కున్వర్ డానిష్ అలీ ఖండించారు. పేద పిల్లల్ని విద్య నుంచి దూరం చేయటమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు వ్యతిరేకంగా కేంద్రం చేసిన కుట్రగా కాంగ్రెస్ ఎంపీ రణదీప్ సూర్జేవాలా అభివర్ణించారు.

2014-15కి ముందు 3.03 కోట్ల స్కాలర్‌షిప్‌లు ఇవ్వగా, అటు తర్వాత 5.20 కోట్ల స్కాలర్‌షిప్‌లు మైనార్టీ విద్యార్థులకు పంపిణీ చేశామని పార్లమెంట్‌లో (ఈ ఏడాది మార్చిలో) అప్పటి మైనార్టీ వ్యవహారాల మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ చెప్పారు. ఆయన విడుదల చేసిన వివరాల ప్రకారం, 2014-15-2021-22 మధ్యకాలంలో మొత్తం 3,36,11,677 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఇందులో ముస్లిం విద్యార్థులు 53,13,905, క్రైస్తవ విద్యార్థులు-53,13,905, సిక్కు విద్యార్థులు-35,90,880, బౌద్ధ విద్యార్థులు-12,98,637, జైన్ విద్యార్థులు-4,58,665 మంది ఉన్నారు. వీటి కోసం కేంద్రం రూ.9,057 కోట్లు కేటాయించిందని నఖ్వీ చెప్పారు.

ప్రభుత్వం ఎంత డబ్బు ఆదా చేస్తుంది? : ఖర్గే

మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు నిలిపివేయాలని మోడీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే బుధవారం విమర్శలు గుప్పించారు. 'నరేంద్ర మోడీ జీ, ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకూ ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, మైనార్టీ విద్యార్థుల కోసం ఉద్దేశించిన ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ను మీ ప్రభుత్వం నిలిపివేసింది. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందకుండా చేయడం ఏమిటి? పేద విద్యార్థుల నుంచి ఈ డబ్బును లాక్కోవడం ద్వారా మీ ప్రభుత్వం ఎంత డబ్బు సంపాదిస్తుంది లేదా ఎంత డబ్బు ఆదా చేస్తుంది' అని ఆయన ప్రశ్నించారు.

సుప్రీంలో బిల్కిస్ బానో రివ్యూ పిటిషన్

- 11మంది దోషుల విడుదలపై సవాల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

2002 గోద్రా అల్లర్లలో సామూహిక అత్యాచారం చేసి, హత్యకు పాల్పడిన కేసులో జీవిత ఖైదు పడిన 11 మంది దోషులను ముందస్తుగా విడుదల చేస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బాధితురాలు బిల్కిస్ బానో సుప్రీం కోర్టులో బుధవారం రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. 1992 ఉపశమన నిబంధనలను ఈ కేసుకు వర్తింపజేస్తూ సుప్రీంకోర్టు ఈ ఏడాది మే 13ను ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ మరో రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ల విచారణ జాబితా కోసం బిల్కిస్ బానో తరపు న్యాయవాది శోభా గుప్తా బుధవారం సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్ ధర్మాసనం ముందు ప్రస్తావించారు. రిమిషన్ పిటిషన్‌పై నిర్ణయం తీసుకునేందుకు గుజరాత్ ప్రభుత్వానికి అనుమతిస్తూ జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ విక్రమ్ నాథ్‌లతో కూడిన ధర్మాసనం మే 13న తీర్పు వెలువరించిందని, ఈ రెండు పిటిషన్లను ఒకేసారి, ఒకే ధర్మాసనం విచారించాలా, లేదా అనే అంశాన్ని పరిశీలిస్తామని సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్ తెలిపారు. జస్టిస్ అజయ్ రస్తోగి రాజ్యాంగ ధర్మాసనం విచారణలో ఉన్నందున ఈ అంశాన్ని విచారించగలరా? అని ఆమె సందేహం వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో విచారణ జరిగినందున 1992 నాటి గుజరాత్ రిమిషన్ పాలసీకి బదులు, ప్రస్తుత కేసులో మహారాష్ట్ర రిమిషన్ పాలసీని వర్తింపజేయాలని రివ్యూ పిటిషన్‌లో పేర్కొన్నారు. 11 మంది దోషులను విడుదల చేస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఇప్పటికే సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు సుభాషిణి అలీ, జర్నలిస్టు రేవతి లాల్, టిఎంసి ఎంపి మహువా మోయిత్రా, మాజీ ఐపిఎస్ అధికారి మీరన్ చద్దా బోర్వాంకర్, మరికొంత మంది మాజీ సివిల్ సర్వెంట్లు, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ దాఖలు చేసిన పిటిషన్లు సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి.

ఆ నిబంధనను ఎందుకు సవాలు చేయలేదు?

- జమ్ము కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టంపై పిటిషనర్లకు సుప్రీం ప్రశ్న

న్యూఢిల్లీ : జమ్మూ కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో నిర్దిష్ట నిబంధన రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేయకపోవడానికి గల కారణాన్ని సుప్రీంకోర్టు బుధవారం పిటిషనర్లను ప్రశ్నించింది. పూర్వపు రాష్ట్రంలోని 370వ అధికరణను రద్దు చేసిన తర్వాత ఏర్పడిన కేంద్ర పాలిత ప్రాంతంలో నియోజకవర్గాలను తిరిగి సర్దుబాటు చేసేందుకు పునర్విభజన కమిషన్‌కు ఈ నిర్దిష్ట నిబంధన అధికారం కల్పిస్తోంది. శ్రీనగర్ నివాసులైన హాజి అబ్దుల్ గని ఖాన్, మహ్మద్ అయూబ్ మట్టూ దాఖలు చేసిన పిటిషన్ కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌ను మాత్రమే సవాలు చేసిందని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, ఎ.ఎస్.ఓకాలతో కూడిన బెంచ్ పేర్కొంది. జమ్ము కాశ్మీర్‌కు మాత్రమే పునర్విభజనను నిర్వహించేందుకు కాలపరిమితిని పొడిగిస్తూ గతేడాది మార్చిలో జారీ చేసిన రెండో నోటిఫికేషన్‌ను కూడా వారు సవాలు చేశారు. ఈ నిర్దిష్ట నిబంధనను ఎందుకు సవాలు చేయలేదో కారణాలు చెప్పాలని కోరింది. పిటిషనర్లు నోటిఫికేషన్లను మాత్రమే సవాలు చేశారని, ప్రభుత్వం ఆ నోటిఫికేషన్లు జారీ చేయడానికి గల మూలాన్ని ఎందుకు సవాలు చేయలేదో తెలియజేయాలని కోరింది.

విజయవంతంగా నింగికెగిసిన షెంఝూ-15



- చైనా రోదసీ స్టేషన్‌లో 6కి పెరిగిన వ్యోమగాముల సంఖ్య
- చేపట్టనున్న 40కి పైగా ప్రయోగాలు

బీజింగ్ : మానవ సహిత రోదసీ నౌక షెంఝూ-15ని చైనా మంగళవారం రాత్రి విజయవంతంగా ప్రయోగించింది. వాయవ్య చైనాలోని జియూక్వాన్ ఉపగ్రహ ప్రయోగ కేంద్రం నుండి స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 11.08గంటలకు లాంగ్ మార్చ్-2ఎఫ్ వై 15 రాకెట్ ఈ రోదసీ నౌకను తీసుకుని నింగికెగిసింది. షెంఝూలోని ముగ్గురు వ్యోమగాములు చైనా రోదసీ స్టేషన్‌లోకి ప్రవేశించారు. అప్పటికే అక్కడ వున్న ముగ్గురినీ బుధవారం కలుసుకున్నారు. దీంతో చైనా రోదసీ స్టేషన్‌లో వ్యోమగాముల సంఖ్య ఆరుకు పెరిగింది. అంతరిక్ష స్టేషన్ నిర్మాణం చివరి భాగాన్ని ఈ పర్యటనలో వారు పూర్తి చేయనున్నారు. తొలి దశ కార్యక్రమాలను, కార్యకలాపాలను ప్రారంభించనున్నారు.

ప్రయోగించిన పది నిముషాల వ్యవధిలోనే రాకెట్ నుండి షెంఝూ-15 విడివడి నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశించింది. బుధవారం తెల్లవారు జామున 5.42గంటలకు వేగంగా ఆటోమేటెడ్ విన్యాసాన్ని నిర్వహించి రోదసీ స్టేషన్ ముందు భాగంలోని తియాన్హె మాడ్యూల్‌తో అంతరిక్ష నౌక అనుసంణవనమైంది. మూడు మాడ్యూల్స్, మూడు రోదసీ నౌకలు పట్టేంత రీతిలో రోదసీ స్టేషన్‌ను విస్తరించారు. దాదాపు వంద టన్నుల బరువు వుంటుంది. ఉదయం 7.33 గంటలకు షెంఝూ-14 సిబ్బంది కమాండర్ చెన్ డాంగ్ కొత్తగా వచ్చిన వారికి సాదరంగా స్వాగతం పలికారు.

అందరూ కలిసి గ్రూపు ఫోటో తీసుకున్నారు. ఈ రోదసీ స్టేషన్‌లో సుదీర్ఘకాలం నివసించడానికి సంబధించిన వివిధ పరీక్షలను షెంఝూ-15 సిబ్బంది చేపట్టనున్నారు. మొత్తంగా 15 శాస్త్రీయ ప్రయోగాలను నిర్వహించనున్నారు. రోదసీ శాస్త్ర పరిశోధనలో 40కి పైగా ప్రయోగాలు, పరీక్షలు జరగనున్నాయి.

చైనా మాజీ అధ్యక్షుడు జియాంగ్ జెమిన్ కన్నుమూత



బీజింగ్ : ప్రముఖ మార్క్సిస్ట్, వేగవంతమైన ఆర్థికాభివృద్ధి దిశగా దేశాన్ని నడిపించిన చైనా మాజీ అధ్యక్షుడు జియాంగ్ జెమిన్ బుధవారం మృతి చెందారు. ఆయన వయస్సు 96సంవత్సరాలు. గత కొంత కాలంగా ఆయన ల్యుకేమియాతో బాధపడుతున్నారు. పలు అవయవాలు విఫలమవడంతో ఆయన షాంఘై నగరంలో బుధవారం ఉదయం 12.13 గంటలకు మరణించారని చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రకటించింది. ఈ మేరకు చైనా ప్రజలను ఉద్దేశించి పాలక కమ్యూనిస్టు పార్టీ, పార్లమెంట్, కేబినెట్, మిలటరీలు ఒక లేఖను ప్రచురించాయి. ల్యుకేమియాతో బాధపడుతున్న మన ప్రియతమ నేత జియాంగ్ జెమిన్‌కు అన్ని రకాలుగా వైద్య చికిత్సనందించారని, అయినా శరీరంలో పలు అవయవాలు పని చేయకపోవడంతో కన్ను మూశారని పార్టీ ఆ లేఖలో పేర్కొంది.

విశిష్ట నాయకుడు జెమిన్‌కు పార్టీలో గొప్ప పేరు వుందని, ఆయన ప్రముఖ మార్క్సిస్ట్ అని, శ్రామికవర్గ విప్లవకారుడని, రాజనీతిజ్ఞుడని ఆ లేఖలో పార్టీ కొనియాడింది. సైనిక వ్యూహ నిపుణుడు, దౌత్యవేత్త, కాలపరీక్షకు నిలిచిన కమ్యూనిస్టు యోధుడుని పేర్కొంది. చైనా లక్షణాలతో కూడిన సోషలిజం మహోన్నత ప్రయోజనాల కోసం పోరాడిన నేత అని అభివర్ణించింది. చైనా కమ్యూనిస్టు పార్టీ మూడవ తరం కేంద్ర సమిష్టి నాయకత్వంలో ఆయన కీలకమైన వ్యక్తి అని, థియరీ ఆఫ్ త్రీ రిప్రజెంట్స్ ప్రధాన వ్యవస్థాపకుడని తెలిపింది. కామ్రేడ్ జియాంగ్ జెమిన్ మృతితో పార్టీకి, మిలటరీకి, ప్రజలకు కోలుకోలేని నష్టం వాటిల్లిందని పేర్కొంది. తీవ్ర విచారంతో ఈ విషయాన్ని ప్రకటిస్తున్నామని పేర్కొంది.

పోలీసు ట్రక్కుపై సూసైడ్ బాంబర్ దాడి

ముగ్గురు మృతి, 23మందికి గాయాలు

క్వెట్టా : పశ్చిమ పాకిస్తాన్‌లో బుధవారం ఒక పోలీసు ట్రక్కును లక్ష్యంగా చేసుకుని ఆత్మాహుతి దళ సభ్యుడు తనను తాను పేల్చుకోవడంతో ముగ్గురు వ్యక్తులు మరణించగా, 23మంది గాయపడ్డారు. పాక్ తాలిబన్ ఈ దారుణానికి పాల్పడి వుంటుందని భావిస్తున్నారు. గత వేసవి కాలంలో పాక్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి స్వస్తి పలుకుతున్నామని సోమవారమే ఈ గ్రూపు ప్రకటించింది. త్వరలోనే దేశవ్యాప్తంగా దాడులను పునరుద్ధరించాలని ఆదేశించింది. క్వెట్టా నగరంలో పోలియో వ్యాక్సినేటర్లకు ఎస్కార్టుగా వెళ్లేందుకు సిద్ధమవుతున్న పోలీసు బృందాన్ని లక్ష్యంగా చేసుకున్నారని సీనియర్ పోలీసు అధికారి అజర్ మెహెసర్ మీడియాకు తెలిపారు. మృతి చెందిన వారిలో పోలీసుతో సహా ఒక మహిళ, పిల్లవాడు వున్నారని చెప్పారు. ప్రపంచంలో పోలియో ఇప్పటికీ ప్రబలంగా వున్న దేశాలు ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ మాత్రమే.

భారత్‌లో మత చీలికలు అధికం

- సామాజిక శతృత్వ సూచిక 9.4
- పాక్, అఫ్ఘన్ కంటే దారుణం
- ప్యూ పరిశోధనా కేంద్రం నివేదిక

న్యూఢిల్లీ : భారత్‌లో మతపరమైన చీలికలు ఆందోళనలు కలిగిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 2020లో కోవిడ్-19 ప్రారంభ దశలో మతపరమైన శతృత్వాన్ని చూసిన కొన్ని దేశాల్లో భారత్ ఒకటిగా ఉన్నది. ఈ విషయాన్ని యుఎస్ థింక్-ట్యాంక్ ప్యూ రీసెర్చ్ సెంటర్ విడుదల చేసిన నివేదికలో పేర్కొన్నది. 198 దేశాలను ఈ నివేదిక కవర్ చేసింది. మొత్తమ్మీద, భారత్ 2020లో ప్రపంచవ్యాప్తంగా మతపరమైన విషయంలో అత్యధిక సామాజిక ఉద్రిక్తతలను కలిగి ఉన్నది. మహమ్మారి తొలి ఏడాదిలో శతృత్వ పెరుగుదలపై భారత అధికారిక గణాంకాల్లో సైతం ప్రతిబింబించటం గమనార్హం.

ప్యూ పరిశోధనా కేంద్రం అధ్యయనం ప్రకారం.. 2020లో భారత సామాజిక శతృత్వ సూచీ (ఎస్‌హెచ్ఐ) పది మార్కులకు గానూ 9.4గా ఉన్నది. దీనర్థం భారత ప్రదర్శన దారుణంగా ఉన్నది. ఇది మన పొరుగు దేశాలైన పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్‌ల కంటే ఘోరంగా ఉండటం గమనార్హం. ప్రయివేటు వ్యక్తులు, సంస్థలు, గ్రూపులు ద్వారా మతపరమైన శతృత్వ చర్యలను ఎస్‌హెచ్ఐ కొలుస్తుంది. ఇందులో మత సంబంధిత సాయుధ పోరాటం, ఉగ్రవాదం, మతపరమైన హింస వంటి 13 అంశాలున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక జనాభా కలిగిన దేశాలలో భారత్, నైజీరియా, పాకిస్థాన్, ఈజిప్టు, బంగ్లాదేశ్‌లు మతానికి సంబంధించి 'చాలా అధిక' సామాజిక శతృత్వాన్ని కలిగి ఉన్నాయి.

ప్రభుత్వ ఆంక్షలు

మత విశ్వాసాలు, ఆచారాల పట్ల చట్టం, విధానాలు, ఒక దేశ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును అంచనా వేసే ప్రభుత్వ పరిమితుల సూచీ (జిఆర్ఐ) భారత్‌లో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పేర్కొంది. ఈ విషయంలో ప్రపంచ దేశాలతో పోల్చుకుంటే భారత ర్యాంకు 34గా ఉన్నది. మత విశ్వాసాలు, ఆచారాలపై భారత ప్రభుత్వ ఆంక్షలు "అధిక" స్థాయిల్లో ఉన్నాయి.

కోవిడ్‌లో 'ఆ వర్గం'పై దాడులు

మత సంస్థలపై ప్రయివేటు వ్యక్తులు, సంస్థల భౌతిక హింస, విధ్వంసానికి సంబంధించి సామాజిక శతృత్వాలను చూసిన మొదటి నాలుగు దేశాల్లో భారత్ ఒకటి. అర్జెంటీనా, ఇటలీ, అమెరికా ఈ జాబితాలో ఉన్నాయి. భారత్‌లో కరోనా వైరస్‌ను వ్యాప్తి చెందిస్తున్నారన్న నెపంతో "ఒక వర్గం"పై అనేక దాడులు జరిగాయని నివేదిక పేర్కొన్నది. "కరోనా జిహాద్" వంటి ఇస్లామోఫోబిక్ హ్యాష్‌ట్యాగ్‌ల వ్యాప్తిని నివేదిక ఉటంకించింది.

పెరిగిన మతపరమైన అల్లర్ల కేసులు

పోలీసు సమాచారం ప్రకారం.. మతపరమైన అలర్లకు సంబంధించిన కేసులు 2020లో గణనీయంగా పెరిగాయి. 'మతపరమైన సంఘటనల' డేటాను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అందించదనీ, నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) ఇప్పుడిప్పుడే మతపరమైన 'అలర్ల' సమాచారాన్ని ప్రచురిస్తున్నదని నిపుణులు తెలిపారు. కొన్ని అంశాల్లో హోం మంత్రిత్వ శాఖ, ఎన్‌సిఆర్‌బిల సమాచారానికి మధ్య చాలా తేడాలున్నాయన్నారు.

ఢిల్లీ మద్యం కుంభకోణంలో కవిత, వైసిపి ఎంపి మాగుంట శ్రీనివాసరెడ్డి

- ఇడి వెల్లడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఎమ్మెల్సీ, సిఎం కెసిఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత, వైసిపి ఎంపి మాగుంట శ్రీనివాసరెడ్డి పేర్లు ఉన్నాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) వెల్లడించింది. ఢిల్లీ డిప్యూటీ సిఎం మనీష్ సిసోడియా అనుచరుడు అమిత్ అరోరాను బుధవారం అరెస్టు చేసిన ఇడి, రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలను పొందుపరిచింది. 32 పేజీల రిమాండ్ రిపోర్టులో మూడో పేజీలో శరత్ చంద్రారెడ్డి, మాగుంట శ్రీనివాసరెడ్డి, కల్వకుంట్ల కవిత పేర్లు ఉన్నాయి. మద్యం కుంభకోణంలో సౌత్ గ్రూప్ ద్వారా రూ.100 కోట్లను విజయ్ నాయర్‌కు చేర్చినట్లు ఇడి వెల్లడించింది. సౌత్ గ్రూప్‌ను శరత్ రెడ్డి, కల్వకుంట్ల కవిత, వైసిపి ఎంపి మాగుంట శ్రీనివాసుల రెడ్డి నియంత్రించారని పేర్కొంది. దర్యాప్తులో ఇచ్చిన వాంగ్మూలంలో అమిత్ అరోరా ధ్రువీకరించారని ఇడి రిమాండ్ రిపోర్ట్ పేర్కొంది. అమిత్ అరోరాతో సంభాషణలకు కల్వకుంట్ల కవిత పది ఫోన్లను ఉపయోగించి, మాట్లాడి, ధ్వంసం చేసినట్లు ఇడి పేర్కొంది. శరత్ చంద్రారెడ్డి, అభిషేక్ రెడ్డి, సృజనా రెడ్డి, బుచ్చిబాబు గోరంట్ల వేర్వేరు ఫోన్ నెంబర్లతో మాట్లాడారని తెలిపింది. ఢిల్లీ డిప్యూటీ సిఎం మనీష్ సిసోడియా, ఢిల్లీ సిఎం పిఎ బిభవ్ కుమార్ సహ 36 మంది పేర్లను రిమాండ్ రిపోర్టులో పేర్కొంది.



వేతన పెంపు కోసం పంజాబ్ సిఎం ఇంటి ముందు భారీ నిరసన

- పోలీసుల లాఠీఛార్జి

చండీగఢ్ : వేతనాల పెంపు కోసం పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ నివాసం ముందు వ్యవసాయ కార్మికులు, ట్రేడ్ యూనియన్ కార్మికులు బుధవారం భారీ నిరసన నిర్వహించారు. ఈ సమయంలో ముఖ్యమంత్రి గుజరాత్ ఎన్నికల ప్రచారంలో ఉన్నారు. నిరసనకారుల్ని చెదరగొట్టడానికి పోలీసులు లాఠీఛార్జి చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కనీస రోజువారీ వేతనాన్ని రూ.700కు పెంచాలని, 5 సెంట్ల భూమి పథకాన్ని అమలు చేయాలనే డిమాండ్లతో ఈ నిరసన జరిగింది. గ్రామ సహకార సంఘాల్లో దళితులకు 33 శాతం ప్రాతినిధ్యం కల్పించాలని, భూసేకరణకు పరిహారం పెంచాలని, చర్మవ్యాధితో పశువులు చనిపోవడం వల్ల నష్టపోతున్న రైతులకు ఉపశమనం, పంట నష్టానికి పరిహారం ఇవ్వాలని కూడా నిరసనకారులు డిమాండ్ చేశారు. ఎనిమిది కార్మిక సంఘాల ఐక్య వేదిక సంఝా మజ్దూర్ మోర్చా ఆధ్వర్యాన నిరసన జరిగింది.

బిజెపికి భారీగా ఎన్నికల విరాళాలు

- 2021-22లో రూ.614 కోట్లు
- కాంగ్రెస్‌కు రూ.95.46 కోట్లు..

న్యూఢిల్లీ : అధికార బిజెపికి ప్రతిఏటా వందల, వేల కోట్ల రూపాయలు విరాళాలుగా అందుతున్నాయి. 2021-22 ఆర్థిక సంవత్సరంలో తమ పార్టీకి రూ.614.54 కోట్లు విరాళాలుగా సమకూరాయని కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన నివేదికలో బిజెపి తెలిపింది. బిజెపి, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు గత ఆర్థిక సంవత్సరం పార్టీ ఆడిట్ నివేదికల్ని కేంద్ర ఎన్నికల సంఘానికి ఇటీవల పంపాయి. ఆ సమాచారాన్ని ఎన్నికల సంఘం తమ వెబ్‌సైట్‌లో తాజాగా విడుదల చేసింది. దీని ప్రకారం, పశ్చిమ బెంగాల్‌లో అధికారంలో ఉన్న తృణమూల్ రూ.43 లక్షలు విరాళాలు సేకరించామని తెలిపింది. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు తమ ఆడిట్ నివేదికల్ని ప్రతిఏటా ఈసీకి అందజేయాలి. రూ.20వేలకు మించిన విరాళాల వివరాల్ని అందులో పొందుపర్చాలి. విరాళం అందించిన దాత పేరు లేదా ఎలక్టోరల్ సంస్థ పేరు ఇవ్వాల్సి ఉంటుంది. తాజా నివేదికల ప్రకారం బిజెపికి అందిన విరాళాల్లో అత్యధికం ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి వచ్చినవే ఉన్నాయి. ఢిల్లీ, పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి ఇంకా జాతీయ పార్టీ గుర్తింపు లభించలేదు. మూడు రాష్ట్రాల్లోనూ రాష్ట్ర పార్టీగానే గుర్తింపు ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.44.54 కోట్లు విరాళాలుగా సమకూరాయని ఆప్ ఈసీకి తెలిపింది.

ఏపి హైకోర్టు న్యాయమూర్తుల బదిలీ సిఫార్సులను సమీక్షించండి

- సిజెఐకి ఏపి న్యాయవాదుల సంయుక్త కమిటీ వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు చెందిన ఇద్దరు న్యాయమూర్తులను బదిలీ చేస్తూ సుప్రీం కోర్టు కొలీజియం చేసిన సిఫార్సులను సమీక్షించాలని ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల సంయుక్త కమిటీ కోరింది. ఈ మేరకు బుధవారం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్‌కు కమిటీ వినతిని అందజేసింది. ఏపి హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్‌ను మద్రాస్ హైకోర్టుకు, జస్టిస్ డి.రమేష్‌ను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీం కోర్టు కొలీజియం నవంబర్ 24న జరిగిన సమావేశంలో సిఫార్సులు చేసింది. ఈ సిఫార్సులను ఏపి న్యాయవాదుల సంయుక్త కమిటీ వ్యతిరేకించింది. హైకోర్టు ఆదేశాలను అమలు చేయకపోవడంతో కోర్టు ధిక్కారణ కేసులో ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకున్నందుకు ఆ ఇద్దరు న్యాయమూర్తుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం పక్షపాత ధోరణితో ఉందని ఆరోపించింది. వారు న్యాయ వ్యవస్థ రాజ్యాంగ విలువలు, స్వతంత్రతను సమర్థిస్తున్నారని, వారి బదిలీ సిఫార్సు చేయడంలో కొలీజియం వ్యవస్థ చర్య పారదర్శకతకు వ్యతిరేకంగా ఉన్నాయని లేఖలో కమిటీ పేర్కొంది. ఇలాంటి బదిలీలు ప్రజలకు న్యాయం అందించడానికి నిర్ణయాలు తీసుకోవడంలో ఇతర న్యాయమూర్తులపై ప్రభావం చూపుతాయని లేఖలో పేర్కొంది.

ప్రపంచంలోనే అతిపెద్ద అగ్ని పర్వతం నుండి 200 మీటర్ల ఎత్తున లావా ప్రవాహం

హవాయి : ప్రపంచంలోనే అతి పెద్దదైన, క్రియాశీలంగా వున్న అగ్నిపర్వతం, హవాయి ద్వీపంలోని మౌనా లోవా నుండి 200 అడుగుల (60మీటర్లు) ఎత్తు వరకు లావా బయటకు విరజిమ్ముతోందని భూగర్భ శాస్త్రవేత్తలు తెలిపారు. పర్వతం పైన గల శిఖరంపై నాలుగు చీలికలు ఏర్పడ్డాయి, ఫలితంగా దాదాపుగా గత 40ఏళ్ళ కాలంలో మొదటిసారిగా ఆదివారం లావా ప్రవాహం వెలువడింది. అగ్ని పర్వతం నుండి పెద్ద ఎత్తున బూడిద, పొగ, దుమ్ము ధూళి మేఘాలు చెలరేగుతున్నాయి. హవాయి ద్వీపంలో దాదాపు సగం భాగం ఈ అగ్ని పర్వతమే ఆక్రమిస్తుంది. అప్పుడప్పుడూ వంద నుండి 200 అడుగుల ఎత్తులో లావా వెదజల్లుతున్నా ఎక్కువ భాగం చిన్న చిన్న ప్రవాహాలుగా లావా బయటకు వస్తోందని అమెరికా భూగర్భ సర్వే ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతానికి ప్రజలకు, ఆస్తులకు ఎలాంటి ముప్పు లేదని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

ఆఫ్ఘన్ మదరసాలో పేలుడు

- 16మంది మృతి

కాబూల్ : ఆఫ్ఘనిస్తాన్ ఉత్తర నగరమైన అయేబక్‌లోని ఒక మదరసాలో బుధవారం చోటుచేసుకున్న పేలుడులో 16మంది మరణించారని, 24మంది గాయపడ్డారని స్థానిక ఆస్పత్రి డాక్టర్లు తెలిపారు. మరణించిన వారందరూ పిల్లలు, సామాన్యులేనని చెప్పారు. రాజధాని కాబూల్‌కు 200 కిలోమీటర్ల దూరంలో ఈ పేలుడు జరిగింది. కాగా, చనిపోయింది పదిమంది విద్యార్థులేనని మిగిలిన వారు గాయపడ్డారని తాలిబన్ పేర్కొంది. క్షమించరాని ఈ నేరానికి పాల్పడిన వారిని గుర్తించేందుకు తమ భద్రతా బలగాలు కృషి చేస్తున్నాయని హోం మంత్రిత్వ శాఖ ప్రతినిధి అబ్దుల్ నఫయె ట్వీట్ చేశారు.



మీ కోసం

ధనియాల రసం రెండు పూటలా తాగితే మూత్ర సమస్యలు రావు.

జీవన సౌరభం

ధైర్యంగా వేసే ప్రతి అడుగులోనూ భయపెట్టే విమర్శలే వస్తుంటాయి. వింటూ ఆగిపోవడమా.. వినకుండా సాగిపోవడమా.. అనేది మనం వేసే అడుగులోనే ఉంటుంది.

ప్రాణం కాపాడిన గానం




మకరందపురం రాజ్యాన్ని రఘునందనుడు పరిపాలిస్తున్నాడు. ఒక రోజు అతడు అడవికి వేటకు వెళ్లాడు. ఒక్క జంతువూ కనపడలేదు. అలా అడవిలోకి వెళుతూ వెళుతూ దారి తప్పాడు. వెనక సైన్యం కూడా లేదు. ఏం చేయాలో పాలుపోలేదు.

రఘు నందనుడు రథం దిగి అటూ ఇటూ చూశాడు. ఎవరూ కనిపించలేదు. ఆకలి వేయడంతో అక్కడ ఉన్న ఓ చెట్టు ఫలాలు తింటూ కూర్చున్నాడు. అంతలో దూరం నుంచి పిల్లవాడి పాట వినిపించింది. ఆ పాట ఎటు నుంచి వస్తుందో వెతుక్కుంటూ వెళ్లసాగాడు. ఆ పాటకు తానూ వంత పాడాడు.

ఆ పిల్లవాడు కూడా తన పాటకు ఎవరో వంత పాడుతున్నారని గ్రహించాడు. చెట్ల పొదల మధ్యలో గాయాలతో వస్తున్న రాజును గుర్తించాడు. తన నివాసానికి తీసుకెళ్లాడు. ఆకు పసరు పూసి కట్టు కట్టాడు.

కాస్త శరీరం కుదుటపడ్డాక రాజు ఆ పిల్లవాడి ఇంట్లో లభించే గంజి తాగి, కడుపు నింపుకున్నాడు. సైనికులు రాజు జాడ తెలుసుకుని రథంతో వచ్చారు. రఘునందనుడు తనతో పాటు ఆ పిల్లవాడిని రాజ మందిరానికి తీసుకువెళ్లాడు. ఆ పిల్లవాడి పాటే తనని రక్షించిందని, అతన్ని సభకు పరిచయం చేసి, ఘనంగా సత్కరించాడు. గానంలో మరింత శిక్షణ ఇప్పించి, తరువాత ఆస్థాన గాయకుడిగా నియమించారు.

– ఉండ్రాళ్ళ రాజేశం
99669 46084



ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి పక్కనే వాటి పేర్లూ ఉన్నాయి. అయితే, స్పెల్లింగ్‌లో కొన్ని అక్షరాలు లేవు. వాటిని నింపండి.

నేను గీసిన బొమ్మ



– ఎం. చంద్రకళ, 5వ తరగతి, మెండి, కలవపూడి, కళ్ల మండలం, పశ్చిమ గోదావరి.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఈ విజయం వారందరిదీ


ప్రాచీ రాథోడ్


ట్రాన్స్‌జండర్లు సమాజంలో ఏళ్ల తరబడి వివక్షకు గురవుతున్నారు. వాటన్నిటిని దాటుకుని ఎంతో మంది లాయర్లుగా, టీచర్లుగా, వైద్యులుగా ఎదిగి స్ఫూర్తిగా నిలిచారు. ఈ వరసలో ఇప్పుడు డాక్టర్ రూత్ జాన్ పాల్, పాచీ రాథోడ్ చేరారు. కష్టపడి ఎంబిబిఎస్ పూర్తి చేశారు. వైద్యవృత్తి చేపట్టి చాలా ఏళ్లయింది. కాని వారిని వైద్యులుగా అంగీకరిస్తూ వారి సేవలు పొందేందుకు ఏ సంస్థా ముందుకు రాలేదు. ఎన్నో అవమానాలు, అవహేళనలూ ఎదుర్కొన్నారు. అయినా పట్టు వదలకుండా జనానికి వైద్యాన్ని అందిస్తూనే ఉన్నారు. తోటి ట్రాన్స్‌జండర్లకు అండగా నిలిచి వైద్యసేవలు చేశారు. వీరి సేవలను గుర్తించి తెలంగాణా ప్రభుత్వం ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో ప్రభుత్వ వైద్యులుగా నియమించింది.

తెలంగాణ, ఖమ్మంకు చెందిన రూత్ జాన్‌పాల్ 'మల్లారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్' కాలేజీలో 2018లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. ఉద్యోగం కోసం హైదరాబాద్‌లో చాలా ఆసుపత్రుల్లో ప్రయత్నం చేసింది. కాని వెళ్లిన ప్రతి ఆసుపత్రిలోనూ ఒకటే కారణం చెప్పారు. 'మీరు ట్రాన్స్‌జెండరు... మీరు ఇక్కడ పనిచేస్తున్నారని తెలిస్తే.. మా ఆసుపత్రికి జనం రావడం మానేస్తారు'. అని. రూత్ జాన్ పాల్ నిరాశపడకుండా ఉద్యోగం కోసం 15 ఆసుపత్రులను సంప్రదించారు. అన్నిటా ఒకటే అనుభవం. నిరాకరణ.

ఆదిలాబాద్‌కు చెందిన ప్రాచీ రాథోడ్ కూడా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. కాని కొన్ని రోజుల తర్వాత ఆ యాజమాన్యం 'మీ వల్ల మా ఆసుపత్రికి రోగులు రావడం లేదు. మిమ్మల్ని ఉద్యోగంలో నుంచి తొలగిస్తున్నాం' అని చెప్పింది. రిమ్స్ కళాశాల్లో చదువు పూర్తి చేసుకున్న ఈమె చిన్నప్పటి నుంచీ ఎన్నో అవమానాలు భరించారు. అయినా చదువుకుంటేనే భవిష్యత్తు బాగుంటుందనుకున్నారు. శ్రద్ధ పెట్టి ఎంబిబిఎస్ చదివారు. తమ ప్రవర్తన నచ్చక స్నేహం చేసేందుకు ఎవరూ ఇష్టపడేవారు కాదు. కాని ఏకాగ్రతతో పట్టుదలగా చదువుకునేవారు.

ఇటువంటి అవహేళనలు వారికి చిన్నప్పటి నుంచీ అలవాటే. వీరు తమ పిల్లలే అని చెప్పుకునేందుకే తల్లిదండ్రులే ముందుకు రావడం లేదు. బంధువులు, తెలిసిన వారి ప్రేమానురాగాలకు నోచుకుని వీరు– రోగులే తమ కుటుంబసభ్యులుగా భావించాలనుకున్నారు. కాని వారే అయిష్టం చూపటంతో మనుసులు నొచ్చుకున్నాయి. వీరు జనానికి వైద్యం అందించాలన్న కోరికతో కష్టపడి ఎంబిబిఎస్ పట్టా పొందారు. అందులో నైపుణ్యం సాధించాలంటే ఏదో ప్రయివేటు ఆసుపత్రిలో కొన్ని నెలలు సర్వీసు చేయాలి. అందుకు కూడా ఎక్కడా వారికి అవకాశం దొరకలేదు. చాలా బాధపడ్డారు. సమాజానికి వైద్యసేవ చేయాలని, అందరిలా తాము డాక్టర్లగా గుర్తింపు పొందాలని ఎంతో ఆశతో కళాశాల నుంచి బయటకు వచ్చారు. కాని సమాజంలో వారి గుర్తింపు, తమ పట్ల ఉన్న చిన్నచూపు వారిని ఎంతో కుంగదీసింది. ప్రభుత్వ అధికారులకు తమ గోడు విన్నవించుకున్నారు. రిజర్వేషను కల్పించి, ప్రోత్సహించాలని కోరారు.

ప్రయివేటు ఆసుపత్రుల్లో ఎన్నో తిరస్కరణల తర్వాత రూత్ జాన్ పాల్, రాథోడ్ జీవనోపాధి కోసం నారాయణగూడలోని యుఎస్ఎఐడికి చెందిన ట్రాన్స్‌జెండర్ క్లినిక్ 'మిత్రా'లో చేరారు. కాని అక్కడ ట్రాన్స్‌జెండర్లకు చెందిన శస్త్రచికిత్సలు మాత్రమే జరిగేవి. కాని తోటి ట్రాన్స్‌జండర్లో మనోధైర్యాన్ని నింపేలా కౌన్సిలింగ్ చేసేవారు. శస్త్రచికిత్సలూ చేశారు. కానీ వారిలో ఎప్పుడూ అసంతృప్తి ఉండేది. మామూలు జనానికి వైద్యం అందించే అవకాశం ఇవ్వాలని అధికారులను కోరారు. థర్డ్ జెండర్‌ను గుర్తించి, ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాల అడ్మిషన్లలో రిజర్వేషన్లు మంజూరు చేయాలని 2014లో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది.


రూత్ జాన్ పాల్

ఈ నేపథ్యంలో రూత్ జాన్ పాల్, రాథోడ్‌లు రెండేళ్ల పాటు అలుపెరగని పోరాటం చేశారు. చివరకు అనుకున్నది సాధించారు. ప్రభుత్వ వైద్యులుగా ఉద్యోగాలు పొందారు. 'భవిష్యత్తులో రోగులు కూడా మా పట్ల వివక్ష చూపించొచ్చు, కానీ ఎప్పుడైతే మెరుగ్గా వైద్యం అందిస్తామో, అప్పుడు వారిలో మార్పు వస్తుంది. మేమే కావాలని పేషెంట్స్ కోరుకునేలా కృషి చేస్తాం' అని రూత్, ప్రాచీ అంటున్నారు. ఈ విజయం వీరి ఒక్కరిదే కాదు. తమలాగా సమాజంలో బహిష్కరణకు గురవుతున్న ట్రాన్స్‌జండర్లు అందరిదీ!

జలుబు, దగ్గు .. ఇలా చేస్తే తగ్గు ...



చలికాలంలో పెద్దలను, పిల్లలను బాగా వేధించే సమస్య జలుబు, దగ్గు. వాటి నుంచి ఉపశమనం పొందేందుకు కొందరు తరచూ యాంటీ బయాటిక్స్ వాడతారు. అలా వాడడం మంచిది కాదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎటువంటి ఖర్చు లేకుండా ఇంటి చిట్కాలను ఉపయోగించి జలుబు, దగ్గు, సాధారణ జ్వరం వంటి వాటి నుంచి ఉపశమనం పొందవచ్చు.

- నీటిలో కొద్ది పరిమాణంలో వాము, తులసి ఆకులు వేసి మరిగించాలి. ఆ ఆవిరిని పట్టిస్తే దగ్గు చాలా వరకు తగ్గిపోతుంది.
- వేడి పాలలో కొంచెం పసుపు వేసి జలుబు, దగ్గుతో బాధపడుతున్న పిల్లలకు తాగిస్తే ఎంతో రిలీఫ్ వస్తుంది.
- జలుబు చేసినప్పుడు గొంతునొప్పి నుంచి ఉపశమనం పొందాలంటే.. గ్లాసు వేడి నీటిలో టీస్పూను ఉప్పు వేసి బాగా కరిగిన తర్వాత పుక్కిలించాలి. రోజుకు రెండు సార్లు ఇలా చేస్తే సరి.
- వేడి నీటి ఆవిరి పట్టినా, ఆ నీటిలో యూకలిప్టస్ ఆయిల్ కలిపి ఆవిరి పట్టినా జలుబు నుంచి ఉపశమనం కలుగుతుంది. శ్వాస సాఫీగా సాగేందుకు ఇది ఎంతో సహాయకారిగా ఉంటుంది.
- చిన్నపిల్లలకు రోజులో రెండు మూడు సార్లు తేనెను కొద్దికొద్దిగా నాకిస్తే వ్యాధి నిరోధక శక్తి మెరుగవుతుంది. ఐదేళ్ళ వయసు పైబడిన పిల్లలకు తేనెలో దాల్చిన చెక్క పొడి కలిపి తినిపిస్తే ఆరోగ్యానికి మేలు చేస్తుంది.
- జలుబు తీవ్రంగా ఉన్నప్పుడు పిల్లల ఛాతీపై ఆవనూనెకు వెల్లుల్లి కలిపి మసాజ్ చేయాలి. మెడ, వీపు భాగాల్లోనూ మెల్లగా మసాజ్ చేయాలి.
- శరీరానికి మంచినీరు ఎంతో అవసరం. పిల్లలు జలుబుతో బాధపడుతున్నప్పుడు ఎక్కువ సార్లు మంచినీరు తాగించాలి. అప్పుడే శరీరం వ్యాధితో సమర్థవంతంగా పోరాడగలదు. కోల్పోయిన నీటి శాతం కూడా వెంటనే భర్తీ అవుతుంది.
- పిల్లలు జలుబు, దగ్గు బారిన పడినట్లయితే.. వారి శరీరంలో నీటి కొరత ఏర్పడకుండా చూసుకోవాలి. డీహైడ్రేషన్ వల్ల పిల్లలు డయేరియా బారిన పడే ప్రమాదం ఉంది. అందుకే వారి శరీరానికి సరిపడ ద్రవ పదార్థాలను తాగించాలి.
- పిల్లలకు జలుబు, దగ్గు ఉన్నట్లయితే గోరు వెచ్చని నీటిని తాగించాలి. గోరు వెచ్చని నీటిని తాగించడం వల్ల ఛాతిలో ఏర్పడిన శ్లేష్మం కరిగిపోతుంది. అంతేకాక ముక్కు రంధ్రాల్లో ఏర్పడిన బ్లాక్స్ కూడా తొలగిపోతాయి.
- పిల్లలకు దగ్గు, జలుబు వచ్చినప్పుడు వారికి స్నానం చేయించొద్దు. స్నానానికి బదులుగా గోరు వెచ్చని నీటితో ఒక టవల్ గానీ, స్పాంజీతో గానీ వారి శరీరాన్ని శుభ్రం చేయాలి.
- దగ్గు, కఫం వంటి వాటితో బాధపడుతున్నప్పుడు శొంఠి పొడిని, మిరియాల పొడిని సమపాళ్లలో కలిపి ఆ మిశ్రమానికి కొద్దిగా తేనెను కలిపి అర టీ స్పూన్ మోతాదులో రోజుకు మూడు పూటలా తీసుకోవాలి.
- శొంఠిని, మిరియాలను, పిప్పళ్లను సమపాళ్లల్లో తీసుకుని వేయించి వాటిని పొడిగా చేసి నిల్వ చేసుకోవాలి. ఈ మిశ్రమానికి కొద్దిగా తేనెను కలిపి తీసుకుంటే కఫంతో కూడిన దగ్గు తగ్గుతుంది.
- ఒక కప్పు పెరుగును, ఒక కప్పు నీళ్లను, చిటికెడు దాల్చిన చెక్క పొడిని, చిటికెడు జీలకర్ర పొడిని, రెండు యాలకులను జార్ లో వేసి మిక్సీ పట్టుకుని తాగినా కూడా జలుబు, దగ్గు వంటివి తగ్గుతాయి.

ఆ థియేటర్లలో 'అవతార్-2' రద్దు




లాభాల పంపిణీ విషయంలో థియేటర్ యజమానులు, డిస్ట్రిబ్యూటర్ల మధ్య ఏర్పడిన వివాదం కారణంగా 'అవతార్–2' సినిమా ప్రదర్శనకు కేరళలో చుక్కెదురైంది. డిసెంబర్ 16న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు జేమ్స్ కామెరూన్ బృందం సన్నాహాలు చేస్తోన్న వేళ తమ రాష్ట్రంలోని సుమారు 400 థియేటర్లలో ఈ చిత్రాన్ని ప్రదర్శించబోమంటూ 'ది ఫిల్మ్ ఎగ్జిబిటర్స్ యునైటెడ్ ఆర్గనైజేషన్ ఆఫ్ కేరళ (ఎఫ్ఈయుఓకే)' మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. వాటాల విషయంలో డిస్ట్రిబ్యూటర్లు పెట్టిన షరతులను తాము అంగీకరించడం లేదని, అందుకే ఎఫ్ఈయుఓకే పరిధిలోని థియేటర్లలో 'అవతార్–2' ప్రదర్శన రద్దు చేశామని, ఈ విషయంపై త్వరలోనే చర్చలు జరుగుతాయని తాము భావిస్తున్నామంటూ ఎఫ్ఈయుఓకే అధ్యక్షుడు విజయ కుమార్ తెలిపారు.



'ఆర్ఆర్ఆర్' కు మరో విజయం

దర్శకుడు రాజమౌళి రూపొందించిన 'ఆర్ఆర్ఆర్' సినిమా విడుదలై పలు అవార్డులు సొంతం చేసుకుంది. ఇప్పుడు మరో ఘనత దక్కింది. సన్‌సెట్ సర్కిల్ అవార్డుల్లో ఉత్తమ అంతర్జాతీయ సినిమా విభాగంలో విజేతగా నిలిచింది. బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో ఈ సినిమా మరో నాలుగు అంతర్జాతీయ చిత్రాలతో పోటీపడి ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. ఉత్తమ దర్శకుల విభాగంలో రాజమౌళి రన్నరప్‌గా నిలిచారు. బెస్ట్ ఎడిటింగ్ విభాగంలోనూ ఈ చిత్రం రన్నరప్‌గా ఉంది.

ముగిసిన న్యూజిలాండ్ షెడ్యూల్



హీరో రామ్‌చరణ్, ఎస్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఆర్‌సి 15'. హీరోయిన్‌గా కియారా అద్వానీ నటిస్తున్నారు. కొన్ని రోజులుగా న్యూజిలాండ్‌లో షూటింగ్ జరుపుకుంటోంది. ఈ నేపథ్యంలో తమ షెడ్యూల్ విజయవంతంగా ముగిసిందని తెలుపుతూ మేకర్స్, నటీనటులు, దర్శకుడు కేక్ కట్‌చేసి, సందడి చేశారు. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో ఉంచారు. పొలిటికల్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రంలో ముఖ్యమైన ఘటనలు చిత్రీకరించేందుకు టీం న్యూజిలాండ్ వెళ్లింది. ఈ నేపథ్యంలో అక్కడ చిత్రీకరణలో సన్నివేశాలను అప్పుడప్పుడు రామ్‌చరణ్ ట్వీట్ చేస్తూ అభిమానులను ఉత్సాహపరిచారు. ఈ క్రమంలో అక్కడ షెడ్యూల్ పూర్తి అయినట్లు బృందం ప్రకటించింది. థమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై శిరీష్ సహకారంతో నిర్మాత దిల్ రాజు నిర్మిస్తున్నారు.



చంద్రముఖిగా కంగనా రనౌత్

చంద్రముఖి సీక్వెల్ సినిమాలో బాలీవుడ్ నటి కంగనా రనౌత్ కనిపించనున్నారు. రజనీకాంత్, జ్యోతిక, ప్రభు, నయనతార ప్రధాన పాత్రల్లో పి.వాసు దర్శకత్వంలో 2005లో వచ్చిన 'చంద్రముఖి' ఘన విజయం సాధించింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'చంద్రముఖి 2'ను పి.వాసు. తెరకెక్కిస్తున్నారు. ప్రధాన పాత్ర రాఘవా లారెన్స్ చేస్తున్నారు. అప్పటి 'చంద్రముఖి'లో జ్యోతిక చేసిన చంద్రముఖి పాత్రకు సీక్వెల్‌గా కంగనాను తీసుకున్నారు. డిసెంబరు తొలి వారంలో చెన్నైలో జరగనున్న 'చంద్రముఖి–2' చిత్రీకరణలో ఆమె పాల్గొంటారని సమాచారం.

వేసవిలో సత్యదేవ్ కొత్త సినిమా

సత్యదేవ్, డాలీ ధనంజయ, సత్యరాజ్ ప్రధాన పాత్రలలో ఫైనాన్షియల్ క్రైమ్ యాక్షన్ మూవీ తెరకెక్కుతోంది. చెన్నై బేస్డ్ ప్రొడక్షన్ హౌస్ 'ఓల్డ్ టౌన్ పిక్చర్స్', హైదరాబాద్ బేస్డ్ 'పద్మజ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్' ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ చిత్రానికి 'పెంగ్విన్' ఫేమ్ ఈశ్వర్ కార్తీక్ దర్శకులు. చిత్ర తొలి షెడ్యూల్ ఇప్పటికే పూర్తయింది. 'మంచి స్క్రిప్ట్స్ ఇటీవలి కాలంలో హద్దులను చెరిపేశాయి. మేం కూడా అదే దిశలో సాగుతున్నాం. క్వాలిటీ సినిమాను ప్రేక్షకులకు అందించడం కోసం చేతులు కలిపాం' అంటూ నిర్మాతలు ఎస్.ఎన్.రెడ్డి, బాల సుందరం తెలిపారు. ప్రియా భవానీ శంకర్, సత్య అకల, సునీల్ వర్మ, జెనిఫర్ పిచినెటో ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ సినిమా సెకండ్ షెడ్యూల్ డిసెంబరు 21 నుంచి మొదలవ్వబోతోంది.



ట్యునీషియా చేతిలో ఓడినా నాకౌట్‌కు ఫ్రాన్స్

డెన్మార్క్‌పై గెలిచి ఆస్ట్రేలియా.. గ్రూప్-బి నుంచి ఇంగ్లండ్, అమెరికా కూడా..

ఫిఫా ప్రపంచకప్

దోహా: గ్రూప్–డి నుంచి ప్రి క్వార్టర్స్‌కు డిఫెండింగ్ ఛాంపియన్ ఫ్రాన్స్, ఆస్ట్రేలియా జట్లు ప్రవేశించాయి. బుధవారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఫ్రాన్స్ 0–1తేడాతో ట్యునీషియా చేతిలో ఓడినా.. ఆ జట్టు ఇప్పటికే వరుసగా రెండు మ్యాచుల్లో గెలుపొందడంతో 6పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ట్యునీషియా తరఫున ఏకైక గోల్‌ను వాహ్‌బీ ఖజ్రీ(58వ ని.)లో చేశాడు. ఆ తర్వాత ఫ్రాన్స్ ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై దాడులు చేసిన ప్రయోజనం లేకపోయింది. మ్యాచ్ ముగియడానికి 10 సెకన్ల ముందు ఫ్రాన్స్ గోల్ కొట్టినా అది ఆఫ్‌సైడ్‌గా పరిగణించడంతో ఆ జట్టు మ్యాచ్‌ను డ్రా చేయలేకపోయింది. ఇక మరో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు 1–0తో డెన్మార్క్‌ను ఓడించింది. ఈ గెలుపులో ఆస్ట్రేలియా 6పాయింట్లతో రెండోస్థానంలో నిలిచింది. ఆస్ట్రేలియా జట్టు ట్యునీషియా, డెన్మార్క్‌లపై గెలిచి ఫ్రాన్స్ చేతిలో 4–1తో ఓటమిపాలైంది.


ట్యునీషియాను గెలిపించిన వాహ్‌బీ ఖజ్రీ

గ్రూప్–బి నుంచి నాకౌట్ బెర్త్‌లు ఖరారయ్యాయి. మంగళవారం అర్ధరాత్రి జరిగిన గ్రూప్–బి ఆఖరి లీగ్ మ్యాచ్‌లలో ఇంగ్లండ్ జట్టు వేల్స్‌ను, అమెరికా జట్టు ఇరాన్‌ను ఓడించాయి. దీంతో ఈ రెండుజట్లు గ్రూప్–బిలో టాప్–1లో నిలువగా ఇరాన్, వేల్స్ జట్లు లీగ్ దశలోనే నిష్క్రమించాయి. తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్ జట్టు 3–0గోల్స్ తేడాతో వేల్స్‌ను ఓడించింది. ఇంగ్లండ్ తరఫున మార్కస్ రష్‌ఫోర్డ్(50, 68వ ని.) రెండు గోల్స్ చేయగా.. మరో గోల్‌ను ఫిల్ ఫోడెన్(51వ ని.) చేశాడు. దీంతో ఈ గ్రూప్‌లో ఇంగ్లండ్ 2విజయాలు, ఒక డ్రాతో 7పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. చివరి నిమిషం వరకు ఉత్కంఠభరితంగా సాగిన మరో లీగ్ మ్యాచ్‌లో అమెరికా జట్టు 1–0తో ఇరాన్‌పై గెలిచింది. ఈ గ్రూప్‌లో ఇరాన్ జట్టు వేల్స్‌పై గెలుపొందడంతో ఈ మ్యాచ్‌ను డ్రా చేసుకున్నా ఆ జట్టు నాకౌట్‌కు అర్హత సాధించేది. మరోవైపు అమెరికా జట్టు తొలుత ఇంగ్లండ్, వేల్స్‌తో మ్యాచ్‌లను డ్రా చేసుకోవడంతో ఆ జట్టు నాకౌట్ బెర్త్ దక్కించుకోవాలంటే ఆ జట్టుకు గెలుపు తప్పనిసరి. ఈ క్రమంలో హోరాహోరాగా మ్యాచ్ సాగింది. అమెరికా తరఫున ఏకైక గోల్‌ను క్రిస్టియన్(38వ ని.)చేశాడు. ఈమ్యాచ్‌లో అమెరికా తరఫున ఒక ఆటగాడు, ఇరాన్ తరఫున ముగ్గురు ఆటగాళ్లు ఎల్లోకార్డ్‌కు గురయ్యారు.

గ్రూప్-బి, డి పాయింట్ల పట్టిక

దేశం	ఆ	గె	డ్రా	ఓ	చే.గో.	ఇ.గో.	గో.వ్య.	పా
గ్రూప్–బి								
ఇంగ్లండ్	3	2	1	0	9	2	7	7
అమెరికా	3	1	2	0	2	1	1	5
ఇరాన్	3	1	0	2	4	7	-3	3
వేల్స్	3	0	1	2	1	6	-6	1
గ్రూప్–డి								
ఫ్రాన్స్	3	2	0	1	6	3	4	6
ఆస్ట్రేలియా	3	2	0	1	3	4	-1	6
ట్యునీషియా	3	1	1	1	1	1	0	4
డెన్మార్క్	3	0	1	2	1	3	-2	1

ఫిఫా ప్రపంచకప్‌లో నేడు...

గ్రూప్-ఎఫ్: క్రొయేషియా x బెల్జియం(రా.8.30గం॥లకు)
కెనడా x మొరాకో(రా.8.30గం॥లకు)
గ్రూప్-ఇ: జపాన్ x స్పెయిన్(రా.12.30గం॥లకు)
కోస్టారికా x జర్మనీ(రా.12.30గం॥లకు)

మూడో వన్డే వర్షార్పణం

సిరీస్ 1-0తో న్యూజిలాండ్ కైవసం



క్రైస్ట్‌చర్చ్: భారత్– న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగే మూడో వన్డేకూ వర్షం అడ్డంకిగా నిలిచాడు. బుధవారం టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 47.3ఓవర్లలో 219పరుగులకు ఆలౌటైంది. వాషింగ్టన్ సుందర్ (51) అర్ధసెంచరీకి తోడు శ్రేయస్(49) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. ఓపెనర్, కెప్టెన్ ధావన్(28), శుభ్‌మన్(13) శుభారంభాన్ని అందించలేకపోయారు. మిల్నే, మిచెల్‌కు మూడేసి వికెట్లు, సౌథీకి రెండు, ఫెర్గుసన్, సాంట్నర్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో న్యూజిలాండ్ జట్టు 18ఓవర్లకు వికెట్ నష్టపోయి 104పరుగులు చేసిన అనంతరం మ్యాచ్‌కు వర్షం అడ్డంకిగా నిలిచింది. అలెన్(57), కాన్వే(38నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. ఆ తర్వాత ఎంతసేపటికీ వర్షం తగ్గకపోవడంతో మ్యాచ్‌ను రద్దుచేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. రెండో వన్డే కూడా వర్షం కారణంగా రద్దు కావడం, తొలి వన్డేలో న్యూజిలాండ్ గెలుపొందడంతో సిరీస్‌ను న్యూజిలాండ్ 1–0తో కైవసం చేసుకుంది. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ టామ్ లాథమ్‌కు లభించింది.

ఫైనల్లో మహారాష్ట్ర, సౌరాష్ట్ర

విజయ్ హజారే వన్డే టోర్నీ


రుతురాజ్ (168 పరుగులు)

గుజరాత్: విజయ్ హజారే వన్డే టోర్నమెంట్ ఫైనల్లోకి మహారాష్ట్ర, సౌరాష్ట్ర జట్లు ప్రవేశించాయి. బుధవారం జరిగిన సెమీఫైనల్లో మహారాష్ట్ర జట్టు 12పరుగుల తేడాతో అస్సాంను, సౌరాష్ట్ర జట్టు 5వికెట్ల తేడాతో కర్ణాటకను ఓడించాయి. తొలి సెమీస్‌లో మహారాష్ట్ర జట్టు తొలిగా బ్యాటింగ్‌కు దిగిన నిర్ణీత 50 ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 350పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఓపెనర్, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(168 పరుగులు), అంకిత్ బవ్నే(110) సెంచరీలతో కదం తొక్కారు. ముక్తర్ హుసైన్‌కు మూడు, అహ్మద్, రియాన్ పరాగ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో అస్సాం జట్టు నిర్ణీత 50 ఓవర్లు పూర్తయ్యే సరికి 8వికెట్లు కోల్పోయి 338పరుగులే చేయగలిగింది. స్వరూపమ్(95) తృటిలో సెంచరీని మిస్ చేసుకోగా.. శిబ్‌శంకర్ రాయ్(78), రిషవ్ దాస్(53) అర్ధసెంచరీలతో రాణించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68